Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శనివారం, ఏప్రిల్ 04, 2026 | సంపుటి - 20 | సంచిక 202 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## గ్రూప్-1 నియామకాలపై
# సుప్రీం తీర్పు

**నియామకాలపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన సుప్రీంకోర్టు**

**ఎక్స్ వేదికగా స్వాగతించిన సిఎం రేవంత్**



హైదరాబాద్ : తెలంగాణ గ్రూప్-1 నియామకాలపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు.

తరువాయి 2లో



## రాఘవచద్దాను తొలగిస్తూ
# ఆప్ నిర్ణయం

- సభలో మాట్లాడే అవకాశం ఇవ్వరాదని లేఖ
- ఆప్ తీరుపై మండిపడ్డ రాఘవ్ చద్దా
- ప్రజా సమస్యలపై గొంతెత్తితే తట్టుకోలేరా?
- వీడియో విడుదల చేసిన రాఘవ్ చద్దా



## టెక్స్‌టైల్ రంగంలో
# తెలంగాణ అగ్రగామి

## ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి ప్రోత్సహిస్తాం

- చేనేత, ముత్యాలకు పెట్టింది పేరు తెలంగాణ
- ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్

హైదరాబాద్ : టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు.. చేనేతలకు జీవితం. దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం. ప్రపంచంలోనే ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారింది. చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తాం. పర్యావరణ పరిరక్షణెళి మా తొలి ప్రాధాన్యం అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన టెక్స్‌టైల్ రంగ ప్రముఖులకు స్వాగతం పలుకుతూ, తెలంగాణను ప్రపంచ వస్త్ర రంగ పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వ దార్శనికతను పంచుకున్నారు.తెలంగాణకు వస్త్ర రంగంతో ఉన్న చారిత్రక అనుబంధాన్ని గుర్తుచేశారు. భారతదేశానికి అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర ఉంది. తెలంగాణ గర్వంగా చెబుతోంది.. టెక్స్‌టైల్ మన డిఎన్ఎలోనే ఉంది.

2లో



తెలంగాణ రైజింగ్‌లో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉత్తమ వస్త్రాల రూపకల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర ఉంది. అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా కొన సాగుతోంది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. పెట్టుబడిదారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం.



## గిరిజనుల రిజర్వేషన్లు
# పెంచాం

**తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చాం**

**ఫీజు రియంబర్స్‌మెంట్ కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం**

**బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు**

నారాయణపేట : గిరిజనులకు ఉన్న 6 శాతం రిజర్వేషన్‌ని 10 శాతానికి పెంచిన ఘనత మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనతా ఆయనకే దక్కుతుందన్నారు.

తరువాయి 2లో



## మరో మూడు రోజులు
# పార్లమెంట్

**16 నుంచి తిరిగి సమావేశాలు ప్రారంభం**

**మహిళా రిజర్వేషన్ ,ఎఫ్‌సిఆర్‌ఎ సవరణ బిల్లులపై చర్చ**

2



# బిఆర్ఎస్‌లో ఇంటి గొడవలు

- బిజెపిలో రాముడి రాజకీయం
- ఈ రెండు పార్టీలకు తెలంగాణలో కాలం చెల్లింది
- ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే వందసీట్లు సాధిస్తాం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్

మంచిర్యాల : తెలంగాణ రాజకీయాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఉనికి కోల్పోయిందని, బీజేపీకి రాష్ట్రంలో స్థానం లేదని ఆయన అన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో కాంగ్రెస్ నేతలతో భేటీ అయిన ఆయన.. ఈ మేరకు ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని రకాల కుట్రలు పన్నినా.. కాంగ్రెస్‌పై ప్రజలకు ఎంతో నమ్మకం ఉంది. అందుకు ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో కొంత కాలంగా అంతర్గత కలహాలు కొనసాగుతున్నాయి.

2లో

## స్కూల్ ఫీజుల నియంత్రణ
# చట్టం చేయాలి

- ఆనాడు మాట్లాడిని రేవంత్ ఇప్పుడు మాట్లాడడం లేదు
- టిఆర్ఎస్ పేరు ఖాళీగా ఉంది..ఎవరైనా వాడుకోవచ్చు
- జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ : రాష్ట్రంలో స్కూల్ ఫీజుల గొడవ నడుస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 39,640 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 12,061 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. సీబీఎస్సీ సెంట్రల్ సిలబస్ ఉన్న స్కూల్స్‌లో 25 నుంచి 30 శాతం ఫీజులు పెంచి ఇప్పటినుంచే వసూలు చేస్తున్నారన్నారు.

తరువాయి 2లో

## మరోమారు నోరు పారేసుకున్న ఖవాజా

**భారత్ దాడులు చేస్తే బుద్ధి చెబుతామని హెచ్చరిక**



ఇస్లామాబాద్ : పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. పహల్గాం దాడి జరిగి ఏడాది కావస్తున్న నేపథ్యంలో భారత్ తమపై బెదిరింపులకు పాల్పడు తోందని ఆరోపించారు. ఇవన్నీ చూస్తుంటే వారు తమపై దాడులకు ప్రణాళికలు రచిస్తూ. .రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు అనిపిస్తోందన్నారు.

తరువాయి 2లో

## నేటి నుంచి రబీ
# ధాన్యం కొనుగోళ్లు

**రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,917 కొనుగోలు కేంద్రాలు**

**వెల్లడించిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల**



కాకినాడ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది.. నేటి నుంచి రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలియజేశారు.. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,917 కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు.ఇక, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తామని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు. రైతులు తమ పంటకు సరైన ధర పొందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ధాన్యం నిల్వ మరియు రవాణా విషయంలో కూడా ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసింది. మొత్తం 5.40 కోట్ల గోతాలను సిద్ధం చేసినట్లు, గోతాల కొరత రాకుండా మిల్లర్లతో ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలిపారు.

## ఎపిలో ఒక్కసారిగా మారిన వాతావరణం

**పలు జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం**

**ఈదురుగాలులు కూడా ఉంటాయని హెచ్చరిక**

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అత్యవసర హెచ్చరిక జారీ చేసింది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉండనుందని

2లో

## ఇరిగేషన్ అధికారులు
# తీరు మార్చుకోవాలి



**గత ప్రభుత్వంలో లాగా చేస్తామంటే కుదరదు**

**సిఈలతో వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి నిమ్మల రామానాయుడు**

అమరావతి : గతంలో ప్రభుత్వంలో వ్యవహరించినట్లుగా కాకుండా, ఇరిగేషన్ అధికారులు తీరు మార్చు కోవాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిఈలతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన మంత్రి నిమ్మల నియోజకవర్గాల వారీగా కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీత, వంటి పనులకు సంబంధించిన అంచనాల తయారీపై సమీక్ష నిర్వహించారు. ఆయా పనులకు సంబందించి మార్చి 25వ తేదీలోపు నియోజకవర్గాల వారీగా

తరువాయి 2లో

## గ్రూప్-1 నియామకాలపై సుప్రీం తీర్పు

తెలంగాణ గ్రూప్ -1 ఉద్యోగ నియామకాల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఇది ఉద్యోగ నియామకాల పట్ల తమ ప్రభుత్వ పారదర్శకతకు, చిత్తశుద్ధికి గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. కొలువుల కోసం సంవత్సరాల తరబడి కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసి, కన్నవారి కష్టంపై ఆధారపడలేక, కొలువు వస్తుందో రాదో అన్న దిగులుతో పదేళ్లు కాలం వెళ్లదీసిన గ్రూప్ -1 ఆశావహులకు ఇది పెద్ద ఊరటగా చెప్పుకొచ్చారు. ప్రజా ప్రభుత్వం వచ్చీ రావడంతోనే నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలో నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ నియామకాలను అడ్డుకోవాలనుకున్న దుష్ట శక్తుల కుట్రలను కుతంత్రాలను ఛేదించి, రాష్ట్ర పునర్ నిర్మాణంలో తొలి గ్రూప్ -1 అధికారులుగా యువతను భాగస్వాములను చేశామని వెల్లడించారు. వారికి మరోసారి సీఎం అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వం ఆలోచనలు, సంకల్పానికి అనుగుణంగా టీజీపీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేసి, నిరుద్యోగ యువతకు వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించి, అత్యంత పారదర్శకంగా ఈ నియామకాలను పూర్తి చేసిన టీజీపీఎస్సీ ఛైర్మన్, ఉద్యోగులు, సిబ్బందికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ ట్వీట్ చేశారు.

## రాఘవచద్దాను తొలగిస్తూ ఆప్ నిర్ణయం

న్యూఢిల్లీ : రాజ్యసభలో ఆమ్ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చద్దాను ఆ పదవి నుంచి ఆప్ తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా తాజాగా స్పందించారు. తానేం తప్పు చేశానంటూ పార్టీని బహిరంగంగా ప్రశ్నించారు. ఇలాంటి ప్రయత్నాలతో తన గళాన్ని అణచివేయగలరేమో గానీ.. తనను ఓడించలేరంటూ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. పార్లమెంట్‌లో నాకు ఎప్పుడు మాట్లాడే అవకాశం లభించినా.. ప్రజా సమస్యలనే లేవనెత్తుతా. బహుశా నేను ప్రస్తావించే అంశాలను సభలో సాధారణంగా చర్చించరేమో. కానీ, ప్రజా సమస్యలను ఎత్తిచూపడం ఏమైనా నేరమా అని నిలదీశారు. నేనేమైనా తప్పు చేశానా? పార్లమెంట్‌లో నాకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని మా పార్టీ స్వయంగా రాజ్యసభ సెక్రటరీకి చెప్పింది. అందుకే ఈ రోజు నేను ఈ ప్రశ్నలు అడగాల్సి వచ్చింది. ఎయిర్‌పోర్టుల్లో ఆహార ధరలు, గిగ్ వర్కర్ల సమస్యలు, టోల్ ప్లాజా దోపిడీ, టెలికాం కంపెనీల రీఛార్జ్ విధానాల సమస్యలను లేవనెత్తితే.. అది ఆమ్ఆద్మీ పార్టీకే ప్రయోజనం కదా అని అన్నారు. మొన్నటికి మొన్న వివిధ రకాల పన్నులుపై నిలదీశారు. దీనివల్ల పార్టీకి ఏం నష్టం జరుగుతోంది? ఎందుకు నన్ను మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు? ఇలాంటి చర్యలతో నా గళాన్ని మీరు అణచివేయగలరు. కాని, ఇది నా ఓటమి కాదు. ప్రజలు నా పక్షాన ఉన్నారు. వారికోసం ఎంత దూరమైనా వెళ్తా. నేను నది లాంటి వాడిని. సమయం వచ్చినప్పుడు వరదలా విరుచుకుపడతా అని రాఘవ్ చద్దా తన వీడియోలో పేర్కొన్నారు. రాజ్యసభలో ఆమ్ఆద్మీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా రాఘవ్ చద్దాను తొలగించిన ఆప్.. ఆ హోదాలో మరో ఎంపీ అశోక్ మిత్తల్‌ను నియమించింది. ఆప్ నిర్వహిస్తున్న కార్యకలాపాలకు చద్దా దూరంగా ఉంటుండటం, పార్టీ కార్యక్రమాలపై స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రాఘవ్ చద్దా భాజపాలో చేరనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తోన్న వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం తీవ్ర చర్చనీయాంశ మైంది.ఎంపి రాఘవ చద్దాని ఉపనాయకుడి పదవి నుంచి తొలగించాలని గురువారం రాజ్యసభ సచివాలయానికి ఆ పార్టీ లేఖ రాసింది. సభలో రాఘవ చద్దాని మాట్లాడనివ్వకూడదని కూడా ఆ లేఖలో ఆప్ పేర్కొంది. దీనిపై ఆప్ ఎంపి రాఘవ్‌చద్దా శుక్రవారం స్పందించారు. పార్లమెంటులో ప్రజా సమస్యలను లేవనెత్తడం నేరమా? నేను ఏదైనా తప్పు చేశానా? అని ఆప్‌ని ప్రశ్నించారు. ఈ మేరకు ఓ వీడియోను ఆయన శుక్రవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. నాకు ప్రజల మద్దతు ఉంది. నా మౌనాన్ని నా ఓటమిగా పొరపాటు పడకండి అని రాఘవ్ చద్దా వీడియోలో తెలిపారు.

## ఎపిలో ఒక్కసారిగా మారిన వాతావరణం

ఆయా జిల్లాల యంత్రాంగం ఇప్పటికే అప్రమత్తమైంది. వర్షంతో పాటు గంటకు 40 నుండి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండవద్దని సూచించారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, పొలాల్లో పనిచేసే రైతులు, పశువుల కాపరులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు రావొద్దని, ప్రయాణాలను వాయిదా వేసుకోవడం ఉత్తమమని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల వారు స్థానిక అధికారుల సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మరో వైపు తెలంగాణలోనూ రానున్న 3 రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో వర్షం పడే అవకాశముంది. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, జనగామ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

## యుఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండీపై వేటు

### ఎప్‌స్టీన్ వ్యవహారంలో సరిగా వ్యవహరించలేదన్న ఆరోపణ

వాషింగ్టన్ : యుఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండీని ఆ పదవి నుండి ట్రంప్ యంత్రాంగం గురువారం తొలగించినట్లు వైట్‌హౌస్ తెలిపింది. అంతర్జాతీయంగా వివాదాస్పదమైన లైంగిక నేరగాడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబందించిన దర్యాప్తు పత్రాల నిర్వహణ సహా పలు అంశాలపై ట్రంప్ అసహనం వ్యక్తం చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా తాను దర్యాప్తు ఎదుర్కోవాలని కోరుకున్న విమర్శకులు, ప్రత్యర్థులపై అభియోగాలు మోపడంలో బోండీ తగిన విధంగా వ్యవహరించకపోవడం ట్రంప్‌ను తీవ్ర అసహనానికి గురిచేసినట్లు తెలిపాయి. పామ్ బోండీ పదవి నుండి తొలగింపబడిన రెండవ సీనియర్ అధికారి. మార్చి5న హోంల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టీ నోమ్‌ను ట్రంప్ పదవి నుండి తొలగించిన సంగతి తెలిసిందే. ఆ శాఖ నిర్వహణ తీరుపైనా, ట్రంప్ వలసవిధాన అజెండాపై వచ్చిన తీవ్ర విమర్శలతో క్రిస్టీ నోమ్‌ను పదవి నుండి తొలగించారు. యుఎస్ అటార్నీ జనరల్‌గా బోండీ తన పదవీ కాలంలో ట్రంప్ అజెండాకు గట్టి మద్దతుదారుగా నిలిచారు. న్యాయశాఖ తన దర్యాప్తులో వైట్‌హౌస్ నుండి స్వతంత్రంగా వ్యవహరించే సుదీర్ఘ సాంప్రదాయాన్ని ఇది నాశనం చేసింది. ట్రంప్ మిత్రులు, కొంతమంది రిపబ్లికన్ చట్టసభ్యులు సహా ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై వచ్చిన విమర్శలు ఆమెను చుట్టుముట్టాయి. పలు రాజకీయ శక్తులు, కార్పోరేట్ అధిపతులు, ఆర్థిక సంస్థలు, పలుకుబడి కలిగిన వ్యక్తులు, కుబేరులతో ఎప్‌స్టీన్ సంబంధాలను అమెరికా న్యాయవ్యవస్థ డోజ్ జరిపిన దర్యాప్తు రికార్డులు వెల్లడికాకుండా అడ్డుకున్నారని, దుర్వినియోగం చేశారని ఆమెపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఈ అంశం ట్రంప్‌కు రాజకీయంగా తలనొప్పులు సృష్టించడంతో పాటు దశాబ్దాల క్రితం ముగిసిపోయిందని ఆయన ప్రకటించిన ఎప్‌స్టీన్‌తో సంబంధంపై తిరిగి నిశిత దర్యాప్తు చేపట్టేలా చేసింది. అయితే ఆమె తొలగింపు న్యాయశాఖలో భారీ మార్పులకు దారితీయవచ్చని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకున్న వారిపై డోజ్‌ను ప్రయోగించే దిశగా నూతన యత్నాలు చేపట్టవచ్చని పేర్కొన్నారు.

# టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణ అగ్రగామి

నిజాం కాలంలోనే ప్రపంచ నలుమూలల నుండి వ్యాపారులు హైదరాబాద్ కు వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేసేవారు అని ఆయన పేర్కొన్నారు. కేవలం పరిశ్రమగానే కాకుండా, ఇది లక్షలాది మందికి జీవనాధారమని.. పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, వరంగల్ దుర్రీస్ వంటివి మన సంస్కృతికి ప్రతీకలని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047' గురించి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధిపై స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను వివరిస్తూ, 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను సీఎం ప్రకటించారు. ఇందులో భాగంగా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడమే లక్ష్యం అని పేర్కొన్నారు. ఇంకా 2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాలోనే టెక్స్‌టైల్ రాజధానిగా మార్చడమే మా సంకల్పం అని అన్నారు. అలాగే వరంగల్‌లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని, పత్తి ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రగామిగా ఉందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా పెట్టుబడిదారులకు ఆయన పిలుపునిస్తూ.. 'మీకు విజన్ ఉంటే, మేము మీకు సరైన భాగస్వాములం. మౌలిక సదుపాయాలు, భూమి, విద్యుత్, నీరు, వేగవంతమైన అనుమతులతో పాటు ప్రపంచ స్థాయి విధానాలను మా ప్రభుత్వం అందిస్తుంని అంటూ హామీ ఇచ్చారు. డీప్ టెక్, ఫార్మా, ఏరోస్పేస్ వంటి రంగాల్లో ఇప్పటికే ముందంజలో ఉన్న తెలంగాణ, ఇప్పుడు టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్ ను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. మరోవైపు హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ సినిమా నిర్మాణ కేంద్రంగా ఎదుగుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలను ప్రారంభించడాన్ని ఆయన ప్రస్తావించారు. టాలీవుడ్, బాలీవుడ్ మాత్రమే కాక హాలీవుడ్ కూడా హైదరాబాద్ ను కేంద్రంగా చేసుకుంటున్న తరుణంలో సినిమా రంగానికి అవసరమైన ఫ్యాషన్ ను కూడా తెలంగాణ నుంచే అందించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ 'గ్రీన్ టెక్స్‌టైల్ హబ్' లను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.

## మరో మూడు రోజులు పార్లమెంట్

న్యూఢిల్లీ : మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లు, ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లు వంటి ముఖ్యమైన బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలను పొడిగించేందుకు ప్రయత్నిస్తోంది. గురువారం బడ్జెట్ సమావేశాల రెండో దశ ముగిసిన తరువాత పార్లమెంట్ నిరవధికంగా వాయిదా పడుతుందని భావించారు. అయితే, సభా కార్యకలాపాలు ముగిసిన తరువాత, ఈ నెల 16న ఉదయం 11 గంటల వరకు సభ వాయిదా పడుతుందని అధికారిక ప్రకటన వెలువడింది. లోక్‌సభ, శాసనసభలలో సీట్లను పెంచేందుకు, మహిళా రిజర్వేషన్లను అమలు చేసేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించేందుకే సమావేశాలను పొడిగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అదే సమయంలో విమర్శలు ఎదుర్కొంటున్న ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లును కూడా ఆమోదించితీరాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లుపై పార్లమెంట్ లోపల, వెలుపల భారీ నిరసనలు వెల్లువెత్తిన సంగతి విదితమే. కేరళం శాసనసభ ఎన్నికల ముందు ఈ బిల్లు ఆమోదం పొందితే బిజెపికి పెద్ద ఎదురుదెబ్బ తగులుతుందని కూడా కేంద్ర ప్రభుత్వం గ్రహించింది. కేరళలో ఎన్నికల తరువాత పార్లమెంట్ తిరిగి సమావేశమవుతుంది. ఈ పరిస్థితుల్లో, ప్రత్యేక సమావేశంలో ఎఫ్‌సిఆర్ఎ బిల్లును కూడా ఆమోదిస్తారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మహిళా రిజర్వేషన్లను అమలు చేయడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణలను ఎలా అమలు చేయాలన్న ప్రతిపక్షాల ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఇంకా సమాధానం ఇవ్వలేదు. రాజ్యాంగ సవరణను ఆమోదించడానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపక్షాల మద్దతు కూడా అవసరం. అయితే, అఖిలపక్ష సమావేశం నిర్వహించడానికి గానీ, ప్రతిపక్షాల సందేహాలకు వివరణ ఇవ్వడానికి గానీ కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలకు అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేయడానికి ప్రయత్నిస్తోందన్న అనుమానం వ్యక్తమవుతోంది. లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య పెంపు, మహిళా రిజర్వేషన్ చట్టం సత్వర అమలు వంటి కీలక బిల్లుల కోసం మూడురోజుల పాటు సమావేశాలు కొనసాగే అవకాశాలున్నాయని, ఈ విషయాన్ని విపక్షాలకు ప్రభుత్వం తెలిపిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మహిళా రిజర్వేషన్ కోటా అమలు బిల్లుపై, జనగణనతో నియోజకవర్గాల పునర్విభజనకు ఉన్న లంకెను విడదీయడంపై విపక్షంతో ప్రభుత్వం లోపాయికారీ సంప్రదింపులు జరుపుతోందని తెలుస్తోంది. కేంద్ర సాయుధ పోలీసు దళాల (సీఏపీఎఫ్‌ల)కు ఒకే విధమైన ఉద్యోగ నిబంధనలు ఉండేందుకు ప్రతిపాదించిన బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభ ఆమోదించి పంపిన ఈ బిల్లును లోక్‌సభ కూడా మూజువాణి ఓటుతో ఆమోదించింది.

## బిఆర్ఎస్‌లో ఇంటి గొడవలు

కేసీఆర్ కుటుంబంలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. కవిత వేరు కుంపటి పెట్టుకోవడంతో బీఆర్ఎస్ పరిస్థితి రోడ్డున పడిందన్నారు. పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు దూరమై.. కేవలం తన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఆయన అసెంబ్లీకి కూడా రావడం లేదు. ఇలాంటి పరిస్థితిలో బిఆర్ఎస్ రోజురోజుకు దిగజారుతోందని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీ.. దేవుళ్ల పేరు చెప్పి ఓట్లు అడుగుతోంది. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు.. అందుకే ఆ పార్టీని దూరం పెడుతున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుంది. రాష్ట్రంలో 100 సీట్లు ఖాయం' అని అన్నారు. బీజేపీ కులం, మతం పేరుతో రాజకీయాం చేస్తోందని..ఆ పార్టీకి తెలంగాణలో స్థానం లేదని విమర్శించారు. రాముడేమైనా బీజేపీ జాగీరా.....వాళ్ల పార్టీల సభ్యత్వం ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేనట్టుగా తెలంగాణలో ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. సన్నబియ్యం పథకం దేశంలోనే చారిత్రాత్మకమన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు కాంగ్రెస్ కడుతోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో నేతల జేబుల్లోకి డబ్బులు వెళ్లాయన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు స్కీం సక్సెస్ గా నడుస్తోందన్నారు. బీజేపీ రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వట్లేదన్నారు. కేంద్రం లాభాల్లో ఉన్న సంస్థలను అమ్మేస్తోందని విమర్శించారు. 12 ఏండ్లలో కేంద్రం ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు మహేశ్ కుమార్ గౌడ్. ఇందిగాంధీ నుంచి రాహుల్ వరకు పేదల కోసం పనిచేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారని అన్నారు. దోచుకున్న సొత్తులో వాటాల గొడవలతో ఆ పార్టీ రోడ్డున పడిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ కు 100 సీట్లు గ్యారంటీ అని ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సమ్మిట్ తో 5 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయన్నారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని చెప్పారు మహేశ్ కుమార్ గౌడ్. ఈ కర్యాక్రమంలో మంత్రి వివేక్‌తో పాటు స్థానిక నేతలు పాల్గొన్నారు.

## గిరిజనుల రిజర్వేషన్లు పెంచాం

నారాయణపేట జిల్లా మద్దూరు మండలం బావోజీ జాతరకు మాజీ మంత్రులు హరీశ్ రావు, శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..'లోక్ మసంద్ మహారాజ్ జాతరకు రావడం సంతోషంగా ఉంది. ఈ ప్రాంతానికి రూ.8 కోట్లతో బ్రిడ్జి వేయించింది మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి. ఈ దేవాలయ అభివృద్ధికి, గిరిజనుల అభివృద్ధికి కేసీఆర్ ఎంతో చేశారు. మా తండాలో మా రాజ్యం అంటే ఎవ్వరూ పట్టించుకోలేదు. తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌ది. అన్ని రంగాల్లో కేసీఆర్ వారికి రిజర్వేషన్లు తెచ్చారు. గిరిజనులకు ఇప్పుడు కాంగ్రెస్ చేసింది గుండు సున్నా. ఎస్సీ, ఎస్టీలకు డిక్లరేషన్ ఇచ్చి వారు చేసిందేమీ లేదు. రూ.2,730 కోట్లు ఎస్టీలకు బ్జడెట్‌లో పెట్టి కేవలం రూ.50 కోట్లే ఖర్చు చేశారు. గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు.. ఒక్కరికీ ఇవ్వలేదు. పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యకు దూరం చేస్తున్నారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్లు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కూడా ఇవ్వడం లేదని ఆక్షేపించారు. సంత్ సేవాలాల్ కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు ప్రకటించి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఎస్టీల ఓట్లు కావాలిగానీ, వాళ్ల సంక్షేమం పట్టించుకోరా?అని ప్రశ్నించారు. కేరళలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అమలు చేశామని బడాయి మాటలు చెబుతున్నారని విమర్శించారు. మా లంబాడీలను దగా చేశారు. సీఎం రేవంత్, ఆయన మనుమడు ఫుట్ బాల్ ఆడేందుకు డబ్బులు ఉంటాయి కానీ ఎస్టీలకు ఇచ్చేందుకు లేవా?. లగచర్లలో లంబాడీల భూములు గుంజుకుని సీఎం రేవంత్ రెడ్డి వారిని జైలులో పెట్టారు. ఇక్కడ చేసింది చాలదని కేరళకు పోయి గొప్పలు చెబుతున్నారు. ఇంట్లో ఈగల మోత అంటే కేరళపోయి పల్లకీల మోత అన్నట్లు ఉంది. కొడంగల్ నియోజకవర్గంలో ఏ గ్రామంలో రుణమాఫీ వంద శాతం జరిగిందో రేవంత్ చూపించాలని సవాల్ చేశారు. నేను కొడంగల్ వచ్చినా గ్రామసభల్లో మీ నాయకులను జనం నిలదీస్తున్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేశారు. ప్యాకేజ్-3లో కొంత పని మాత్రమే మిగిలి ఉంది. త్వరగా ఆ పని పూర్తి చేస్తే కేసీఆర్‌కు పేరొస్తుందని చేయల్లేదు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం. మీ నిర్లక్ష్యం వల్ల పాలమూరు ప్రజలకు అన్యాయం జరిగిందని అన్నారు.

## కువైట్ చమురుశుద్ధి కర్మాగారంపై దాడి

### డ్రోన్లతో విరుచుకు పడ్డ ఇరాన్
### పెద్ద ఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ ప్రకటన

కువైట్ సిటీ,ఏప్రిల్3 : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. శుక్రవారం కువైట్ లోని ప్రధాన చమురుశుద్ధి కర్మాగారం మీనా అల్-అహ్మదిపై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడింది. దీంతో ఆ ప్రాంతంలో భారీఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రకటించింది. మంటలు అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొంది. ఈ దాడిలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని తెలిపింది. ప్రపంచంలోని అతిపెద్ద చమురు శుద్ధి కర్మాగారాల్లో మీనా అల్-అహ్మది ఒకటి. కువైట్ చమురు ఉత్పత్తికి ఇది చాలా కీలకం. మీనా అల్-అహ్మది కర్మాగారం నుంచి రోజుకు 3,46,000 బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేస్తారు. దాదాపు లక్షల బ్యారెళ్ల మేర డీజిల్, ఇతర శుద్ధి చేసిన ఇంధనాలను ఆసియా, యూరప్‌లోని మార్కెట్లకు ఎగుమతి చేస్తూ.. ప్రభుత్వానికి కీలకమైన ఆదాయ వనరుగా నిలుస్తోంది. ఈ కర్మాగారం లేకపోతే అక్కడ ఉత్పత్తి అయ్యే చమురును శుద్ధి చేయలేక బావులను మూసివేయాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఇక్కడినుంచి భారత్‌తో సహా ఇతర ప్రపంచదేశాలు చమురు దిగుమతి చేసుకుంటాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రస్తుతం భారత్.. కువైట్ నుంచి చమురు దిగుమతులు నిలిపివేసింది. జాతీయ ఆయిల్ కంపెనీపై డ్రోన్ దాడి జరిగినట్లు కువైట్ న్యూస్ ఏజన్సీ శుక్రవారం పేర్కొంది. దీంతో పలు యూనిట్లలో మంటలు చెలరేగాయని తెలిపింది. ఉదయం మినా అల్-అహ్మదీ రిఫైనరీ లక్ష్యంగా డ్రోన్ దాడి జరిగిందని కువైట్ పెట్రోలియం కార్పోరేషన్ (కెపిసి) మీడియాకు తెలిపింది. ఫలితంగా పలు యూనిట్లలో మంటలు చెలరేగాయని, అత్యవసర బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని పేర్కొంది. గల్ఫ్ భూభాగంపైకి ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్‌లను వైమానిక రక్షణవ్యవస్థ సమర్థవంతంగా అడ్డుకుంటుందని కువైట్ సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. దేశవ్యాప్తంగా సైరన్‌లు మోగుతున్నాయని బహ్రెయిన్ అంతర్గత మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేసింది. మరిన్ని వివరాలు వెల్లడించేందుకు నిరాకరించింది.

## బైక్‌ను బలంగా ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

### ముగ్గురు యువకుల దుర్మరణం

అనకాపల్లి,ఏప్రిల్3 : అనకాపల్లి జిల్లాలో అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఎలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం జంక్షన్ వద్ద రాత్రి 12 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనాన్ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు అనకాపల్లికి తరలిస్తుండగా చనిపోయారు. మృతి చెందిన ముగ్గురు యువకులు ఎలమంచిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. మృతులు బంగారు నాని(24), గోవిందు (25) , పోతిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బంగారి దుర్గాప్రసాద్(16)గా గుర్తించారు. మృతుల్లో ఇద్దరు పెయింటింగ్ పనులు చేసుకోగా, మరో యువకుడు చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువకుల మృతి సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## మరోమారు నోరు పారేసుకున్న ఖవాజా

మరోసారి తమతో ఘర్షణకు దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తమపై జరిగే దాడులను వేగవంతమైన, ప్రణాళికాబద్ధమైన ప్రతిస్పందనతో తిప్పికొడతామన్నారు. ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని పొరుగుదేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇటీవల కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ పాక్‌ను హెచ్చరించారు. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్‌లను గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

బీఆర్ఎస్ ఉన్నప్పుడు ఫీజు నియంత్రణ చట్టం చేయాలని రేవంత్ రెడ్డి పదే పదే మాట్లాడారని గుర్తుచేశారు. ఎవరెంత తిన్నారంటూ అసెంబ్లీలో చర్చ చేసుకున్నారే తప్ప ఫీజుల నియంత్రణపై మాట్లాడలేదని విమర్శించారు. ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి ఫీజు నియంత్రణ చట్టం వెంటనే తేవాలని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఫీజులను పెంచుతున్నాయే తప్ప టీచర్లకు మాత్రం జీతాలు పెంచరని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీల్లో ఆహార నాణ్యతను ప్రభుత్వం పట్టించుకోదా అని ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలలు, ఆసుపత్రులను సీఎం ప్రారంభిస్తున్నారని... వాళ్ళ దోపిడిని ఎంకరేజ్ చేస్తున్నారా అంటూ నిలదీశారు. ప్రైవేట్ స్కూల్స్ దోపిడీని కంట్రోల్ చేయాలని ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే స్కూల్స్ ముందు ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. 'అన్ని శాఖలకు ముఖ్యమంత్రే మంత్రిగా ఉండటం మన కర్మ' అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో తనను నిజామాబాద్‌కు పరిమితం చేశారని అన్నారు. ఆంధ్రా, నార్త్ ఇండియా వాళ్ళు ఇక్కడ విద్యా సంస్థలు నెలకొల్పినా తెలంగాణ వాళ్ళకే అవకాశం ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు.అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్ యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని.. అధిక ఫీజుల వసూళ్లను కట్టడి చేయాలని కోరారు.తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఫ్రీ అయిందని.. ఇప్పుడు దాన్ని ఎవరైనా వాడుకోవచ్చన్నారు. ఆచార్య జయశంకర్ సిద్దాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి బిహార్ సిద్ధాంతకర్త అంటూ ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు.

## నేటి నుంచి రబీ ధాన్యం కొనుగోళ్లు

అలాగే ధాన్యం రవాణా కోసం 17,200 లారీలను జీపీఎస్ సదుపాయంతో సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మొత్తంగా, ఈసారి రబీ ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా, వేగంగా జరిగేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు ..

## ఇరిగేషన్ అధికారులు తీరు మార్చుకోవాలి

అంచనాలు రూపొందించి పంపించాలని ఆదేశించినా, ఇప్పటివరకు కొంత మంది చీఫ్ ఇంజనీర్లు సరిగా అంచనాలు సమర్పించకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, మట్టి పూడిక తీత వంటి పనులు చేయడానికి ఏప్రియల్, మే, నెలలో మాత్రమే అవకాశం ఉంటుంది. ఆతరువాత ఖరీఫ్ సీజన్ మొదలైతే పనులు చేయడానికి అవకాశం ఉండదని, గతంలో ఏప్రియల్, మే నెలలో చేయాల్సిన పనులకు జూన్ లో అనుమతులు ఇచ్చేవారని, పనులు మొదలుపెట్టిన వెంటనే కాలువలకు నీళ్ళు వదిలేవారని, దీంతో పనులు సగంలోనే వదిలేయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఇలా చేయడం వల్ల ఆయకట్టు చివరన ఉన్న పొలాలకు సాగు నీరందక రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని, ఇలా గతంలో వ్యవహరించిన తీరులో కాకుండా ముందుగానే అంచనాలు రూపొందించి, ఆర్ధిక శాఖ అనుమతులు పొందితే సీజన్ మొదలయ్యేలోగా పనులు కూడా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. కావున నియోజకవర్గాల వారీగా పనులకు సంబందించిన అంచనాలను ఆదివారం సాయంత్రం లోగా పంపాలని సిఈలను ఆదేశించారు. గడువులోగా అంచనాలను పంపని అధికారులు సోమవారం అమరావతి సచివాలయంకు వచ్చి అంచనాలు ఎందుకు పంపలేకపోయారో సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంటుందని తీవ్రంగా మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అత్యవసర పనుల కింద నిధులు విడుదల చేసి, కాలవల్లో పూడిక తీత, తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులను చేయడం ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరందించగలిగామని తెలిపారు. గత 5ఏళ్ళ వైసిపి ప్రభుత్వ పాలనలో కనీస నిర్వహణ పనులు సైతం పట్టించుకోకపోవడంతో ఆయకట్టు చివరి ఎకరం వరకు నీరందక రైతులు ఇబ్బంది పడ్డారని, నేడు కూటమి ప్రభుత్వం ప్రతి ఎకరాకు సాగు నీరందించడమే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామని స్పష్టం చేశారు. కావున అధికారులు నిర్లక్ష్యం వదిలి గడువులోగా ఇరిగేషన్ పనులకు సంబందించిన అంచనాలు సమర్పించి, సీజన్ మొదలయ్యేలోగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# తెలంగాణలో ఏం చేశారని కేరళం ప్రచారం వెళ్లారు

### సిఎం రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి విమర్శలు

హైదరాబాద్,ఏప్రిల్3 : కేరళ ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి భాజపాపై తప్పుడు ఆరోపణలు చేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆరు గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిలో ఎన్ని నెరవేర్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఏం చేశారని, కేరళలో రేవంత్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ చేసిన తరహాలోనే రేవంత్‌రెడ్డి కూడా ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. బీసీలకు మేం అన్యాయం చేశామని అంటున్నారు.. బీసీలకు కాంగ్రెస్ ఏం చేసిందో రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసగించింది కాంగ్రెస్ పార్టీయేనని దుయ్యబట్టారు. ఆరు గ్యారంటీలు అమలు చేసినట్లు కేరళలో గొప్పలు పలుకుతున్న రేవంత్.. భవిష్యత్‌లో తెలంగాణలోనూ అదే తరహా మాటలు చెప్పే ప్రమాదముందని అన్నారు.

# మేడారంలో తీవ్ర విషాదం

### రాతి కట్టడం కూలి బాలుడికి గాయాలు
### ఆస్పత్రి తీసుకెళ్లగా కాలు తీసేసిన వైద్యులు

ములుగు,ఏప్రిల్3 : ప్రముఖ పుణ్యక్షేత్రం మేడారంలో తీవ్ర విషాదం నెలకొంది. ఊహించని రీతిలో జరిగిన ప్రమాదం.. ఒక చిన్నారి జీవితంలో చీకటిని నింపింది. మేడారం పూజారి సిద్ధబోయిన రమేశ్ కుమార్ కొడుకు యువన్‌పై ఒక్కసారిగా రాతి కట్టడం కూలి పడటంతో ఈ దారుణం జరిగింది. వెంటనే తల్లిదండ్రులు చిన్నారిని ఆసుపత్రికి తరలించారు. బాలుడు యువన్ ఆడుకుంటున్న సమయంలో సమీపంలోని ఒక రాతి కట్టడం ఒక్కసారిగా అతడిపై పడింది. ఈ ప్రమాదంలో బాలుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే యువన్ తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బాలుడిని తల్లిదండ్రులు హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గాయం తీవ్రంగా ఉండటంతో ఇన్ఫెక్షన్ సోకకుండా ఉండేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో కాలును తొలగించాల్సి వచ్చిందని వైద్యులు తెలిపారు. తమ కళ్ల ముందు ఆడుకోవాల్సిన బిడ్డ.. ఇలా కాలు కోల్పోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో వారి ఆవేదన చూసి స్థానికులు సైతం చలించిపోయారు.

# ఆగివున్న లారీని ఢీకొన్న కారు

## ఇద్దరు అక్కడికక్కడే మృతి

కరీంనగర్,ఏప్రిల్3 : జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కరీంనగర్ –పెద్దపల్లి బైపాస్‌లో బొమ్మకల్ ఫ్లై ఓవవర్ వద్ద ఆగివున్న లారీని ఓ కారు పక్క నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదంలో కారు ఒకవైపు భాగం మొత్తం నుజ్జునుజ్జ అయ్యింది. ఘటనాస్థలిని పరిశీలించిన పోలీసులు.. మృతులను సయ్యద్ అబ్దుల్ రెహమాన్ (19), సయ్యద్ అతియాబ్ హుస్సేన్ (21)గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ఎండీ అదునాన్ తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ఇక ఎండీ అబ్రార్ కారులో నుంచి దూకడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడని పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

# కల్తీ మామిడి పండ్లతో జాగ్రత్త

### కార్బైడ్ మామిడి పల్లను గుర్తించండి: సజ్జన్నార్

హైదరాబాద్,ఏప్రిల్3 : మామిడిపండ్ల సీజన్ ప్రారంభం అయ్యింది. నగరంలో నోరూరించే పళ్లు కనిపిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు వ్యక్తులు కల్తీ మామిడి విక్రయాలకు పాల్పడటం ఆందోళనకు గురిచేసే విషయం. మామిడి పండ్లను కాల్షియం కార్బైడ్ రసాయనాలతో కృత్రిమంగా పండించి విక్రయిస్తున్న వ్యాపారుల పట్ల జాగ్రత్త అవసరం. ఈ కల్తీ పండ్ల వల్ల ఆరోగ్య సమస్యలు రావడమే కాకుండా క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటుందంటున్నారు నిపుణులు. ఈ విషయమై హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ.సజ్జనార్ ఎక్స్ వేదికగా స్పందించారు. వేసవి కాలం రాకతో మామిడి మార్కెట్‌లో సందడి చేస్తోందని సజ్జనార్ అన్నారు. అయితే.. నోరూరించే ఈ ఫలాల మాటున ప్రాణాంతకమైన విషకోరలు దాగున్నాయన్న నిజాన్ని ప్రజల మరవకూడదని హెచ్చరిస్తూ.. 'కల్తీ మామిడి పండ్లతో తస్మాత్ జాగ్రత్త!' అని ఎక్స్ వేదికగా వివరించారు. మార్కెట్లలో ఎక్కడైనా కల్తీ మామిడి పండ్లను విక్రయించినా, ఆ సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100కి గానీ, హెచ్–ఫాస్ట్ ఫోన్ నంబర్ 8712661212కు కాల్ చేయాలని సజ్జనార్ సూచించారు.

## దొడ్డి కొమురయ్యకు కెసిఆర్ నివాళి

హైదరాబాద్,ఏప్రిల్3 : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా వారికి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఘన నివాళి అర్పించారు. ప్రజా వ్యతిరేక పాలన మీద తెలంగాణ ప్రజల తిరుగుబాటుకు సంకేతంగా నిలిచిన కొమరయ్య గారి అమరత్వం, నాటి రాచరిక పాలకుల నుంచి నేటి ప్రజా వ్యతిరేక పాలకుల మీద సాగుతున్న ప్రజా పోరాటలకు స్ఫూర్తిగా నిలిచిందని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపించి, రాష్ట్రాన్ని సాధించి, అనంతరం పదేండ్లపాటు బాలారిష్టాలను అధిగమించి, స్వయం పాలనను దేశానికే ఆదర్శంగా నిలబెట్టుకోవడంలో అమరుల త్యాగాల స్ఫూర్తి ఇమిడి ఉన్నదని కేసీఆర్ అన్నారు.

# కేరళంలో రేవంత్ అబద్దాల ప్రచారం

### ఆరు గ్యారెంటీలపై అబద్దాలతో మోసం
### కెసిఆర్ లాగే అబద్ధాల ప్రచారం అందుకున్న రేవంత్
### తెలంగాణలో అమలు చేయని పథకాలను ప్రచారం చేస్తారా
### ఇది క్షమించరాని మహాపరాథం... ప్రజలను మోసం చేసే యత్నం
### సిఎం రేవంత్ ప్రచారంపై మండిపడ్డ కిషన్ రెడ్డి



హైదరాబాద్,ఏప్రిల్3 : కేరళంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్దాల ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించారని, ఇది తెలంగాణ ప్రజలను మోసం చేయడమేనని రేవంత్ పర్యటనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రేవంత్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు తెలంగాణలో పూర్తిగా విఫలమయ్యాయని.. ఒక్క పథకం కూడా సమర్థవంతంగా అమలు కాలేదన్నారు. అమలు చేయని పథకాలను అమలు చేసినట్టు చెప్పడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని మండిపడ్డారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేశామని, కావాలంటే కేరళ ప్రజలు వచ్చి చూడాలని చెప్పడం విడ్డూరం ఉందని అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇది సాధారణ అబద్ధం కాదని.. ప్రజలను మోసం చేసే ప్రయత్నమని కిషన్ రెడ్డి ఆగ్రహించారు. సీఎం రేవంత్ రెడ్డివి మోసం చేసే రాజకీయాలు. గతంలో కేసీఆర్ ఎలా హామీలు ఇచ్చి అమలు చేయలేదో, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే మార్గంలో నడుస్తున్నారు. అమలు చేయకపోయినా 'చేశామని అనుకోండి' అనే ధోరణి ప్రమాదకరం అని హెచ్చరించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పారు, ఇచ్చారా?. పెన్షన్లు రూ.2,000 నుంచి రూ.4,000 చేస్తామని, దివ్యాంగులకు రూ.3,000 నుంచి రూ.6,000 చేస్తామని చెప్పారు, అమలు చేశారా?. దళిత కుటుంబాలకు రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు.. ఇచ్చారా?. బీసీలకు రూ.లక్ష కోట్లు కేటాయిస్తామని చెప్పారు.. రెండు సంవత్సరాల పాలనలో ఒక్క ఏడాది కూడా రూ.20 వేల కోట్లు ఇవ్వలేకపోయారు. ఇవన్నీ కేరళ ప్రజలకు చెప్పగలరా?. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయకపోవడం మోసమైతే.. అమలు చేశామని చెప్పడం మరింత పెద్ద మోసం. తప్పుడు ప్రచారం, అబద్దాలు చెప్పడం ప్రజలను దగా చేయడమేని అన్నారు. తెలంగాణలో పెళ్లయిన ఆడబిడ్డలకు తులం బంగారం ఎక్కడ?. ఉచిత ఎలక్ట్రిక్ స్కూటర్లు ఎక్కడ?. నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ?. నిరుద్యోగ భృతి ఎక్కడ?. ఈ హామీలన్నీ ఎక్కడికి పోయాయి?. ఇవన్నీ చేయకపోయినా.. గ్యారెంటీలు అమలు చేశామని కేరళంలో రేవంత్ రెడ్డి చెప్పడం ఎంత పెద్ద మోసమో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ మాటలను నమ్మకండి. ఇప్పటికే లెఫ్ట్ పార్టీలు కేరళం ప్రజలను మోసం చేశాయి. గత 10 సంవత్సరాలుగా అభివృద్ధిని అడ్డుకున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ వస్తే అవినీతి మరింత పెరుగుతుందన్నారు. రేవంత్ రెడ్డి మాటలకు కేరళంలో విలువ లేదు. ఆయన ఎందుకు అక్కడికి వెళ్లారో అందరికీ తెలుసు. తెలంగాణ నుంచి డబ్బులు పంపుతున్నారనే అనుమానాలు ప్రజల నుంచి వస్తున్నాయి. అందుకే ఆ పార్టీ నాయకులను అక్కడికి పిలుస్తున్నారు. ఉపన్యాసాలు ఇవ్వమని పిలుస్తున్నారు కానీ ఓట్లు మాత్రం పడవని అందరికీ తెలుసున్నారు. 2014కి ముందు బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం భద్రాచలం ముంపు ప్రాంతాలను అన్యాయంగా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిందని పేర్కొన్నారు. విభజన చట్టంలో ఉన్న అంశాలు కాంగ్రెస్, యూపీఏ ప్రభుత్వ నిర్ణయాల వల్లే జరిగాయి. దీనికి బీజేపీ లేదా కేంద్ర ప్రభుత్వానికి సంబంధం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు స్కామ్ విషయంలో మేము పూర్తిస్థాయి దర్యాప్తు కోరుతున్నాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఒక మేడిగడ్డ లేదా కొన్ని పిల్లర్ల విషయంపై మాత్రమే మాట్లాడుతున్నారు. ప్రాజెక్టు మొత్తంగా సీబీఐ విచారణకు ఇవ్వాలి. ప్రస్తుతం ఈ అంశం హైకోర్టులో ఉంది. పూర్తి నిజాలు బయటకు రావాల్సి ఉందన్నారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అనేక ఆరోపణలు చేసింది. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాల కేసుల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, కేసీఆర్ కుటుంబంపై కేసులు పెడతామన్నారు. జైలుకు పంపుతామని, రూ.లక్ష కోట్లు వసూలు చేస్తామని చెప్పారు. కానీ ఇప్పటివరకూ ఒక్క కేసులోనూ చర్యలు తీసుకోలేదు. మరి ఆ ఆరోపణలు ఏమయ్యాయి?, దర్యాప్తు ఎక్కడికి పోయింది?. ఇప్పుడు తమ అసమర్థతను దాచుకోవడానికి బీజేపీపై నెపం వేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన పార్టీగా బాధ్యత కాంగ్రెస్‌దే. వేరే వాళ్లపై నెట్టడం కాదు, తెలంగాణ ప్రజలకు హామీలు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ.. అమలు చేయాల్సిన ప్రజాస్వామ్య బాధ్యతా ఆ ప్రభుత్వానిదే' అని కిషన్ రెడ్డి తెలిపారు.

## సాండ్ మాఫియా చేతుల్లోకి ఇసుక ఆదాయం

### నిజాలు బయటపెట్టి లెక్కలు చెప్పాలి
### బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్

హైదరాబాద్ : .తెలంగాణ రాష్ట్రంలో ఇసుక తవ్వకాల ఆదాయంపై కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేస్తున్న గణాంకాలు పూర్తిగా తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నాయని బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో ఇసుక తవ్వకాల ద్వారా వచ్చిన ఆదాయం కేవలం 39 కోట్లే అని తెలిపారు. కానీ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న సంస్కరణలతో ఇసుక ఆదాయం గణనీయంగా పెరిగిందని అన్నారు. ఒక్క సంవత్సరంలోనే రూ.886 కోట్లకు చేరిందని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఇసుక ధర టన్నుకు రూ.645 మాత్రమే ఉండేదని.. ప్రజలకు అందుబాటులో ఉండేదని క్రిశాంక్ తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో సాండ్ బజార్ పేరుతో ఇసుక ధరను రూ.1600కు పెంచి, అదనంగా రవాణా భారం కూడా ప్రజలపై మోపుతోందన్నారు. సర్వీస్ ఛార్జీలు టన్నుకు కాంగ్రెస్ ప్రభుత్వం ?3 నుంచి ?100కు పెంచబడినప్పటికీ, ఆదాయం మాత్రం పెరగకపోవడం అనుమానాస్పదమని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాలంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు మాత్రమే ఇసుక తవ్వకాలు జరగ్గా, ఇప్పుడు పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించి ఉదయం 6 నుంచి రాత్రి 9 వరకు తవ్వకాలు, 24 గంటల రవాణా అనుమతించినప్పటికీ ఆదాయం రెట్టింపు కాలేదని మన్నె క్రిశాంక్ తెలిపారు. ఈ పరిస్థితి చూస్తే ఇసుక ఆదాయం సాండ్ మాఫియా చేతుల్లోకి వెళ్లిపోతుందనే అనుమానాలు బలపడుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా, ప్రస్తుత ముఖ్యమంత్రి కార్యాలయ సీపీఆర్వోగా ఉన్న గుర్రం మల్సూర్ గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో టీఎస్ఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. కాబట్టి, ఆయనకు వాస్తవ గణాంకాలు బాగా తెలుసని క్రిశాంక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ విజయాలను వక్రీకరించి, తప్పుడు గణాంకాలతో ప్రజలను మోసం చేస్తోంది అనే విషయంపై సీపీఆర్వో మల్సూర్ వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇసుక తవ్వకాల ఆదాయంపై పారదర్శకత కోసం పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడించాలన్నారు. తెలంగాణ ప్రజలపై భారం మోపుతూ, వాస్తవాలను దాచిపెట్టి ప్రభుత్వాన్ని నడపడం సరికాదని హితవుపలికారు. నిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

## భారత నౌకాదళ అమ్ములపొదిలో మరో అస్త్రం

### అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' జలప్రవేశం
### విశాఖలో ప్రారంభించిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



విశాఖపట్నం,ఏప్రిల్3 : భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని కమిషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన ఈ ఫ్రిగేట్ భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. నీలగిరి శ్రేణి 17–ఏలో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధనౌకను ముంబయిలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో నిర్మించారు. స్వదేశీ ఆధునిక సాంకేతికత వినియోగంలో 75 శాతానికిపైగా సూక్ష్మ,చిన్న మధ్య తరహా పారిశ్రామిక రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు భాగస్వామ్యం అయినట్లు నేవీ (ఎనిటతిజీని ఔజీలా) వర్గాలు పేర్కొన్నాయి. శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం ఈ వార్‌షిప్ ప్రత్యేకత. ఐఎన్ఎస్ తారాగిరిని గతేడాది నవంబరు 28న నేవీకి అప్పగించారు. 149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పుతో 6,670 టన్నుల బరువుండే ఐఎన్ఎస్ తారాగిరి కంబైన్డ్ డీజిల్/గ్యాస్ ఆధారిత ప్లాంటుతో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు. ఇందులో నిశ్శబ్ద ఫిరంగులతో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది. బరాక్–8 వంటి విమాన విధ్వంసక, 8 బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు ఇందులో ఉన్నాయి. యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ వ్యవస్థతోపాటు, శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ వ్యవస్థ ఉంది.అరిదమన్ అనేది ఒక పదం కాదని.. ఒక శక్తి అని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. భారత్ మూడో స్వదేశీ అణు సబ్‌మెరైన్ అరిదమన్ అని తెలిపారు. దీంతో సముద్ర ఆధారిత అణు నిరోధకశక్తి మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో పని చేస్తున్న నావెల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లెబోరెటరీ (ఎన్ఎస్‌టీఎల్)ను రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. అందులోని కావిటేషన్ టన్నెల్‌కు సైతం ఆయన శంకుస్థాపన చేశారు. 2016లో ఐఎన్ఎస్ అరిహంత్, 2024 ఆగస్టులో ఐఎన్ఎస్ అరిఘాట్‌ల సరసన తాజాగా ఐఎన్ఎస్ అరిదమన్ చేరింది. అరిదమన్ చేరికతో..



అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములను సొంతంగా నిర్మించి, నిర్వహిస్తున్న అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా వంటి ఎంపిక చేసిన దేశాల క్లబ్‌లో భారత్ చేరింది. ఈ జలాంతర్గాములు శత్రువుల కంటపడకుండా నెలల తరబడి సముద్రగర్భంలో ఉంటాయి. శత్రు దేశాల నుంచి అణు దాడి జరిగితే.. సముద్రం లోపలి నుంచే దీటుగా ఇవి బదులిస్తాయి.

## రెండో విడత రైతుభరోసాకు రంగం సిద్ధం

### పంపిణీ కోసం సుమారు రూ. 2,650 కోట్లు అవసరం
### నిధులు సమకూర్చాలని సిఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్,ఏప్రిల్3 : తెలంగాణ రాష్ట్రంలోని సాగునీటి అవసరాలు, పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్న రైతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. యాసంగి సీజన్ పెట్టుబడి సాయం కింద అందించే 'రైతు భరోసా' రెండో విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ముహూర్తం ఖరారైంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఒత్తిడిలో ఉన్నప్పటికీ, రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ అడుగు వేస్తోంది. రెండో విడత పంపిణీ కోసం సుమారు రూ. 2,650 కోట్ల భారీ మొత్తాన్ని సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు, రుణాల చెల్లింపులు పూర్తయిన వెంటనే.. ఈ నిధులను సేకరించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. మొత్తం రూ. 9,000 కోట్ల అవసరం ఉన్న ఈ పథకాన్ని, నిధుల లభ్యతను బట్టి ప్రభుత్వం మూడు విడతల్లో పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఎకరం లోపు ఉన్న రైతులకు మొదటి విడత నిధులు అందగా, ఇప్పుడు ఒకటి నుంచి ఐదు ఎకరాల వరకు సాగు భూమి ఉన్న రైతులకు ఈ నెల రెండో వారంలో నగదు జమ కానుంది. ఐదు ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు ఈ నెలాఖరు కల్లా వారి వాటా నిధులు అందుతాయి. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ప్రకారం, ప్రతి ఎకరాకు సాగు ఖర్చుల కోసం ప్రభుత్వం రూ. 6,000 ఆర్థిక సాయం అందిస్తోంది. నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకే ఈ నగదు బదిలీ కానుండటంతో ఎక్కడా జాప్యం లేకుండా రైతులకు మేలు జరుగుతుంది.

## కాంగ్రెస్‌పై రెండేళ్లలోనే ప్రజల్లో వ్యతిరేకత

### రేవంత్ రెడ్డి దిగిపోవాలని కోరుకుంటున్నారు
### మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల,ఏప్రిల్3 : కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ రానున్న రోజుల్లో ఊహించలేని పరిస్థితి ఎదుర్కొంటుందని కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి జోస్యం చెప్పారు. తాను ఏ పార్టీలో చేరాలనేది కార్యకర్తల కోరిక మేరకే ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు విసుగొచ్చిన రాష్ట్ర ప్రజలు మార్పు రావాలి.. రేవంత్ రెడ్డి పోవాలనే ఆలోచన వచ్చిందన్నారు. జగిత్యాలలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజల సంక్షేమంతో పాటు ప్రాజెక్టుల నిర్వహణ ప్రధాన అంశమని తెలిపారు. తెలంగాణకు జీవనాడి ప్రాణహిత జలాలను వాడుకోవడంలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని ఆయన తెలిపారు. అభిమానుల ఆలోచనలకు అనుగుణంగా ఏ పార్టీలో చేరాలనేదానిపై నిర్ణయం తీసుకుంటానని జీవన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్‌ను వీడిన తర్వాత జగిత్యాలలో తొలిసారిగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. ప్రాణహిత నదీ జలాలను వినియోగించుకోకపోవడం, పునరుద్ధరించకపోవడం రేవంత్ నిర్లక్ష్య పాలనకు నిదర్శనమని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన రెండేళ్లలోనే మార్పు రావాలనే పరిస్థితి వచ్చిందన్నారు. భాజపా, బీఆర్‌ఎస్ నాయకులకు తనపై ఉన్న అభిమానానికి జీవన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అయితే మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం. త్వరలోనే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జగిత్యాలకు వెళ్లి జీవన్ రెడ్డిని ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 13న జీవన్ రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఆ రోజు మంచి ముహూర్తం ఉండటంతో గులాబీ కండువా కప్పుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నెల 6న అమెరికా నుంచి తిరిగి వచ్చిన వెంటనే కేటీఆర్.. జీవన్ రెడ్డిని కలిసి పార్టీలోకి ఆహ్వానించనున్నట్లు సమాచారం. జగిత్యాల నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేసేందుకు జీవన్ రెడ్డిని పార్టీలోకి తీసుకోవాలని కేటీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి, క్రియాశీల సభ్యత్వానికి జీవన్ రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేసిన ఆయన.. నిత్యం జనంలోనే ఉంటూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జగిత్యాల ప్రాంతంలో బలమైన నేతగా ఉన్న జీవన్ రెడ్డి.. గులాబీ పార్టీలో చేరితే స్థానికంగా బీఆర్‌ఎస్‌కు మంచి ప్రయోజనం కలుగుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ

### ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్ల నుంచి అక్రమాలపై ఆరా
### తనిఖీల్లో అక్రమ లావాదేవీలు, లంచాలు గుర్తింపు
### భారీగా నగదు, నగలు, అనేక డాక్యుమెంట్లు స్వాధీనం

వరంగల్,ఏప్రిల్3 : వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నగదు, డాక్యుమెంట్లు ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల నుంచి స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్–1 జమాలపురం రామనరసింహరావు, రిజిస్ట్రార్–2 దేవులూరి ఆనంద్ ఫోన్లను స్వాధీనం చేసుకుని పరిశీలించారు. ఇద్దరు అధికారులు డాక్యుమెంట్ రైటర్లతో జరిపిన ఫోన్ పే పరిశీలించగా సుమారు రూ.42 లక్షలు లావాదేవీలు జరిపినట్లు గుర్తించారు. వీరి వద్ద నుంచి 70 రిజిస్ట్రేషన్ కాని డాక్యుమెంట్లను పరిశీలించారు. అదే విధంగా ఇద్దరు ఇళ్ల నుంచి రూ.24.61 లక్షల నగదును, 819.500 గ్రాముల బంగారు ఆభరణాలను, 2.600 కిలో గ్రాముల వెండి ఆభరణాలను, రూ.30 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లను గుర్తించారు. ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు గుర్తించి ప్రభుత్వానికి పంపనున్నట్లు వెల్లడించారు. వరంగల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అవినీతి అక్రమాలపై అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదులు అందడంతో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సబ్ రిజిస్ట్రార్ల అక్రమ లావాదేవీలు, అనధికారిక వ్యక్తులతో వారు సాగిస్తున్న చీకటి ఒప్పందాలు వెలుగులోకి వచ్చాయి. సబ్ రిజిస్ట్రార్లయిన జమాల్పూర్ రామ్ నర్సింహారావు, దేవులూరి ఆనంద్ తమ కార్యాలయంలో ఇద్దరు వ్యక్తులను అనధికారికంగా డాక్యుమెంట్ రైటర్లుగా నియమించుకున్నట్లు ఏసీబీ గుర్తించింది. వీరిద్దరూ డాక్యుమెంట్ రైటర్లతో కలిసి రిజిస్ట్రేషన్ల పేరుతో భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. కేవలం ఈ అనధికారిక రైటర్లు పంపిన పత్రాలను మాత్రమే వీరిద్దరు ప్రాధాన్యత ఇచ్చి రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తేలింది. కార్యాలయంలో పూర్తి కాని సుమారు 70 డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్లు, డాక్యుమెంట్ రైటర్ల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు వాట్సాప్ చాట్ ద్వారా బట్టబయల య్యాయి. గత ఏడాది కాలంలోనే డాక్యుమెంట్ రైటర్ల ద్వారా ఈ ఇద్దరు అధికారులు సుమారు రూ. 42 లక్షలను లంచంగా తీసుకున్నట్లు ఏసీబీ ఆధారాలు సేకరించింది. కార్యాలయంలో సోదాల అనంతరం ఏసీబీ బృందాలు ఇద్దరి నివాసాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టాయి. వీరి ఇళ్లలో లక్షలాది రూపాయల నగదుతో పాటు భారీగా అక్రమ ఆస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు కనుగొన్నారు. ఇక్కడ ఓ షాకింగ్ అంశం వెలుగులోకి వచ్చింది.

# సంపాదకీయం

## ట్రంప్‌కు జ్ఞానోదయం అయ్యేనా?

పిల్లికి చెలగాటం..ఎలుకకు ప్రాణ సంకటం అన్న చందంగా ఇప్పుడు అమెరికా, ఇరాన్‌ల యుద్ధం తయారయ్యింది. ప్రపంచం అతలాకుతలం అవుతున్నా..ఇరాన్ కోలుకోలేకుండా చేయడమే లక్ష్యంగా ట్రంప్ మూర్ఖంగా ముందుకు సాగుతున్నారు. ట్రంపం ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదు. ఇంటాబయటా నిరసనలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇకముందు ప్రపంచంలో ఇంధన కొరత తీవ్ర రూపం దాల్చడం ఖాయంగా కనిపిస్తుంది. ఇంధన కొరత అన్ని దేశాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీనిగురించి ట్రంప్‌కు పెద్దగా బెంగ లేదు. ప్రజలు ఏమయితే ఏమిటన్న ధోరణిలో ఆయన యుద్ధాన్ని ప్రేరేపించారు. ప్రపంచంలో ఏ దేశంలో ఏమి జరిగినా అది మన ఇంట్లో పొయ్యిలో పిల్లి లేవాలా వద్దా అన్నంత ప్రభావం చూపుతోంది. ఇప్పుటికే మనదేశంలో హోటల్ పరిశ్రమ కుదేలయ్యింది. ఇలాగే యుద్ధం కొనసాగితే దాని ప్రభావం ఎన్నాళ్లు ఉంటుందో చెప్పలేం.ఎందుకంటే యుద్ధం మొదలు పెట్టి ఇరాన్÷–ను దెబ్బతీసినందుకు గాను ఇరాన్ కూడా గట్టిగానే ఎదురిస్తోంది. అంతు చూస్తామని అమెరికాను హెచ్చరి స్తోంది. తమకు నాలుగు వేల కిలోమీటర్ల దూరంలోని డిగో గార్షియా మీద ఇరాన్ చేసిన దాడిని తక్కువగా అంచనా వేయటం తగదని అమెరికా పూర్వ అధ్యక్షుడు బిల్ క్లింటన్ ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్‌కు హితవు పలుకుతున్నాడంటే ఇక పైనైనా ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సిన ఆవశ్యకతను చెప్పడమే! అత్యంత అధునాతన ఎఫ్ 35 యుద్ధ విమానంపై ఇరాన్ దాడి చేసిందన్న వార్త ప్రపంచ దేశాలను ఉలికిపాటుకు గురిచేసింది. యుద్ధ తంత్ర నిపుణులు ఇరాన్ బలిమి లెక్కింపులో అమెరికా వ్యూహాన్ని తప్పుపట్టారు. తాజా వ్యూహంలో హర్మ్యూజ్ జలసంధి ఇరాన్ పట్టు సడలించేందుకు ట్రంపు నానా యాతన పడుతున్నారు. అది సాధ్యం కావడం లేదు. ఇరాన్ తో సత్సంబంధాలు నెరపుతున్న భారత్ వంటి దేశాల నౌకలకే సేఫ్ ప్యాసేజ్ లభించింది. అయినా ప్రపంచవ్యాప్తంగా ఉన్న చమురు సంక్షోభంలో భారత్ కూడా చిక్కుకోక తప్పడంలేదు. కొన్ని నౌకలు భారతీయ పోర్టులకు చేరినా దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల కొరత బ్లాక్ మార్కెట్, రవాణా వాహనాలు చార్జీలు పెంపు వంటి అంశాల నుంచి ఎప్పటికి సాధారణ స్థాయికి చేరుకుంటుందో చెప్పలేం. హర్మ్యూజ్ జలసంధి ఇరాన్ పట్టు నుంచి తప్పించడానికి వెళ్తున్న యుద్ధ విమానాలకు శ్రీలంక అనుమతి నీయకపోవడంతో అమెరికా ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. హర్మ్యూజ్ పై సైనిక చర్యకు ముందుకు రాని నాటో కూటమి దేశాలతో, తమ భద్రతను తామే ఏర్పాటు చేసుకోవాలని ట్రంప్ చేతులెత్తేశారు. ఆయన నిర్ణయాలకు మిత్ర దేశాల వత్తాసు లభించడం లేదు. ఇరాన్ వార్ కారణంగా ఖతార్ ఎల్ఎన్జి ఎగుమతులకు 5 ఏళ్ల పాటు దారి దొరికే పరిస్థితి లేదని తేలిపోయింది. ఇరాన్, అమెరికా ఇజ్రాయిల్ యుద్ధం మానవ రహిత కార్యాచరణగా సాగుతోంది. కేవలం ఆయా దేశాల మౌలిక వనరుల విచ్చిత్తి పైనే దాడిగా చెప్పుకోవాలి. నెల రోజులుగా జరుగుతున్న యుద్ధాన్ని విశ్లేషిస్తున్న వారెవరైనా ఈ యుద్ధం ఆగేందుకు దారి లేదని, ఆపేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని వారి వైఖరులే స్పష్టపరుస్తున్నాయి. తాజాగా ఇరాన్ అమెరికా ఉద్రిక్తతలు హిందూ మహా సముద్రానికి విస్తరించాయి. అమెరికా వ్యూహాత్మక సైనిక స్థావరం డిగో గారియాను ఇరాన్ లక్ష్యం చేసుకోవడంతో అమెరికాలో కలవరం బయలుదేరింది. ఇరాన్ వద్ద ఇలాంటి శక్తివం తమైన బాంబులున్నట్లు అంచనా వేయడంలో అమెరికా దాదాపు విఫలమైనట్లే. ఇప్పుడు అమెరికా ఆత్మరక్షణలో పడిపోయింది. అయినా ట్రంప్ తన అహంకారాన్ని వీడడం లేదు. యురేనియం శుద్ధి చేసే సామర్థ్యం ఇరాన్‌కు లేదని, అలాగే బాలిస్టిక్ క్షిపణులు తయారు చేసే సామర్థ్యం కూడా లేకుండా చేసి తాము విజయం సాధించినట్లేనని ఈ మధ్యనే ఇజ్రాయిల్ ప్రధ్రాని బెంజి మెన్ నెతన్యాహు ఒక సందర్భంలో సంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్‌ను అణ్వస్త్ర తయారీ వరకు వెళ్లకుండా చేయడమే తమ అంతిమ లక్ష్య మని అమెరికా ఇజ్రాయిల్ ప్రకటించుకున్నాయి. అదే నిజమైతే ఇప్పుడు వాళ్ళు ఆ దిశగా విజయం సాధించినట్లే. ఇజ్రాయిల్ లక్ష్యం అదే అయినప్పుడు మరికొంత కాలం యుద్ధాన్ని సాగతీయడం ఉభయులకూ, ఈ ప్రపంచానికీ మంచిది కాదు. టెహ్రాన్‌పై అమెరికా– ఇజ్రాయిల్ సంయుక్తంగా చేపట్టిన యుద్ధం 34వ రోజుకు చేరుకుంది. ఇరుదేశాల పరస్పర దాడుల వల్ల పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇస్లామిక్ రిపబ్లిక్‌పై అమెరికా జరిపే ఏ భూతల దాడినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగేర్ గాలిబాఫ్ ప్రకటించారు. ఇందుకోసం 7 మిలియన్ల ఇరానీయులు సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. అమెరికాతో సంప్రదింపుల భాగస్వామిగా పేరు వినిపిస్తున్న మహమ్మద్ బఘేర్ ఖాలిబాఫ్, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికాకు సవాలు విసురుతూ వరుసగా ఆన్‌లైన్ పోస్టులు పెడుతున్నారు. అమెరికా– ఇజ్రాయిల్ తమపై అకారణంగా దాడులు చేస్తున్నాయని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడుల కారణంగా దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను తిరిగి పునరుద్ధరించడానికి నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకోసం దేశవ్యాప్త కార్యక్రమం చేపట్టాలని నిర్దేశించారు. అమెరికా–ఇజ్రాయిల్ తమ దేశంపై కొనసాగిస్తోన్న నీచమైన, దురాక్రమణ దాడులను మొజ్తాబా తీవ్రంగా ఖండించారు. ఇరాన్ అభివద్ధిని విస్తరించడం, ఉజ్వల భవిష్యత్తుకు ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మొత్తంగా అమెరికాను ఎదిరించే సాహసం ఇరాన్ చేస్తోంది. ఇది అమెరికాకు ముఖ్యంగా ట్రంప్‌కు గుణపాఠం కావాలి.

# నక్సల్స్ అంతమే అభివృద్ధి కాదు



నక్సలిజం నిర్మూలనకు ప్రభుత్వం విధించిన డెడ్‌లైన్ మార్చి 31, 2026 ముగిసింది. ఇది రెడ్ కారిడార్‌గా పిలవబడే తొమ్మిది రాష్ట్రాల్లో కొండలు, అడవుల్లో విస్తరించి ఉన్న నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో దశాబ్దాలపాటు సాగిన మావోయిస్టు ఉద్యమం దాదాపు ముగింపు దశకు చేరిన చారిత్రక ఘట్టాన్ని సూచిస్తుంది. ఒకప్పుడు దేశం లోని సుమారు 120 కి పైగా జిల్లాలను ప్రభావితం చేసిన మావోయిస్టులపై భద్రతా దళాలు నిరంతరం సాగించిన పోరుతో 2025 నాటికి నక్సలిజం గణనీయంగా క్షీణించింది. ఇప్పుడు మధ్య, తూర్పు భారతం లోని కొన్ని ప్రాంతాలకే పరిమితం అయింది. కొన్ని దశాబ్దాల హింసలో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో పౌరులు, భద్రతా సిబ్బంది కూడా ఉన్నారు. అయినప్పటికీ సాయుధ మావోయిస్టుల నిర్మూలనతో సమస్యలు ముగిసినట్టు కాదు. నక్సల్స్ బృందాలను భద్రతా బలగాలు ఎంత దెబ్బతీసినా, వారి వెనుక ఉన్న భావజాలం (ఐడియాలజీ) లేదా మూలకారణాలు ఇంకా సాక్షాలుగా మిగిలే ఉన్నాయి. చత్తీస్‌గఢ్, జార్ఖండ్ వంటి నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లోని మారుమూల గ్రామాలకు కూడా రోడ్ల నిర్మాణం, టెలికమ్ నెట్‌వర్క్ విస్తరణ, బ్యాంకింగ్ సౌకర్యాలు, స్కూళ్లు, స్కిల్ సెంటర్లు వంటివి ఏర్పాటు కావడంతో భద్రతా బలగాలు ఆయా గ్రామాల్లోకి చేరుకుని భద్రత కల్పిస్తుండడంతో ప్రజల్లో విశ్వాసం పెరిగి నక్సల్స్ కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయి. సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. ఇదంతా అభివృద్ధియే అని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. కానీ అభివృద్ధి అంటే కేవలం సంఖ్యలు మాత్రమే కాదు. మానవాభివృద్ధి, జీవన ప్రమాణాలు ఏమాత్రం విస్తరించాయో పరిశీలించాల్సి ఉంది. మావోయిజం వర్ధిల్లడానికి గిరిజన సామాజిక వర్గాల్లో పేదరికం, సామాజిక బహిష్కరణ, విచ్ఛిన్నమైన విశ్వాసం తదితర కొన్ని కఠోర వాస్తవాలే ప్రధాన కారణాలు. గిరిజన వర్గాలు కొన్ని తమ భూములను, అటవీ హక్కులను కోల్పోతున్నాయి. బలమైన పెత్తందార్ల దోపిడీని ఎదుర్కొంటున్నాయి. మరిన్ని కనుగొనండి ఇంటర్ పరీక్షల గైడ్‌లు ఆన్‌లైన్ వార్తలు జిల్లా వార్తలు ాశ్రీంశీ =ఝుస – చరిత్ర బాటసారి జైశెట్టి రమణయ్య వీటికి తోడు అధికార యంత్రాంగం నిర్లక్షం వెంటాడుతోంది. ఇవన్నీ పరిష్కారం కాకుంటే మళ్లీ క్షేత్రస్థాయిలో మావోయిజం లేదా అలాంటి ఇతర ఉద్యమాలు పుట్టుకు రాక తప్పదు. భారత రాజ్యాంగం ఐదో షెడ్యూల్‌లో అటవీ హక్కుల చట్టం, పంచాయతీ రాజ్ చట్టాల ద్వారా ఆయా షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనులకు రక్షణ, స్థానిక స్వపరిపాలన కల్పించబడ్డాయి. ఈ ప్రాంతాల ప్రజల హక్కులను కాపాడటమే కాకుండా వారి బాగోగులను చూసుకునే ప్రత్యేక అధికారాలు గవర్నర్లకు ఉన్నాయి. అయితే ఇవి పేలవమైన అమలు కారణంగా విఫలమవుతున్నాయి తప్ప చట్టాల్లో లోపాలు ఉన్నందువల్ల కాదు. ఈ పరిస్థితుల్లో గవర్నర్లే గిరిజన ప్రయోజనాలను కాపాడే బాధ్యత వహించాలి. అలాగే పునరావాసం అనేది కేవలం ఒక చర్యగా మాత్రమే ఉండకూడదు. విద్య, ఆరోగ్యభద్రత, ఉద్యోగాలు, గౌరవం, ప్రతి కుటుంబానికి చేరువ కావాలి. మార్చి 31 వరకు ప్రభుత్వం ప్రధానంగా భద్రతా పరమైన అంశాల పైన, మావోయిస్టుల అంతం పైనే దృష్టి కేంద్రీకరించింది.ఇప్పుడు గిరిజన బతుకుల్లో భద్రతతోపాటు ఉపాధి, ఉద్యోగాలు, అటవీ భూముల హక్కుల కల్పన వంటి సంఘర్షణకు దారితీసిన అంశాల పైనే ప్రభుత్వం దృష్టి మళ్లించవలసి ఉంది. వామపక్ష తీవ్రవాదం నిర్మూలన అనేది ఆ ప్రాంతాల అభివృద్ధికి శాంతి భద్రతల పునరుద్ధరణకు మంచి పరిణామం అయినప్పటికీ ఆ పేరుతో కార్పొరేట్ శక్తులు, క్రోనీ కేపిటలిస్టులు, గిరిజన ప్రాంతాల్లోని సహజ వనరులను ఇష్టారాజ్యంగా దోపిడీ చేసే అవకాశం ఇవ్వకూడదు. దీనికి బదులు గిరిజనులకు కల్పించవలసిన హక్కుల కల్పనకు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో వారికి భాగస్వామ్యం కల్పించడానికి కృషి సాగించాలి. నక్సల్స్ విముక్తికి డెడ్‌లైన్ మార్చి 30కి ముందు లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ మూడేళ్ల పాటు పారామిలిటరీ ఆపరేషన్లు ముమ్మరంగా చేపట్టడం వల్ల 4839 మావోయిస్టులు లొంగిపోయారని, 2218 మంది అరెస్టు అయ్యారని, 706 మంది ఎన్‌కౌంటర్లలో తటస్థం అయ్యారని లెక్కలు వల్లించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం నక్సల్స్‌పట్ల సానుభూతి చూపించడం వల్లనే నక్సలిజం విపరీతంగా పెరిగిందని ఆరోపించారు. మరిన్ని కనుగొనండి డిజిటల్ వార్తాపత్రిక వీడియో వార్తలు భద్రతా కెమెరాలు ాశ్రీంశీ =ఝుస – తెలంగాణ ఎగుమతులకు యుద్ధం సెగ కానీ వాస్తవానికి మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు నక్సలిజం దేశ అంతర్గత భద్రతకు పెనుసవాలుగా గుర్తించి 200910 లో ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో నక్సల్స్ నిర్మూలనకు శ్రీకారం చుట్టారు. ఆనాడు ఖనిజ సంపద సమృద్ధిగా ఉన్న బీహార్, జార్ఖండ్, చత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లోని 180 జిల్లాల్లో నక్సలిజం తీవ్రంగా ఉండేది. కానీ నక్సల్ నివారణ చర్యలు చేపడితే పారామిలిటరీ నిర్వహణకు విపరీతంగా ఖర్చు చేయవలసి వస్తుందని, అనేక మంది ప్రాణాలు బలిగొనాల్సి వస్తుందని తీవ్ర విమర్శలు రావడంతో ఆ ఆపరేషన్ ఆగిపోయింది. కానీ ఇప్పుడు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ద్వంద్వ విధానం పాటించారు. ఒకవైపు లొంగిపోయిన నక్సల్స్‌కు చర్చలద్వారా పునరావాసం కల్పిస్తామని, దీనిని వ్యతిరేకించిన వారిని హతం చేస్తామని హెచ్చరించారు. నక్సల్స్‌ను నిర్మూలించడం మారణహోమంగా పరిగణించే మానవ హక్కుల ఉద్యమ కార్యకర్తల, మేధావుల అసంతృప్తిని లెక్కలోకి తీసుకోలేదు. పైగా వారిని అర్బన్ నక్సల్స్‌గా ముద్రవేశారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి నక్సల్స్ భావజాలం వ్యతిరేకమని, అభివృద్ధికి వారు దోహదం చేయరని గిరిజనుల్లో ప్రచారం చేయించారు. మొత్తం మీద వామపక్ష ఉగ్రవాదాన్ని అంతం చేయడంలో విజయం సాధించారు. ఇప్పుడు సయోధ్య రాజకీయాల ద్వారా యుద్ధ గాయాలను మాన్పడమే తక్షణ కర్తవ్యం.

## బిజెపితో చేతులు కలిపిన రాఘవ్ చద్దా

### పంజాబ్ సిఎం భగవంత్ మాన్ విమర్శలు

చండీఘడ్ : రాజ్యసభ ఎంపీ, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత రాఘవ్ చద్దాపై ఆ పార్టీ విమర్శల బాణం ఎక్కుపెట్టింది. చద్దాకు వ్యతిరేకంగా ఆప్ నేతలు వరుసగా స్పందిస్తున్నారు. ఆయన బీజేపీతో చేతులు కలిపారని ఆరోపిస్తున్నారు. రాజ్యసభలో ఆప్ డిప్యూటీ లీడర్‌గా ఉన్న రాఘవ్ చద్దాను ఆ బాధ్యతల నుంచి ఆప్ తొలగించింది. ఈ నేపథ్యంలో రాఘవ్ చద్దాకు, ఆమ్ ఆద్మీ పార్టీకి మధ్య మాటలయుద్ధం ప్రారంభమైంది. ఒకరిపై ఒకరు పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు. తనను పదవి నుంచి తొలగించగలరేమో కానీ, ఓడించలేరని రాఘవ్ చద్దా అన్నారు. అయితే, ఆయనపై ఆప్ ఎదురుదాడికి దిగింది. పంజాబ్ సీఎం భగవంత్ మన్ కూడా చద్దాపై విమర్శలు గుప్పించారు. బీజేపీతో రాఘవ్ చద్దా చేతులు కలిపారని, ఇది ఆమ్ ఆద్మీ పార్టీలో ఆందోళన కలిగించిందని భగవంత్ మన్ అన్నారు. రాజ్యసభలో లేవనెత్తాల్సిన అంశాలపై ఆప్ సూచించే విషయాల్ని చద్దా పాటించలేదన్నారు. రాజ్యసభలో ప్రజల సమస్యలపై ప్రశ్నించమంటే, చద్దా మాత్రం సమోసాలపై ప్రశ్నించారని ఎద్దేవా చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో తప్పకుండా ఏ పార్టీ అయినా చర్య తీసుకుంటుందన్నారు. మరో సీనియర్ ఆప్ లీడర్ సౌరభ్ భరద్వాజ్ కూడా రాఘవ్ చద్దాపై మండిపడ్డారు. చద్దాకు వీలైతే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్పందించాలని కోరారు. పంజాబ్, దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై చద్దా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాఘవ్ కొన్నేళ్లుగా భయపడుతున్నారని, మోదీకి వ్యతిరేకంగా మాట్లాడలేకపోతున్నారని విమర్శించారు. దొరికే కొద్దిపాటి సమయంలో దేశం గురించి మాట్లాడాలని సూచించారు. చద్దా తీరుతో ఆప్ కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారని వ్యాఖ్యానించారు.

## మంచిర్యాలలో ఫేక్ నోట్ల కలకలం

### దొంగనోట్లు చలామణి చేస్తున్న ముఠా అరెస్ట్

మంచిర్యాల,ఏప్రిల్3 : జిల్లాలో దొంగ నోట్ల వ్యవహారం కలకలం రేపింది. ఫేక్ కరెన్సీని నిర్మూలించాలని ఎన్ని చర్యలు తీసుకుంటున్నా వాటి చలామణి మాత్రం ఆగడం లేదు. కొత్తకొత్త ప్లాన్లు వేస్తూ పోలీసులనే బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నారు కేటుగాళ్లు. తాజాగా దొంగనోట్లు చెలామణి చేస్తూ అడ్డంగా బుక్కయ్యారు ఓ ముఠా సభ్యులు. వారి గుట్టురట్టు చేసి కటకటాల వెనక్కి పంపారు పోలీసులు. నిందితుల నుంచి లక్షల రూపాయల ఫేక్ నోట్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. మంచిర్యాల జిల్లాలో ఫేక్ నోట్లు చెలామణి చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఫిబ్రవరి 25న ఓ పెట్రోల్ బంకులో మూడు రూ.500 నోట్లు ఇచ్చారు ముఠా సభ్యులు. నోట్లపై ఒకే సీరియల్ నంబర్ ఉండడంతో అనుమానం వచ్చి పోలీసులకు బంక్ సిబ్బంది ఫిర్యాదు చేశారు. తీగ పట్టుకుని లాగగా డొంక మొత్తం కదిలింది. ప్రధాన సూత్రధారి కానుగంటి క్రాంతి సహా 13 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

## ఎమ్మెల్యే అరవింద్ బాబుపై సిఎం సీరియస్

### పార్టీ కార్యాలయంలో చర్చించిన అధ్యక్షుడు పల్లా

అమరావతి,ఏప్రిల్3 : పల్నాడు జిల్లా నరసరావుపేట ఎమ్మెల్యే అరవింద బాబుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. పార్టీ పరువుకు భంగం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇటీవల తాను చెప్పిన వ్యక్తికి లీగల్ అడ్వైజర్ పోస్ట్ ఇవ్వలేదని అరవింద బాబు హల్ చల్ చేశారు. ఏకంగా పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ విషయం కాస్తా పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లింది. ఎమ్మెల్యేతో మాట్లాడాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి అరవింద బాబును పల్లా శ్రీనివాసరావు పిలిపించారు. ఎస్పీ కార్యాలయంలో బైఠాయించడంపై వివరణ కోరారు. ఘటనపై టీడీపీ అధినేత చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నారని.. ఇది ఎంతమాత్రం సహించరాని విషయమని అరవింద బాబుకు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. లీగల్ అడ్వైజర్ నియామకం జరగకపోతే పార్టీ జిల్లా అధ్యక్షుడు, రీజనల్ కోఆర్డినేటర్ లేదా తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. అంతేకాని ఇలా పార్టీ పరువుపోయేలా ప్రవర్తించడం ఏంటని నిలదీశారు. సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో బైఠాయించడం, పార్టీ పరువుకు భంగం కలిగించే ప్రయత్నాలను ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే పార్టీ తరపున తీవ్ర చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని తేల్చిచెప్పారు. అయితే, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసుకుంటానని ఎమ్మెల్యే అరవింద బాబు హామీ ఇచ్చారు.

## లోక కళ్యాణం కోసం రుషుల కృషి !

తిరుమల : పూర్వకాలంలో మహర్షులు నిరంతరం హోమాలను నిర్వహించు కునేవారు. హోమాలు,జపతపాలువారిజీవనంలో నిత్యకృత్యాలు. ఇవన్నీ కూడా లోక కళ్యాణం కోసమే. మహర్షులు ఈ హోమాలను తమ కోరికలను తీర్చుకోవడం కోసం కాకుండా, ప్రజల క్షేమం గురించి ఉద్దేశించి చేసినవే! అంటే లోక కళ్యాణం కోసం అన్నమాట!హోమాలు చాలావరకు మనలో వున్న లోపాలను సవరించడానికి, దోషాలనుండి తప్పించుకోవడానికి చేస్తారు. ఏ ఒక్క గ్రహానికి సంబంధించిన శక్తి భూమిమీద తక్కువగా వున్నా.. అసమతుల్యతలు ఏర్పడుతాయి. అందుకే ఆయా గ్రహానికి సంబంధించిన మూలికలు, ధన్యాలు, ఇతర వస్తువులతో హోమాలు చేస్తారు. హోమాలు చేయడానికి ముఖ్య ఉద్దేశం గ్రహాలను సవరించడానికే. ఈ హోమానికి సంబంధించి జ్యోతిషవేత్తలు మానవాళికి కొన్ని సూచనలు అందిస్తున్నారు. అవేమిటంటే.. ఎవరైనా ఒక వ్యక్తిపై నవగ్రహాలలో ఏదో ఒక గ్రహ ప్రభావం తక్కువగా వుంటే.. దానికి సంబంధించిన విషయాలలోను, రంగాలలోను, కార్యకలాపాలలోను వ్యతిరేక ఫలితాలు వస్తాయి. అటువంటి సమయాలలో వారి ఇళ్లలో ఈ హోమాలను నిర్వహించుకునే చక్కటి ఫలితాలు అందుతాయి. ఈ హోమాలలో ఒక్కొక్క గ్రహానికి సంబంధించి రకరకాల మూలికలను ఉపయోగిస్తారు. శనిగ్రహం కోసం శమీ వృక్ష సమిధును, రాహువు కోసం గరిక, సూర్యానుగ్రమం కోసం అర్క సమిధి, కేతు గ్రహ ఉపశాంతి దర్భను ఉపయోగిస్తారు. ఆయుర్వేదం ప్రకారం మనం గ్రహిస్తే.. అర్క సమిధి, కుష్టు వ్యాధిని నయం చేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. అలాగే చందగ్రహ శాంతి కోసం ఉపయోగించే మోదుగ కూడా వైద్యపరంగా జీర్ణవ్యవస్థను అద్భుతంగా పునరుజ్జీవింప చేసే శక్తి కలిగి వుంటుంది. గురుగ్రహోపశాంతికి రావి చెట్టును ఉపయోగిస్తారు. ఇది వివిధ కఫ దోషాలను రూపుమాపడంతో విశిష్టమైందని ఆయుర్వేదంలో పేర్కొనబడి వుంది. ఈ విధంగా హోమం చేయడం వల్ల ప్రత్యక్షంగా మన ఆరోగ్యానికి, పరోక్షంగా నవగ్రహాలపై ప్రభావం చూపుతుంది.



ఆధ్యాత్మికం

# నాలాలు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేస్తే ఊరుకునేది లేదు

● రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి

**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** నాలా లు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేస్తే ఊరుకునేది లేదనీ రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి హెచ్చరించారు. హెచ్చరించడమే కాకుండా 35 వ డివిజన్ వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా శు క్రవారం ఐ బి కాలనీలో పర్యటించిన ఆయన ప్రదాన కాలువ కల్వర్ట్ ప్రక్కన అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని జె సి బి యంత్రం తో కూల్చివేయించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ నాలాలలో పూడిక తీత కార్యక్రమం నిరంతరంగా కొనసాగడానికి బఫర్ జోన్ అవసరమని అన్నారు. బఫర్ జోన్ ఆక్రమించి కట్టుకుంటే కూల్చివేయక తప్పదని అన్నారు. బఫర్ జోన్‌లో సానిటేషన్ ట్రాక్టర్ వెళ్ళడానికి వీలుగా సి సి రోడ్డు కూడా నిర్మిస్తామని అన్నారు. గతంలో కాలువల్లో పూడిక తీత అంటే లక్షల రూపాయలు వెచ్చించి టెండర్ పిలిచి తూతూ మంత్రంగా పనులు చేసేవారని ప్రస్తుతం నగర పాలక సంస్థ పై ఆర్థిక భారం పడకుండా మున్సిపల్ యంత్రాలతో మున్సిపల్ సిబ్బందితోనే పని చేయిస్తున్నామని అన్నారు. కాలువల్లో చెత్త వేయకుండా మునిసిపల్ వాహనానికి ఇవ్వాలని చేతులు జోడించి వేడుకుంటున్నానని అన్నారు. కాలువల్లో చెత్త వేయడం వలన పరిశుభ్రం చేయడానికి డబ్బు వృధా కావడంతో పాటు మురుగు నీరు సాఫీ గా పర్వహించకుండా నిలిచిపోయి దుర్వాసన, దోమలతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ జంగపెల్లి రమాదేవి శ్రీనివాస్ తో పాటు పలువురు కార్పొరేటర్లు కంకణాల మౌనిక రాజు, వడ్లూరి రవి, దాసరి సాంబమూర్తి, ధూళి కట్ట సతీష్ పలువురు నాయకులు వేగోలపు శ్రీనివాస్, పీచర శ్రీనివాస రావు, కాలనీ వాసులు శ్రమదానం చేశారు. పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి కాలువ ప్రక్కన పెరిగిన పిచ్చి చెట్లు , తుప్పలను తొలగించే పనిలో పాలు పంచుకున్నారు. నగర పాలక సంస్థ అధికారులు కూడా చేయి కలిపారు దీంతో ఐ బి కాలనీ కల్వర్ట్ కు ఇరువైపులా పొదలు తొలగి పోయి శుభ్ర పడడంతో పాటు పారిశుద్ధ్య సిబ్బంది , యంత్రాలు కాలువ లో సులువుగా పూడిక తొలగించడానికి అనుకూలంగా మార్గం ఏర్పడింది. శ్రమ దానంలో పంచుకున్న అందరినీ మేయర్ అభినందించారు. ఐ బి కాలనీ ప్రవేశంలో మూలన పేరుకుపోయిన శిధిలాలు చెత్త ను తొలగించారు. నీటి సరఫరా వాల్వ్ కోసం తవ్విన గుంత లపై ప్రమాదాలు జరగకుండా మూతలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదుటనే చెత్త ఉండడం గమనించి శు భ్రం చేయడానికి చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీస్ అధికారులకు సూచించారు. కాలనీ ప్రవేశం లోనే మూల మలుపు వద్ద వృధా గా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని ఆదేశించారు. మెడికల్ కళాశాల రోడ్డులో చైన్ జె సి బి యంత్రంతో పూడిక తీయడంతో మురుగు నీరు సాఫీగా ప్రవహిస్తున్నది. పూర్తి స్థాయిలో పని పవర్తయ్యేంతవరకు కొనసాగించాలని మేయర్ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు డి .ఇ.షాభాజ్, ఎ ఇ మీర్ , టి పి ఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, టి పి బి ఓ శ్రావణ్, ఎలెక్ట్రికల్ ఎ ఇ రాంజీ, సానిటరి ఇన్స్పెక్టర్ నాగ భూషణం, జవాన్ బండారి రవి తదితరులు పాల్గొన్నారు.








# ప్రజా పోరాటాలలో కమ్యూనిస్టులకు జైలు కొత్త కాదు

● అక్రమ కేసులు మోపి జైల్లో పెట్టడం సరికాదు ● సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రజా పోరాటాలలో కమ్యూనిస్టు నాయకులకు జైలు గోడలు కొత్త కాదని, కానీ న్యాయపోరాటం చేస్తున్న నాయకులపై అక్రమ కేసులు మోపి జైల్లో పెట్టడం సరికాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ఇటీవల రాఘవాపూర్ గ్రామ స్మశాన వాటిక కొరకు పోరాడి అక్రమ కేసులో భాగంగా జైలుకు వెళ్లి వచ్చిన సిపిఎం నాయకులు కల్లెపల్లి అశోక్, కుమ్మరి నవీన్ లను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పెద్దపల్లి పట్టణంలో కలిసి వారి పోరాట స్ఫూర్తిని కొనియాడారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ రాఘవాపూర్ గ్రామ స్మశాన వాటికలో నిర్మిస్తున్న సోలార్ ప్రాజెక్టును వేరొక చోట నిర్మించుకోవాలని ఐదు రోజులు శాంతియుతంగా ప్రజల కోసం న్యాయమైన పోరాటం చేస్తున్న సిపిఎం నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు తరలించడం సరైనది కాదని ప్రజల తరఫున నిలబడాల్సిన పోలీసులే రాజకీయ నాయకుల అండతో అక్రమ కేసులు పెట్టడం అంటే చట్టాన్ని అపహాస్యం చేశారన్నారు. ఈ రకమైన చర్యలు తీసుకోవడం సరైనది కాదన్నారు. సిపిఎం నాయకులు కేసులకు, జైల్లకు భయపడి ప్రజల పక్షాన పోరాటం ఆపే పరిస్థితులు ఉండవని తప్పుడు కేసులు పెడితే భవిష్యత్తులో ప్రజా పోరాటాలు చేస్తామని పోలీస్ శాఖ, అయిన రాజకీయ నాయకులైన ప్రభుత్వమైన నిస్వార్థంగా ప్రజల కోసం పోరాడుతున్న కమ్యూనిస్టు నాయకులపై దొంగ కేసులు పెట్టడం సరైనది కాదని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భవిష్యత్తులో ప్రజల కోసం నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడడానికి సిపిఎం నాయకులు ఎప్పుడు ముందుంటారని అట్లాగే జైలుకు వెళ్లి వచ్చిన నాయకులకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు భూపాల్, బండ రవికుమార్, శోభన్,ముత్యం రావు తదితరు పాల్గొన్నారు.




# కొచ్చిన్ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించండి

● ప్రజలకు అందుబాటులో ఉండే నేత షియాజ్ ● కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు

**కరీంనగర్ టౌన్, ఏప్రిల్3(ది క్రైమ్ న్యూస్):** మంచి అవకాశం వచ్చింది ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించే సత్తా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి సియాజ్ ను కొచ్చిన్ ఓటర్లు అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు కొచ్చిన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న షియాజ్ తో కలిసి శుక్రవారం ఇంటింటి ప్రచారంలో రాజేందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి షియాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కొచ్చిన్ లో మీడియాతో వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ డిసిసి అధ్యక్షుడిగా అద్భుతంగా పనిచేస్తున్న షియాజును ప్రజలు అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని పేర్కొన్నారు. ఇక్కడి ప్రజలను ఎవరిని అడిగిన షియాజ్ గెలుస్తున్నారని చెబుతున్నారనీ, ప్రజల్లో మంచి ఆదరణ ఉందని తెలిపారు. మంచి అవకాశం ఓటర్లంతా గోల్డెన్ ఛాన్స్ మిస్ కావద్దని డైనమిక్ లీడర్ మంచి పేరు ఉన్న సియాజ్ ను ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపించాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే కేరళ రాష్ట్రంలోనే కొచ్చిన్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతారని రాజేందర్రావు తెలిపారు. కచ్చితంగా అత్యధిక మెజార్టీతో షియాజ్ ఎమ్మెల్యేగా గెలుస్తారని వెలిచాల రాజేందర్ రావు ధీమా వ్యక్తం చేశారు.





# దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శం

- బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శమని బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి తెలిపారు. శుక్రవారం బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 99వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి, దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య సాయుధ పోరాటంలో నేలరాలిన తొలి రక్తపు చుక్క అని, నిరంకుశ పాలన నుంచి స్వేచ్ఛ వాయువులు పీల్చేందుకు ఆత్మ గౌరవ పతాకాన్ని ఎగుర వేసేందుకు ప్రాణాలు పణంగా పెట్టిన గొప్ప యోధుడు కొమురయ్య అని , ఆయన చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. మహనీయులను ఒక కులానికో, ఒక వర్గానికో పరిమితం చేయకుండా ఆయన ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘాల అధ్యక్షులు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడిగా చందర్....

- పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయం ప్రారంభం




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లిలో శుక్రవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా కార్యాలయాన్ని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రజిని కుమార్ ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడిగా మెరుగు చందర్ ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం వర్కింగ్ ప్రెసిడెంట్ రజిని కుమార్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీని విస్తరించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు చందర్ మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజల సమస్యలను ముందుకు తీసుకెళ్లి పార్టీని మరింత బలపరచడమే తన ప్రాధాన్యమని చెప్పారు. పెద్దపల్లిలో టీఆర్‌పీ కార్యాలయం ప్రారంభం కేవలం ఓ కార్యక్రమం మాత్రమే కాకుండా ప్రాంతీయ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు సంకేతంగా కనిపిస్తోందన్నారు. స్థానికంగా కొత్త నాయకత్వాన్ని ముందుకు తెచ్చే ప్రయత్నం ద్వారా పార్టీ తన విస్తరణ వ్యూహాన్ని అమలు చేస్తోందని స్పష్టమవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట కార్యదశి అఖిల్ భాష, సంజీవ్, జాషువా, శివదాసు రమేష్, నరేష్, మెరుగు సతీష్, ఎర్రం సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల పేరుతో ఏజెంట్లను నమ్మి మోసపోవద్దు

- ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లాలో గల తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, పెండింగ్ బిల్లులు క్లియర్ చేయిస్తామని చెప్పే ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని పెద్దపల్లి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ తెలిపారు. ఏ బిల్లులు జిల్లా స్థాయిలో మంజూరు కావు అనే విషయాన్ని గమనించాలని, ఎవరికో డబ్బులు ఇచ్చి మోసపోవద్దని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా నిరుద్యోగులు ప్రభుత్వ ఆసుపత్రులలో ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామంటే నమ్మవద్దన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు వారధి సొసైటీ ద్వారానే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో భర్తీ చేయడం జరుగుతుందని, ఈ విషయంలో ఉద్యోగ ఆశావహులు పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో గల వారధి కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఏవైనా ఉద్యోగ అవకాశాలు వుంటే వారికి ఇన్ఫర్మేషన్ అందజేయబడుతుందని గమనించాలన్నారు. పెద్దపల్లి జిల్లా ప్రజలకు అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఎల్లవేళల అందుబాటులో ఉంటారని ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలియజేశారు.

# ఇద్దరు కవల పిల్లలను బావిలో వేసి చంపిన కన్నతండ్రి

**● కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్‌లో ఘోరం ● ఆడపిల్లలు పుట్టారని కన్నతండ్రే ప్రాణాలు తీయడం చూసి గ్రామస్తులు కన్నీరుమున్నీరవుతున్నారు**

**కరీంనగర్ టౌన్, ఏప్రిల్3(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ రూరల్ మండల పరిధిలోని జూబ్లీనగర్ గ్రామంలో అత్యంత అమానుషమైన ఘటన వెలుగుచూసింది. కన్నతండ్రే కాలయముడై ఇద్దరు పసికందులను బావిలో వేసి హతమార్చిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం జూబ్లీనగర్‌కు చెందిన నిందితుడికి, అతని భార్యకు ఇటీవల కవల ఆడపిల్లలు జన్మించారు. అయితే, ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారనే నెపంతో నిందితుడు గత కొంతకాలంగా భార్యతో తరచూ గొడవ పడుతుండేవాడు. మగ పిల్లవాడు పుట్టలేదనే కక్షతో పసికందుల పట్ల ద్వేషం పెంచుకున్నాడు. ఈ క్రమంలో, బుధవారం తన ఇద్దరు కవల పిల్లలను



ఎత్తుకెళ్లి సమీపంలోని వ్యవసాయ బావిలో పడేశాడు. ఆ తర్వాత ఏమీ తెలియనట్టుగా పిల్లలు ఆడుకుంటూ పొరపాటున బావిలో పడిపోయారని నమ్మించే ప్రయత్నం చేశాడు. తండ్రి ప్రవర్తనపై అనుమానం వచ్చిన స్థానికులు, బంధువులు అతడిని నిలదీయగా అసలు నిజం బయటపడింది. నిందితుడి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్థులు అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. సమాచారం అందుకున్న కరీంనగర్ రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు. నిందితుడిపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై లోతైన దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# ప్రేమ సహనం శాంతికి నిర్వచనం క్రీస్తు

**● మానవాళి పాప పరిహార్థం క్రీస్తు సిలువ మరణం ● పాస్టర్ దూడ మహేష్**






**రామగిరి, ఏప్రిల్ 03(ది క్రైమ్ న్యూస్):-** ప్రేమ సహనం శాంతికి నిర్వచనం క్రీస్తు ప్రభువు అని, ఆయన చూపించిన మార్గంలో అందరు నడుస్తూ ప్రపంచం శాంతిమయం కావాలని, క్రీస్తు బోధ నలు ప్రపంచశాంతికి దిక్సూచి అని, యేసు అనుగ్రహం అందరిపై ఉండాలని పాస్టర్ దూడ మహేష్ పేర్కొన్నారు. క్రైస్తవుల పర్వదినం గుడ్ ఫ్రైడే పండుగ సందర్భంగా శుక్రవారం మంథని మున్సిపల్ పరిధి శ్రీపాదకాలనీ సీయోను చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకల్లో ఆయన మాట్లాడుతూ మానవాళి పాప పరిహార్థం క్రీస్తు సిలువ మరణం పొందాడని, ప్రేమ, సహనం, శాంతికి నిర్వచనం యేసు క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి దిక్సూచి అని, మానవవాళికి ప్రేమ, శాంతిమార్గం చూపిన మహనీయుడు యేసుక్రీస్తు అని అన్నారు. అతడి అనుగ్రహం అందరిపైనా ఉండాలని తెలిపారు. జీసస్ బోధనలతో ప్రపంచ శాంతి మయం కావాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. యేసుక్రీస్తు ప్రభువు సత్యాన్ని ఏనాడు విడనాడలేదని, తను నమ్మిన సిద్ధాంతం కోసం, తన భక్తుల కోసం ప్రాణాలు అర్పించిన గొప్పమహా నీయుడని ఆయనను కొనియాడారు. క్రీస్తు బోధనలు అందరూ అవగతం చేసుకొని, సన్మార్గంలో ముందుకెళ్లాలని ఆయన తెలిపారు. యేసు దైవత్వము సంబంధించిన విద్యను క్రిస్టోలోజి అని పిలు స్తారని, చరిత్రకారులు మానవ చరిత్రను యేసు క్రీస్తు జీవించిన కాలాన్ని కొలమానంగా తీసుకుంటారు. క్రీస్తు జన్మించకముందు కాలాన్ని క్రీస్తుపూర్వం అని, క్రీస్తు జన్మించిన తర్వాత కాలాన్ని క్రీస్తుశకం అని పేర్కొంటారని వివరించారు. క్రీస్తు ప్రభువు సూచించిన మార్గంలో నడుస్తూ ప్రతి ఒక్కరి హృదయాల్లో ప్రేమ నిండాలని తెలిపారు. ప్రేమ, కరుణ, క్షమాగు ణాలను ఏసు తన జీవిత సందేశంగా మానవాళికి అందించారు.. ప్రతి మనిషి పరోపకారం అలవరుచుకోకపోతే జీవితానికి అర్థం ఉండదన్నారు. ఈ సందర్భంగా యేసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను ద్యానించారు. అనంతరం శ్రీపాద కాలనీ చర్చి నుండి అంబేద్కర్ చౌక్ వరకు సిలువ ధ్యాన సువార్త ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు మంథని మార్క్, అజ్మీరా దయారాజు, కలువల సామ్యూల్, చిప్పకుర్తీ సుధాకర్, సంఘ పెద్దలు అంకరి కుమార్, ఎం కే జోసెఫ్, మంథని ప్రసాద్, అందే రమేష్, చింతకుంట్ల ప్రేమ్ కుమార్, దాసరి సదానందం, రామగిరి కుమార్, ఈర్ల సదా నందంతో పాటు స్త్రీల కమిటీ నాయకులు హేమలత, పద్మజ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుండే మంచి అలవాట్లతో క్రమశిక్షణతో ముందుకు సాగాలి

**● మంచి పేరు సాధిస్తే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు ప్రఖ్యాతలు ● ఘనంగా ప్రగతి ప్రీ ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ● ముఖ్య అతిథులుగా జేఎన్టీయూ ప్రిన్సిపల్ డా.బి విష్ణువర్ధన్, ఏంఈఓ కొమురయ్య, టీబీజీకేఎస్ జనరల్ సెక్రటరీ మిర్యాల రాజిరెడ్డి - పాఠశాల కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి**



**రామగిరి, ఏప్రిల్ 03(ది క్రైమ్ న్యూస్):-** స్థానిక సింగరేణి కమ్యూనిటీ హాల్ లో ప్రగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేఎన్టీయూ ప్రిన్సిపల్ డా.బి విష్ణువర్ధన్, ఏంఈఓ కొమురయ్య , టీబీజీకేఎస్ జనరల్ సెక్రటరీ మిర్యాల రాజిరెడ్డి, నాగరాజ కుమారి, పాఠశాల కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి, హాజరై పిపి-టు, ఐదు వ తరగతి పూర్తి చేసిన విద్యార్థిని,విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటో లను అందజేశారు. విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి జేఎన్టీయూ ప్రిన్సిపల్ డా.బి విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో సాగుతూ మంచి పేరు తీసుకురావాలిని విద్యార్థి దశ నుండే మంచి అలవాట్లతో క్రమశిక్షణతో ముందుకు సాగి మంచి పేరు సాధిస్తే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు ప్రఖ్యాతలు సాధించిన వారు అవుతారని వారు తెలిపారు. అదేవిధంగా అంగులీయ అబాకస్ జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థుల అద్భుత ప్రతిభ గోల్డ్, సిల్వర్ మెడల్స్ కైవసం చేసుకున్న ప్రగతి విద్యార్థిని, విద్యార్థులకు టీబీజీకేఎస్ జనరల్ సెక్రటరీ మిర్యాల రాజిరెడ్డి గోల్డ్, సిల్వర్ మెడల్స్, ప్రశంస పత్రాలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అబాకస్ శిక్షణ వల్ల పిల్లల్లో జ్ఞాపకశక్తి, తార్కిక ఆలోచన పెరుగుతాయని, ఈ విద్యార్థుల ప్రతిభ చూస్తుంటే భవిష్యత్తులో గొప్ప గణిత శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని కొనియాడారు. వీరితో పాటుగా పాఠశాల కరస్పాండెంట్ అబ్బుకేశవరెడ్డి మాట్లాడుతూ.. "నేటి పోటీ ప్రపంచంలో గణితంపై పట్టు సాధించేందుకు అంగులీయ అబాకస్ ఒక సంజీవనిలా పని చేస్తుంది. మా పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో మెడల్స్ సాధించడం గర్వకారణం అని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ కొప్పుల గోవర్ధన్ రావు, పాఠశాల అధ్యాపక బృందం విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# నేలకొరిగిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి..

**● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసి పట్ల లక్ష్మీనారాయణ**

**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఉత్తర తెలంగాణ లో కురిసిన అకాల వర్షానికి గురైన పంట నష్టానికి పరిహారం చెల్లించాలని శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్ శ్రీలత కు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి వినతి పత్రం అందజేశారు ఇటీవల కురిసిన వర్షాలతో ఉత్తర తెలంగాణలో (98) మండలాలలో 42వేల 824 ఎకరాలలో పంటనష్టం వాటిల్లిందని. పంట చేతికచ్చే సమయంలో అకాల వర్షాలతో పంట నేలకొరగడంతో రైతన్నలకు తీవ్ర నష్టం కలిగిందని రాష్ట్రప్రభుత్వం క్షేత్ర స్థాయిలో అధికారులతో సర్వేలు నిర్వహించి నష్టపోయిన రైతన్నలకు నష్టపరిహారంగా ఎకరాకు 25,000/- రూపాయలు చెల్లించాలని మున్సిపల్ లక్ష్మీ నారాయణ డిమాండ్ చేశారు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు ఒక్కరాత్రి కురిసిన వానతో తడిసిముద్దయి, నేలకొరిగినాయనితెలిపారు. 98మండలాలలో అధిక ఎకరాల మామిడి, వరి, మొక్కజొన్న, నువ్వు,పసుపు,సజ్జలతో పాటు కూరగాయలకు నష్టం వాటిల్లినదనితెలిపారు.ఐ.కె.పి. సెంటర్లకు తరలించిన వరిధాన్యంకూడాతడిసిపోయి రైతన్నలు రోడ్డున పడ్డారని ఉన్నారు. పంటభీమా పతకం అమలు చేయడంలో అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వంనిర్లక్ష్యంచేయడంతో ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లిందిన్నరు పంటభీమా పథకాన్ని రాష్ట్రంలో అమలు అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో తెలంగాణ వంజరి సంఘం జాయింట్ సెక్రటరీ ఆరెశంకర్, తెలంగాణ రాష్ట్ర బీసి కోర్డినేటర్ హృషికేష్, సాల్వేర్ రాజేశం, పిండేరి. శ్రవణ్, పాపాన్క శ్రీనివాస్, ధాత్రిక శ్రీనివాస్, రాపర్తి రవి, బందెల మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కేరళ ఉపఎన్నికల ప్రచారంలో వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 3(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు, కేరళలోని త్రిక్కకర నియోజకవర్గ ఉపఎన్నికల ప్రచారంలో వెలిచాల రాజేందర్ రావు చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ పర్యటనలో భాగంగా, త్రిక్కకర నియోజకవర్గం నుండి యుడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దివంగత మాజీ ఎంపీ పీటీ థామస్ సతీమణి ఉమా థామస్‌ని రాజేందర్ రావు మర్యాద పూర్వకలంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రచార సరళి, గెలుపు వ్యూహాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

# కల్వచర్లలో వారసంత ప్రారంభం

**- కల్వచర్ల గ్రామ సర్పంచ్ రేండ్ల శారద- కుమారస్వామి**





**రామగిరి, ఏప్రిల్ 03(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామంలో సర్పంచ్ రేండ్ల శారద-కుమారస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం వారసంతను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రామగిరి తహసీల్దార్ సుమన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వారసంత ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుండి నిర్వహించ బడుతుందని అన్నారు. రైతులు పండించిన తాజా కూరగాయలను అతి తక్కువ ధరల్లో నేరుగా ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామశీ మధ్యలో సౌకర్యవంతమైన ప్రాంతంగా ఉన్న కల్వచర్ల లో దీనిని ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు కూరగాయలు, నిత్యావసర వస్తువుల కొనుగోళ్ల కోసం సెంటనరీ కాలనీ కి వెళ్లాల్సిన పరిస్థితి ఉండగా, కల్వచర్ల లోనే వారసంత ప్రారంభం కావడంతో లొంకెకాసారం, గోకుల్ నగర్, మారుతీనగర్ తదితర గ్రామాల ప్రజలకు దూర ప్రయాణం తప్పనుంది. అందుబాటులోనే అన్ని రకాల కూరగాయలు, సరుకులు లభించను న్నాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కల్వచర్ల గ్రామ సర్పంచ్ రేండ్ల శారద- కుమారస్వామి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు పాలకవర్గాన్ని కల్వచెర్ల గ్రామ ప్రజలు అభినందించారు. గ్రామ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై వారసంత ప్రారంభాన్ని స్వాగతించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సెక్రటరీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ కలెక్టరేట్‌లో ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు

**- జూలై 4లోపు విగ్రహ ఏర్పాటుకు హామీ**





**కరీంనగర్ టౌన్, ఏప్రిల్3(ది క్రైమ్ న్యూస్):** జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, అమరవీరుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్, ఆర్డీవో, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కురుమ కుల బాంధవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీస మాధురి మాట్లాడుతూ తన తండ్రి, దివంగత మీస బీరయ్య ఆశయమైన "దొడ్డి కొమురయ్య కాంస్య విగ్రహ ఏర్పాటు" గురించి అసిస్టెంట్ కలెక్టర్ కి, ఆర్డీవో కి లైబ్రరీ చైర్మన్ కి విన్నవించారు. తన విన్నపానికి సానుకూలంగా స్పందించిన లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ వచ్చే వర్ధంతి (జూలై 4వ తేదీ) నాటికి విగ్రహ ఏర్పాటుకు తగిన స్థలాన్ని ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. తన విన్నపాన్ని మన్నించి సానుకూల హామీ ఇచ్చినందుకు సత్తు మల్లేశం కి, అధికారులకు నా తరపున తన తండ్రి స్వర్గీయ మీస బీరయ్య తరపున, కురుమ కుల బాంధవులందరి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఐ డి ఓ సి కార్యాలయంలో ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు

- పూలమాల వేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**భూపాలపల్లి, ఏప్రిల్ 3: (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమరయ్య త్యాగాలు, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలు భూపాలపల్లి ఐడిఓసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ముఖ్య అతిథిలుగా హాజరై దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య చూపిన ధైర్యం, అంకిత భావం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. సమాజంలో సమానత్వం, న్యాయం కోసం పోరాడిన మహనీయుల మార్గంలోనే మనదరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం బిసి సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు దొడ్డి కొమురయ్య సేవలను స్మరించుకొని ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర, సహాయ వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి క్రాంతి కిరణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్ అప్పం కిషన్, యాదవ సంఘ జిల్లా అధ్యక్షులు మేకల సంపత్, మరియు సదానందం, సతీష్, యాదవ మరియు కురుమ సంఘ నాయకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఓసీపీ-టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి
- సీఐటీయూ ఆర్.జీ-త్రీ కార్యదర్శి దొమ్మటి కొమురయ్య



**రామగిరి, ఏప్రిల్ 03(ది క్రైమ్ న్యూస్):-** సింగరేణి ఆర్.జీ-త్రీ లోని ఓసీపీ-టులో కార్మికుల నుండి సేకరించిన సమస్యలపై సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి సమక్షంలో మేనేజర్ సంపత్ కుమార్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కార్మికుల సమావేశానికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి హాజరై మాట్లాడారు.కార్మికులు అందరూ ఐక్యంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కార్మికుల సంక్షేమం కోసం సీఐటీయూ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా క్యాంటీన్, మ్యాన్వే ప్రక్కనున్న మురుగు కాలువను అండర్ గ్రౌండ్ డ్రైనేజీగా మార్చాలిని ప్రతి వర్షాకాలం ముంపు కి గురవుతున్న సైట్ ఆఫీస్, మ్యాన్వే, క్యాంటీన్ ఎస్ఏంఈ సెక్షన్ ల వద్ద ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని క్యాంటీన్ వద్ద కోతులు, కుక్కల బెడద నివారించాలి.అలాగే ఎస్ డిడి సెక్షన్ లో మహిళలకు డ్రెస్సింగ్ రూమ్ టాయిలెట్స్ నిర్మించాలని ఎస్ డిడి సెక్షన్లో ఆర్ఓ ప్లాంట్ సదుపాయం కల్పించాలి.మిషనరీ రిపేర్లకు స్పేర్ పార్ట్స్ కల్పించాలి,క్రషర్స్ లో ఏసీలు బాగు చేయించాలి,కార్మికులకు తక్షణమే నాణ్యమైన బూట్లు ఇవ్వాలి. టెక్నీషియన్స్ , సూపర్వైజర్ స్టాఫ్ కొరత పూరించాలి,లైట్ వెహికల్, డోజర్ మరియు డంపర్ వాషింగ్ పిట్లు వేరువేరుగా ఉండాలి, టాయిలెట్లు శుభ్రంగా ఉండాలి.ఇంకా పలు సమస్యలని వెంటనే పరిష్కరించాలని ఈ వినతి పత్రం ద్వారా కోరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆర్.జీ-త్రీ కార్యదర్శి దొమ్మటి కొమురయ్య, ఎద్దు కుమార్, ఆసరి మహేష్, వేణుగోపాల్, రమణారెడ్డి, రాయమల్లు, మల్లికార్జున్, మీనయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# బొమ్మకల్ శివారు ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి






**కరీంనగర్ టౌన్, ఏప్రిల్3(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగరం బొమ్మకల్ శివారులో గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రాత్రి సుమారు 10:15 గంటల ప్రాంతంలో తీగలవంతెన వైపు నుండి అతివేగంతో వస్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు (నెం.టీ ఎస్ 02 ఇ 3223), బొమ్మకల్ శివారులోని సమీర్ దాబా ముందు పార్క్ చేసి ఉన్న లారీని (వా.నెం.బి ఆర్ 21 జీడీ 2168) వెనుక నుండి బలంగా ఢీకొట్టింది. కారు అతివేగంగా ఉండటంతో లారీ కిందకు దూసుకుపోయింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మృతుల వివరాలు సయ్యద్ అబ్దుల్ రెహమాన్ (19), సయ్యద్ అతియాబ్ హుస్సేన్ (21), కరీంనగర్ (డ్రైవర్). క్షతగాత్రుల వివరాలు మహమ్మద్ అద్నాన్ (18) తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మహమ్మద్ అబ్రార్ (20) స్వల్ప గాయాలతో కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శుక్రవారం స్వయంగా ఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును స్థానిక రూరల్ ఏసీపీ విజయ కుమార్, రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి లను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ప్రస్తుతం ఘటనా స్థలంలో పరిస్థితి ప్రశాంతంగా ఉందని, అతివేగమే ఈ ప్రమాదానికి ప్రాథమిక కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రూరల్ ఇన్స్పెక్టర్ తెలిపారు.

# అమీన్పూర్‌లో ఎస్‌టీపీ ఏర్పాటు ప్రతిపాదనపై స్థానికుల ఆందోళన

**సంగారెడ్డి జిల్లా (ది క్రైమ్ న్యూస్):** అమీన్ పూర్ పరిధిలోని సర్వే నంబర్ 993లో ప్రతిపాదితంగా ఏర్పాటు చేయబడుతున్న 100 ఎంఎల్డి సామర్థ్యమున్న ఎస్టీపీ (సెవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) నిర్మాణంపై స్థానిక నివాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోదీ విల్లాస్, గోల్డెన్ ప్లామ్స్ కాలనీలకు అనుకొని ఈ ప్లాంట్‌ను నిర్మించేందుకు చర్యలు జరుగుతున్నట్లు సమాచారం అందుతున్న నేపథ్యంలో కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల తరపున న్యాయవాది, సామాజికవేత్త అడ్వకేట్ రవికృష్ణ ప్రెస్ నోట్ విడుదల చేస్తూ, ఈ ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటు వల్ల కేవలం రెండు కాలనీలకే కాకుండా సమీపంలోని లింగమయ్య కాలనీ, సాయి భగవాన్ కాలనీతో పాటు పుణ్యక్షేత్రమైన భ్రమరాంబిక మల్లికార్జున దేవస్థానం పరిసర ప్రాంతాలపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా దుర్గంధ సమస్య తీవ్రంగా పెరిగే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ రెండు కాలనీలలో కలిపి సుమారు 150కు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఎస్టీపీ ప్లాంట్ వల్ల దుర్వాసనలు, ఆరోగ్య సమస్యలు, పర్యావరణ కాలుష్యం వంటి ఇబ్బందులు తలెత్తే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా, ప్లాంట్ నిర్మాణం కోసం ఎంపిక చేసిన ప్రదేశంలో వందల సంఖ్యలో చెట్లను నరుకుతున్నారని, అక్కడ నివసిస్తున్న నెమళ్లు మరియు ఇతర జీవరాశులకు ముప్పు వాటిల్లుతోందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. జేసీబీలతో జరుగుతున్న తవ్వకాల కారణంగా ఆ జీవరాశులు కాలనీల్లోకి ప్రవేశించడం ప్రారంభించాయని వారు చెబుతున్నారు. ఇక ఈ ప్రాంతానికి సమీపంలో ఇప్పటికే ఒక డంప్ యార్డ్ ఉండటం, అక్కడ చెత్తను సమయానికి తొలగించకపోవడం వల్ల దోమల పెరుగుదల అధికమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మరొక భారీ ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటు చేస్తే సమస్యలు మరింత పెరిగే ప్రమాదం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై చర్చించేందుకు, తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు మోదీ విల్లాస్, గోల్డెన్ ప్లామ్స్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులను త్వరలోనే కలవాలని నిర్ణయించారు. తక్షణం సమస్యపై స్పందించి, సరైన పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## ఐక్య యువజన సమైక్య ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు



**భూపాలపల్లి, ఏప్రిల్ -3:(ది క్రైమ్ న్యూస్):** దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా(యువై ఎఫ్ ఐ) భారత ఐక్య యువజన సమైక్య తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అక్కల బాబు యాదవ్ శుక్రవారం భూపాలపల్లి లో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి మాట్లాడుతూ ఆయన తెలంగాణ సాయుధ పోరాటాల తొలి అమరుడు, భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన నాయకుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. ఆయన 1927 ఏప్రిల్ 3న జనగామ జిల్లా దేవరపుల్ల మండలంలోని కండవెండి గ్రామంలో జన్మించారు. ఆయన చేసిన త్యాగాలను ఎప్పటికీ మరువలేవని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంతెన రాజశేఖర్, గంధం పోచయ్య, ఐలేని మల్లయ్య, బొడ్డు లింగయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల విగ్రహాల ముసుగులను వెంటనే తొలగించండి

**- తిమ్మాపూర్ రాజకీయ, ప్రజాసంఘాల జెఏసి కమిటీ**




**కరీంనగర్ టౌన్, ఏప్రిల్3(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రం, ఆర్ టీ సి బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్ రాం, అంబేద్కర్ విగ్రహాలకున్నటువంటి ముసుగులను వెంటనే తొలగించాలని తిమ్మాపూర్ మండల రాజకీయ, ప్రజాసంఘాల జెఏసి సభ్యులు డిమాండ్ చేశారు. జేఏసీ సభ్యుల సమావేశంలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూగత మూడేళ్లుగా ముసుగులతో ఉండటం వల్ల ప్రజాస్వామ్య వాదులకు చాలా అవమానం జరుగుతుందని అన్నారు. ఈనెల 5 న మాజీ ఉప ప్రధాని స్వర్గీయ జగ్జీవన్ రాం జయంతి సందర్బంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్ లో నిర్వహించే ఉత్సవాలకు మండలం లోని అంబేద్కర్ వాదులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలు, బహుజన నాయకులు ప్రతీ ఒక్కరూ హాజరుకావాలని కోరారు. విగ్రహాల ముసుగుల తొలగించే విషయం లో ఒక కార్యాచరణ రూపొందించుకుందామని జెఏసి సభ్యులు మాతంగి శంకర్,సుగుర్తి జగదీశ్వరాచారి, వంతడుపుల సంపత్, కనకం రాములు పేర్కొన్నారు.ఈ సమావేశం లో సముద్రాల లక్ష్మణ్,కొయ్యడ మురళి, హరీష్, ఎల్కపల్లి లక్ష్మణ్, పొన్నాల చిరంజీవి, జె. ప్రణయ్, ఆకుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్యాసింజర్ ఆటో దగ్ధం.....తప్పిన పెను ప్రమాదం



**తిమ్మాపూర్,ఏప్రిల్ 3(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఇంద్రనగర్ వద్ద శుక్రవారం సాయంత్రం ప్యాసింజర్ ఆటోలో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయి ప్రమాదం తప్పింది. ప్రయాణికులతో కరీంనగర్ నుండి సిద్దిపేటకు వెళుతున్న టాటా ఏస్ ఆటో ఇంజన్ నుండి పొగలు రాగా డ్రైవర్ హైమద్ పాషా వెంటనే అప్రమత్తమై ఆటోను పక్కకు నిలిపి అందులోని ప్రయాణికులను దించాడు. ఇంజన్ నుండి మంటలు చెలరేగడంతో స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలనుఆర్పివేశారు.ఆటో పూర్తిగా కాలిపోయి, ఆరుగురు ప్రయాణికులు మాత్రం సురక్షితంగా బయటపడ్డట్లు డ్రైవర్ అహ్మద్ పాషా తెలిపారు.

## బాదం పప్పు నానబెట్టి తింటే మంచిదా? లేదంటే పచ్చిగా తింటే మంచిదా?



చాలా మందికి రోజూ ఉదయాన్నే నానబెట్టిన బాదంపప్పు తినడం అలవాటు. అయితే బాదంపప్పు నానబెట్టి తింటే మంచిదా.. లేదంటే అలాగే పచ్చిగా తింటే మంచిదా అనే సందేహం కూడా చాలా మందిలో ఉంటుంది. బాదంపప్పు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. కానీ మీరు సరైన పద్ధతిలో తింటేనే ప్రయోజనాలు పొందవచ్చు. కాబట్టి బాదంపప్పును పచ్చిగా తినాలా? నానబెట్టి ఎలా తినాలా అనే విషయం ఇప్పుడు తెలుసుకుందాం.. బాదంలో విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. అంతేకాకుండా బాదంలో కాల్షియం, ఫాస్పరస్ కూడా ఉన్నాయి. ఇవి శరీరానికి పోషకాలను అందిస్తాయి. బాదం పప్పును ఉదయాన్నే పరగడుపున తీసుకుంటే ప్రయోజనాలు పొందవచ్చు. ఇందుకోసంరాత్రి పడుకునే ముందు కొన్ని బాదంపప్పులను నీళ్లతో వేసి నానబెట్టాలి. తర్వాతవాటిని తొక్క తీసి ఉదయం పూటా ఖాళీ కడుపుతో తినాలి. అలాగే బాదంపప్పును స్నాక్‌గా కూడా తినవచ్చు. పచ్చి వాటి కంటే నానబెట్టిన బాదం శరీరానికి ఎక్కువ మేలు చేస్తుంది. అలాగే బాదం షేక్ చేసి కూడా తాగొచ్చు. కానీ బాదంలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల బరువు పెరగడానికి దారితీయవచ్చు. అందుకే వీటిని పరిమితంగా మాత్రమే తీసుకోవాలి.నట్‌ఎలర్జీ ఉన్నవారు వాటిని తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మర్చిపోకూడదు. ఎలర్జీ ఉన్న వారు వీటికి దూరంగా ఉండటం బెటర్.

# డయాబెటిస్ పేషెంట్స్ కొబ్బరి నీళ్లు తాగొచ్చా.? నిపుణులు ఏమంటున్నారు



కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మంచిదని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇందులోని ఎలక్ట్రోలైట్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మరీ ముఖ్యంగా సమ్మర్‌లో కొబ్బరి నీళ్లు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. కొబ్బరి నీళ్లు రుచి విషయంలో తియ్యగా ఉంటాయి. దీంతో డయాబెటిస్ రోగులు కొబ్బరి నీళ్లు తాగ కూడదనే భావనలో ఉంటారు. ఇంతకీ డయాబెటిస్ రోగులు కొబ్బరి నీళ్లు తీసుకుంటే ఎమైనా ప్రమాదం ఉంటుందా.? నిపుణులు ఏం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. పాల కంటే కొబ్బరి నీటిలో



ఎక్కువ పోషకాలు లభిస్తాయి. ఇందులోని కొవ్వు పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది. క్రమం తప్పకుండా తినే వ్యక్తులు వారి శరీరంలో పొటాషియం, సోడియం, కాల్షియం, మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్లను పొందుతారు. లేత కొబ్బరి నీటిని తాగడం వల్ల శరీరం నుంచి ట్యాక్సిన్లు తొలగిపోతాయి. అయితే కొబ్బరి నీళ్లు తియ్యగా ఉంటాయి కాబట్టి డయాబెటిస్ పేషెంట్లకు మంచిది కాదనే అభిప్రాయంలో నిజం లేదని నిపుణులు చెబుతున్నారు. కొబ్బరి నీటిని ఎలాంటి సందేహం లేకుండా తాగొచ్చని చెబుతున్నారు. కొబ్బరి నీళ్లలో గ్లైసెమిక్ ఇండెక్స్ (జిఐ) తక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. లేత కొబ్బరి నీళ్లలో ఉండే మెగ్నీషియం ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. కొబ్బరిని తాగడం వల్ల శరీరంలో డీహైడ్రేషన్ సమస్య రాకుండా చూస్తుంది. ఇక కొబ్బరి బోండ లోపల ఉండే కొబ్బరిని కూడా తినొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇందులో మెటబాలిజం మెరుగుపరచడంలో సహాయపడే అనేక పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే, క్రీమ్ తినడం వల్ల శరీర కొవ్వు తగ్గుతుంది, అందువల్ల క్రీమ్‌ను రెగ్యులర్ డైట్‌లో భాగం చేసుకోవాలి. ఇందులో మంచి కొలెస్ట్రాల్ ఉంటుంది, ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

## చామదుంపలో ఉండే ఈ గుణం గుండె జబ్బులు రాకుండా అడ్డుకుంటుంది..! డయబెటీస్‌కు బెస్ట్ ఫుడ్..!!



విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ ఇ, విటమిన్ బి 6, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, జింక్ వంటి అనేక ముఖ్యమైన పోషకాలతో సమృద్ధిగా ఉన్న చామదుంపలు చాలా ఇళ్లలో ఇష్టంగా తింటారు. దాని రుచిని ఇష్టపడని వారు కూడా ఉన్నారు. మీరు కూడా అలాంటి వారిలో ఒకరైతే, ఈ రోజు మేము దాని ప్రయోజనాలను మీకు తెలియజేస్తాము. ఇది తెలిసిన తర్వాత మీరు తప్పక మీ ఆహారంలో భాగంగా చేర్చుకుంటారు. వేసవిలో బలహీనమైన రోగనిరోధక శక్తిని పెంచడంలో, అనేక శరీర సమస్యల నుండి ఉపశమనం పొందడంలో చామగడ్డను తినడం ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకుందాం. హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.. చామగడ్డలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి దీని వినియోగం శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఎక్కువ ఫైబర్ తినడం వల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. మొత్తంమీద, దీనిని తినడం వల్ల మీ మొత్తం గుండె ఆరోగ్యానికి ప్రయోజనం చేకూరుతుంది. బరువు తగ్గడంలో ప్రయోజనకరంగా ఉంటుంది.. ఊబకాయంతో బాధపడేవారికి చామదుంపలు తీసుకోవడం చాలా ప్రయోజనకరంగా పనిచేస్తుంది. వేసవిలో దీనిని తినడం వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. అటువంటి పరిస్థితిలో మీకు ఎక్కువసేపు ఆకలి అనిపించదు. అదనపు కేలరీలను తీసుకోకుండా మిమ్మల్ని మీరు ఆపుకోగలుగుతారు. దీని ప్రభావం బరువులో కనిపిస్తుంది. ఈ విధంగా చామగడ్డను మీ ఆహారంలో భాగం చేసుకోవటం వల్ల బరువు తగ్గడానికి చాలా మంచిది. కళ్లకు మేలు చేస్తుంది.. బీటా-కెరోటిన్, క్రిప్టోక్సాంటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నందున చామగడ్డ తీసుకోవడం వల్ల మీ కళ్ళు ఆరోగ్యంగా ఉంటాయి. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రెటీనా దెబ్బతినకుండా కాపాడతాయి. కంటిశుక్లం ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి. అటువంటి పరిస్థితిలో చిన్న వయస్సులోనే కంటి సంబంధిత సమస్యలు మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం ప్రారంభించినట్లయితే, ఆహారంలో చామగడ్డను తరచుగా చేర్చుకోవడం మంచిది. కండరాలు, ఎముకలకు మేలు చేస్తుంది. చామదుంప రెగ్యులర్ వినియోగం కండరాలు, ఎముకలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది . ఐరన్, కాపర్, మెగ్నీషియం, జింక్ వంటి అనేక పోషకాలుఈ కూరగాయలలో ఉన్నాయి. ఇది ఎముకల ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు, క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతాయి.. చాలా మంది ప్రజలు వేసవిలో తక్కువ రోగనిరోధక శక్తితో పోరాడుతున్నారు. అటువంటి పరిస్థితిలో చామదుంపను రెగ్యూలర్‌గా తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. సీజన్‌తో పాటు పెరిగే ఇన్‌ఫెక్షన్లతో పోరాడడంలో శరీరానికి సహాయపడుతుంది. దీని వినియోగం విటమిన్ సి లోపాన్ని కూడా తొలగిస్తుంది. ఇది ఫ్రీ రాడికల్ డ్యామేజ్ నుండి మిమ్మల్ని రక్షిస్తుంది.

# తులసి నీళ్లు రోజూ తాగితే అమృతం తాగినట్లే..! అందం, ఆరోగ్యంతో పాటు బోలెడు ప్రయోజనాలు!

యాంటీఆక్సిడెంట్, యాంటీమైక్రోబయల్ లక్షణాలు నిండివున్న తులసి రోగనిరోధక వ్యవస్థను పునరుద్ధరించడానికి, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది. ఈ వేడి సీజన్‌లో తులసి నీటిని తాగడం వల్ల అద్భుతమైన ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఖాళీ కడుపుతో తులసి నీటిని తాగడం వల్ల జీర్ణ సమస్యలు, కడుపునొప్పి, గ్యాస్, అసిడిటీ వంటి అసౌకర్యాల నుండి ఉపశమనం పొందవచ్చు. ఈ పానీయం శరీరాన్ని శుభ్రపరచడంలో, ఆరోగ్యకరమైన జీర్ణ ప్రక్రియను ప్రారంభించడంలో సహాయపడుతుంది. దాని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీమైక్రోబయల్ లక్షణాలతో, తులసి నీరు దగ్గు, జలుబు లక్షణాలను తగ్గించడంలో సహాయపడుతుంది. శ్వాసకోశ ఆరోగ్యాన్ని సమర్థవంతంగా బలోపేతం చేస్తుంది. తులసి ఆకులు సహజమైన డిటాక్సిఫైయర్. ఉదయాన్నే పరగడుపున తులసి నీటిని తాగడం వల్ల డిటాక్సిఫికేషన్ జరుగుతుంది. ముఖ్యంగా ఉదయాన్నే ఖాళీ కడుపుతో తులసి నీటిని తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్, క్రిములు బయటకు వెళ్లిపోతాయి. జీర్ణ సంబంధ వ్యాధులు దూరంగా ఉంటాయి. తులసి నీటిని తాగడం వల్ల చర్మ ఆరోగ్యానికి కూడా సహాయపడుతుంది. ఇందులోని యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు చర్మ పరిస్థితులకు చికిత్స చేయడానికి ఉపయోగపడతాయి. తులసి నీటిని తాగడం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. తులసి నీరు కార్టిసాల్ హార్మోన్ స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది శరీరంలో ఒత్తిడిని కలిగించే ఒత్తిడి హార్మోన్ అని కూడా పిలుస్తారు. తులసి నీటిని తాగడం వల్ల



కార్టిసాల్ స్థాయిలు తగ్గుతాయి. అలాగే మీరు ఒత్తిడి లేకుండా ఉండేందుకు సహాయపడుతుంది.

## తెల్లగా ఉన్నాయ్ ఇవేం చేస్తాయిలే అనుకునేరు.. ఆ సమస్యలకు దివ్యౌషధం..



ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదంటారు.. ఎందుకంటే.. ఉల్లిపాయల్లో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే, ఉల్లిపాయను ఆరోగ్యానికి నిధిగా భావిస్తారు.. వాస్తవానికి ఉల్లిపాయలు లేకుండా ఏ కూరగాయల రుచి కూడా బాగుండదు.. సాధ్యమైనంత మేరకు ఉల్లి లేకుండా కూరనే వండరు.. అందుకే.. ఏదిఏమైనప్పటికీ.. ఇంట్లో ఉల్లి ఉండాల్సిందే.. ఇంకా ఉల్లిపాయను సలాడ్‌లో కూడా ఉపయోగిస్తారు. వాస్తవానికి అందరి ఇళ్లల్లో ఎర్ర ఉల్లిపాయను ఉపయోగిస్తుంటారు.. ఎర్ర ఉల్లిపాయల వలే తెల్ల ఉల్లిపాయల్లో కూడా ఎన్నో పోషకాలు దాగున్నాయి. తెల్ల ఉల్లిపాయలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకోండి.. తెల్ల ఉల్లిపాయలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు.. జీర్ణవ్యవస్థ బలపడుతుంది : తెల్ల ఉల్లిపాయ అనేక సమస్యలను దూరం చేస్తుంది. ఈ ఉల్లిపాయను తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థను బలంగా ఉంచుతుంది. ఎందుకంటే ఇందులో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణ ఆరోగ్యాన్ని బలపరుస్తుంది. ఇది కాకుండా, ఉల్లిపాయలో ప్రీబయోటిక్ ఉంటుంది. ఇది పొట్టను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. జుట్టు సమస్యలు దూరం: తెల్ల ఉల్లిపాయ మీ జుట్టుకు చాలా మేలు చేస్తుంది. మీకు చుండ్రు సమస్య ఉంటే తెల్ల ఉల్లిపాయ రసాన్ని వినియోగించాలి. రసాన్ని తలపై అప్లై చేసి కొంత సేపటి తర్వాత తలను శుభ్రం చేసుకోవాలి. ఇంకా తెల్ల జుట్టు సమస్యతో ఇబ్బంది పడుతున్న వారు ప్రతిరోజూ తెల్ల ఉల్లిపాయలను తింటే మంచిదని నిపుణులు చెబుతున్నారు. కొలెస్ట్రాల్ తగ్గుతుంది: తెల్ల ఉల్లిపాయలో చాలా పోషకాలు ఉన్నాయి. ఇవి మీ శరీరం నుంచి చెడు కొలెస్ట్రాల్‌ను తొలగించడంలో సహాయపడతాయి. మీకు కూడా చెడు కొలెస్ట్రాల్ సమస్య కూడా ఉంటే, మీరు ప్రతిరోజూ తెల్ల ఉల్లిపాయలను తినడం ప్రారంభించాలి. ఇది మీ కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది. గుండెకు మేలు చేస్తుంది: తెల్ల ఉల్లిపాయను తీసుకోవడం వల్ల గుండె సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీలు ఉన్నాయి.. ఇది మీ రక్తపోటును పెరగకుండా చేస్తుంది.. ఇంకా రక్తం గడ్డకట్టడాన్ని నిరోధిస్తుంది. అందువల్ల, మీకు గుండె సంబంధిత సమస్యలు ఉంటే, మీరు తెల్ల ఉల్లిపాయలను తీసుకోవడం మంచిదని పేర్కొంటున్నారు.

## కేవలం రూ.20తో యూరిక్ యాసిడ్ సమస్య నుంచి బయటపడొచ్చు.. ఎలాగో తెలుసా?



శరీరంలో యూరిక్ యాసిడ్ పెరిగినప్పుడు రోగనిరోధక వ్యవస్థ సరిగా పనిచేయదు. దీంతో రకరకాల సమస్యలు మొదలవుతాయి. యూరిక్ యాసిడ్ స్ఫటికాలుగా మారి వేళ్ల కీళ్లలో ఇరుక్కుపోయి తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి. అంతేకాకుండా దీని వల్ల అనేక ఇతర సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో శరీరం నుంచి యూరిక్ యాసిడ్‌ను తొలగించడానికి కొన్ని ఆహార అలవాట్లు మార్చుకుంటే ఈ సమస్య నుంచి తేలికగా బయటపడొచ్చు. యూరిక్ యాసిడ్‌ను తగ్గించగల 5 ప్రభావవంతమైన హోమ్ రెమెడీస్ ఇవే.. ఉసిరికాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలో ఇన్‌ఫ్లమేటరీని నివారించడమే కాకుండా, ఆక్సీకరణ ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది. ఇది యూరిక్ యాసిడ్ స్థాయిని కూడా తగ్గిస్తుంది. కాబట్టి ప్రతి రోజూ కనీసం ఒక ఉసిరికాయను తినడం అలవాటు చేసుకోవాలి. ఎండిన కొత్తిమీర ఆకులు శరీరం నుంచి యూరిక్ యాసిడ్ స్ఫటికాలను తొలగించడంలో సహాయపడతాయి. కొత్తిమీర ఆకుల్లో యూరిక్ యాసిడ్ ను మూత్రంతో తొలగించే గుణాలు ఉంటాయి. యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరిగిన వ్యక్తులు కొత్తిమీర టీ లేదా కొత్తిమీర నీటిని తీసుకుంటే మంచిది. యూరిక్ యాసిడ్ స్ఫటికాలను తొలగించడంలో వేప ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తుంది. వేపలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. ఇది వాపును తగ్గిస్తుంది. అలాగే యూరిక్ యాసిడ్ సమస్యను నయం చేస్తుంది. వేప శరీరం మొత్తం నిర్విషీకరణలో కూడా బాగా పనిచేస్తుంది. రోజువారీ ఆహారంలో చేపలు తినడం వల్ల యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గించుకోవచ్చు. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు వాపును తగ్గించడంలో సహాయపడతాయి. ఇవి మూత్రపిండాలు సరిగ్గా పనిచేయడానికి కూడా సహాయపడుతుంది. దీని కారణంగా టాక్సిన్స్ తొలగిపోతాయి. ఫలితంగా యూరిక్ యాసిడ్ శరీరం నుంచి సులభంగా బయటికి పోతుంది. ఆయుర్వేదంలో కరక్కాయ (మైరోబాలన్)కు ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో నిర్విషీకరణ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలోని టాక్సిన్స్, యూరిక్ యాసిడ్‌లను సులువుగా బయటకు పంపుతుంది. మైరోబాలన్ తీసుకోవడం జీర్ణక్రియకు కూడా మంచిది. దీని సహాయంతో యూరిక్ యాసిడ్ సమస్య నుంచి తేలికగా బయటపడొచ్చు. అలాగే గట్ సమస్యలు కూడా నయమవుతాయి.

## అలర్ట్.. డయాబెటిస్‌ను కంట్రోల్ చేసే ఏడు సూత్రాలు.. ఇలా చేస్తే 400 ఉన్న షుగర్ 100కు రావడం ఖాయం..



ఆరోగ్యంగా ఉండాలంటే శరీరంలో హార్మోన్ల సమతుల్యతను కాపాడుకోవడం చాలా ముఖ్యం. హార్మోన్ల కారణంగా దీర్ఘకాలిక వ్యాధులు మీ శరీరంలో వేళ్లూనుకునే అవకాశం ఉంది. ఉదాహరణకు, థైరాయిడ్ హార్మోన్లలో హెచ్చుతగ్గులు హైపో లేదా హైపర్ థైరాయిడిజానికి దారితీస్తాయి. అదేవిధంగా, ఇన్సులిన్ అనే హార్మోన్ ఉత్పత్తి కాకపోయినా లేదా సరిగ్గా పని చేయకపోయినా, రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణంగా ఉండవు. చాలా సందర్భాలలో, చక్కెర స్థాయి పెరుగుతుంది. దీనివల్ల మధుమేహం, ప్రీ-డయాబెటిస్, టైప్-2 మధుమేహం వంటి సమస్యలు వస్తాయి. మధుమేహంతో పాటు, ఇన్సులిన్ నిరోధకత కొలెస్ట్రాల్ స్థాయిలు, థైరాయిడ్ పనితీరు, రక్తపోటును కూడా ప్రభావితం చేస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆహారం ద్వారా ఇన్సులిన్ హార్మోన్ స్థాయిలను నిర్వహించవచ్చు.. అలాంటి ఆహార పదార్థాలు ఏంటో తెలుసుకోండి.. ఏడు సూత్రాలతో డయాబెటిస్‌కు చెక్.. మెంతులు దనియాల నీరు: మెంతులు, దనియాల నీటిని రోజూ తీసుకోవడం వల్ల ఇన్సులిన్ హార్మోన్ స్థాయిలు అదుపులో ఉంటాయి. 1/2 టీస్పూన్ మెంతి గింజలు, 1 టీస్పూన్ దనియాలను ఒక గ్లాసు నీటిలో వేసి మరిగించి తాగండి.. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను కూడా అదుపులో ఉంచుతుంది. గుండెల్లో మంటగా ఉన్నా.. అజీర్ణంతో బాధపడుతున్నా ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగడం వల్ల చాలా మేలు జరుగుతుంది. ఉసిరి అలోవెరా జ్యూస్: ఉసిరి, కలబంద రెండూ ఇన్సులిన్ నిరోధక సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఈ పానీయంలో విటమిన్ సి ఉంటుంది. ఇది ఇన్సులిన్ ఉత్పత్తి, పనితీరును నిర్వహించడానికి సహాయపడుతుంది. ఈ పానీయం రక్తంలోని అదనపు గ్లూకోజ్‌ను గ్రహిస్తుంది. సరైన పద్ధతిలో ఆహారాన్ని తినండి: ఆహారంలో సరైన మొత్తంలో ఫైబర్, ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు ఉండాలి. రోజు ప్రారంభంలో ఫైబర్ తీసుకోండి. ఆ తర్వాత ప్రోటీన్.. చివరకు పిండి పదార్థాలు లాంటివి తీసుకోవాలి.. అయితే. మితంగా తినడం మాత్రం మర్చిపోవద్దు.. ప్రోటీన్లు పుష్కలంగా ఉండే ఆహారం: శరీరంలో ప్రోటీన్ల లోపాన్ని తీర్చడానికి గుడ్లు, చికెన్, బాదం, కాజు, పప్పులు వంటివి తినండి.. ఇటువంటి ఆహారాలు ఇన్సులిన్ హార్మోన్ ప్రభావాన్ని పెంచుతాయి. రోజులో ఏదైనా భోజనంలో ప్రోటీన్ తప్పనిసరిగా ఉండాలి. అప్పుడే బ్లడ్ షుగర్ లెవెల్ మెయింటెయిన్ అవుతుంది. దాల్చిన చెక్క నీరు:దాల్చిన చెక్కఇన్సులిన్ నిరోధకత..రక్తంలోచక్కెర స్థాయిలను నియంత్రించడంలో గ్రేట్ గా పనిచేస్తుంది.ఈ మసాలాలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీరంలో మంటను తగ్గిస్తాయి. దాల్చిన చెక్క పొడిని వేడి నీటిలో మరిగించి తాగాలి..రోజులో ఏదో ఒకపూట ఈ డ్రింక్ తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. పుష్కలంగా నీరు త్రాగండి: ఇన్సులిన్ హార్మోన్ స్థాయిలను నిర్వహించడానికి..వ్యాధి ప్రమాదాన్ని తగ్గించడానికి పుష్కలంగా నీరు త్రాగాలి. రోజంతా 3-4 లీటర్ల నీరు త్రాగాలి..దీనివల్ల హైడ్రేట్‌గా కూడా ఉంటాం..రాత్రి భోజనం తర్వాత నడవండి: రాత్రి భోజనం చేసిన తర్వాత పడుకోకండి. రాత్రి భోజనం తర్వాత కనీసం 15 నుంచి 30 నిమిషాల పాటు నడవండి. ఇది ఆహారాన్ని జీర్ణం చేస్తుంది.. వ్యాధి ప్రమాదాన్ని నివారిస్తుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి.



# స్పోర్ట్స్

# అభిషేక్ శర్మ జరిమానా కట్టాల్సిందే!

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా నిన్న ఏప్రిల్ 2న ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్ మధ్య ఆసక్తికర పోరు జరిగింది. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ 65 రన్స్ భారీగా తేడాతో ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ తొలి బోణీ కొట్టింది. అయితే తొలి గెలుపు ఆనందంలో ఉన్న ఎస్ఆర్‌హెచ్ ఓపెనర్ అభిషేక్ శర్మకు మాత్రం ఎదురుదెబ్బ తగిలింది. అభిషేక్ శర్మ మ్యాచ్ ఫీజులో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గట్టి షాక్ ఇచ్చింది. ఐపీఎల్ నిబంధనలను ఉల్లఘించిన కారణంగా మ్యాచ్ ఫీజులో కోత విధిస్తున్న ఐపీఎల్ నిర్వాహకులు తెలిపారు. ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు ఐపీఎల్ నిర్వాహకులు తేల్చారు. అందుకు అనుగుణంగా అభిషేక్ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించేందుకు బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు అభిషేక్ శర్మకి కూడా తన ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్ బీసీసీఐ చేర్చింది. ఐపీఎల్ రూల్స్‌లోని ఆర్టికల్ 2.3 కింద లెవెల్ 1 నేరానికి పాల్పడినట్లు అభిషేక్ శర్మ అంగీకరించినట్లు తేలింది. మ్యాచ్ రిఫరీ విధించిన జరిమానాకు అభిషేక్ శర్మ స్వీకరించడంతో ఇందులో తదుపరి విచారణ లేకుండా పోయింది. అయితే అభిషేక్ శర్మ ఏ కారణంగా జరిమానా విధించారో అనే విషయాన్ని ఐపీఎల్ తన అధికారిక ప్రకటనలో స్పష్టంగా చెప్పలేదు. అయితే ఆర్టికల్ 2.3 అనేది సాధారణంగా మ్యాచ్ జరుగుతున్న సమయంలో అనుచిత భాషను మాట్లాడినా.. లేదా అసభ్య పదజాలంతో దూషించే



వంటి అంశాలు ఈ రూల్ కిందకి వస్తాయి. అయితే అభిషేక్ శర్మ వికెట్ పడిన క్రమంలో అది నాటౌట్‌ను అంపైర్ ఔట్‌గా ప్రకటించడంపై తీవ్ర నిరాశకు లోనయ్యాడు. దీంతో ఆ ఉద్వేగభరిత క్షణంలో అభిషేక్ శర్మ నోరు జారినట్లు చెబుతున్నారు. అయితే ఆ సంఘటన ఈ జరిమానాకు కారణం అయ్యిండొచ్చని చెబుతున్నారు. ఓ వైపు జరిమానా విధించినా.. మరోవైపు అభిషేక్ శర్మ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అద్భుతంగా రాణించాడు. కేవలం 21 బంతుల్లో 48 పరుగులు (4 సిక్సర్లు, 4 ఫోర్లు) రాబట్టి.. సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే ఇదే తరుణంలో అభిషేక్ ఓ అరుదైన మైలురాయిని చేరాడు. సన్‌రైజర్స్ టీమ్ తరఫున 100 సిక్సర్లు బాదిన రికార్డు గతంలో డేవిడ్ వార్నర్ ఖాతాలో ఉండగా.. ఇప్పుడు దాన్ని అభిషేక్ శర్మ (మొత్తం 101 సిక్సర్లు) చేరుకున్నాడు. ఎంతో ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్దేశించిన 227 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించలేక కేకేఆర్ 16 ఓవర్లలోనే 161 పరుగులకే ఆలౌట్ అయ్యింది.

## నా సక్సెస్ చూసి కుళ్లుకుంటున్నారు: రహానే

ఐపీఎల్ 2026లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ పరాజయంతో పాటు కెప్టెన్ అజింక్య రహానే స్లో బ్యాటింగ్ (10 బంతుల్లో 8 పరుగులు)పై విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై స్పందించిన అజింక్య రహానే తన విమర్శకులను ఏకిపారేశాడు. తనపై కావాలనే ఓ ఎజెండాతో కొందరు నెగిటివ్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను సాధించిన విజయాలు, క్రికెట్లో సాధించిన గుర్తింపును చూసి కొందరు అసూయ పడుతున్నారని.. అందుకే చిన్న చిన్న వైఫల్యాలను కూడా పెద్దవి చేసి చూపిస్తున్నారని రహానే మండిపడ్డాడు. తాను క్రీజులో ఉండటం ఇష్టం లేని వారే ఇటువంటి విమర్శలకు దిగుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశాడు. అజింక్య రహానే తన స్లో బ్యాటింగ్ గురించి విమర్శలను తోసిపుచ్చాడు. 2023 సీజన్ నుంచి టీ20ల్లో తన స్ట్రైక్ రేట్ మునుపటి కంటే చాలా మెరుగుపడిందని, అత్యుత్తమంగా ఉందని రహానే గుర్తు చేశాడు. విమర్శలు చేసేవారు బహుశా తన గణాంకాలను సరిగ్గా చూడటం లేదని లేదా కావాలనే కళ్లు మూసుకుటున్నారని ఎద్దేవా చేశాడు. పవర్ ప్లేలో భారతీయ బ్యాటర్లలో అభిషేక్ శర్మ తర్వాత అత్యధిక స్ట్రైక్ రేట్ తనకే ఉందని.. ఇది తన ఆటలో వచ్చిన సానుకూల మార్పుకు నిదర్శనమని రహానే స్పష్టం చేశాడు. ఒక బ్యాటర్‌గా ప్రతి మ్యాచ్‌లోనూ ఒకే విధమైన వేగంతో ఆడటం సాధ్యం కాదని అజింక్య రహానే అభిప్రాయపడ్డాడు. కొన్ని సార్లు పిచ్ పరిస్థితులు లేదా బౌలర్ల వ్యూహాల నేపథ్యంలో బ్యాటింగ్‌లో ఫ్లో దొరకదని.. ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్‌లో అదే జరిగిందని వివరించాడు. తన గురించి మాట్లాడే వారికి కనీస గేమ్ సెన్స్ ఉందో లేదో అని రహానే ప్రశ్నించాడు. రహానే తన సంప్రదాయక ఆటను వదిలి ఇంతలా మెరుగుపడతాడని విమర్శకులు ఊహించలేదని.. అందుకే ఇప్పుడు ఏ చిన్న అవకాశం దొరికినా విమర్శించడానికి సిద్ధమవుతున్నారని అజింక్య రహానే చురకలు అంటించాడు.తనపై వస్తున్న నెగిటివ్ కామెంట్లను తాను పట్టించుకోనని అజింక్య రహానే తేల్చి చెప్పాడు. "ప్రజలు నా గురించి పాజిటివ్‌గా మాట్లాడుకున్నా, నెగిటివ్‌గా మాట్లాడుకున్నా నాకు సంతోషమే.. కనీసం నా గురించి చర్చిస్తున్నారు కదా" అని రహానే పేర్కొన్నాడు. స్టేడియం బయట జరిగే ప్రచారాల కంటే, తన స్వయంకృషిపైనే తనకు నమ్మకం ఎక్కువని రహానే స్పష్టం చేశాడు. గత పదేళ్లుగా క్రికెట్ ఆడుతున్న తనకు ఏం చేయాలో, ఎలా ఆడాలో బాగా తెలుసని, విమర్శకుల సూచనలు తనకు అవసరం లేదని రహానే తెగేసి చెప్పాడు. ముంబై ఇండియన్స్‌పై 40 బంతుల్లో 67 పరుగులు చేసి అదరగొట్టిన అజింక్య రహానే.. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విఫలమవ్వడం కేకేఆర్ అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది.




## షాహిద్ అఫ్రిదిపై పాక్ ప్రజల ఆగ్రహం!

పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది తాజాగా సోషల్ మీడియాలో విడుదల చేసిన ఓ వీడియో సందేశం పట్ల పాక్ ప్రజలు తీవ్ర ఆగ్రవేశాలకు లోనవుతున్నారు. షాహిద్ అఫ్రిది ఇంధన ధరల పెంపుపై చేసిన కామెంట్లు ఆ దేశంలో పెనుదుమారాన్ని రేపుతున్నాయి. పాకిస్థాన్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరిన వేళ.. ఆయన ప్రభుత్వానికి మద్దతు తెలపాలని కోరడం ఈ వివాదానికి కారణమైంది. అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల ఇంధన సంక్షోభం ఏర్పడిందని.. ఇతర దేశాలతో పోలిస్తే పాకిస్థాన్ పరిస్థితి మెరుగ్గా ఉందని షాహిద్ అఫ్రిది పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం తీసుకునే కఠిన నిర్ణయాలను ప్రజలు సహనంతో స్వీకరించాలని, దేశాభివృద్ధి కోసం అందరూ సహకరించాలని అఫ్రిది పిలుపునిచ్చారు. ప్రస్తుతం పాకిస్థాన్ ప్రభుత్వం పెట్రోల్ ధరలను భారీగా పెంచింది. లీటరు పెట్రోల్‌పై 137 రూపాయలు, డీజిల్‌పై 184 రూపాయలు అదనపు భారం మోపడంతో కొత్త ధరలు వరుసగా.. రూ.458.40, రూ.520 లకు చేరుకున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంధన ధరలు పెరగడంతో నిత్యావసర ధరలు కూడా భారీగా పెరిగాయి. ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్న సామాన్య పౌరుడికి లీటరు పెట్రోల్ కోసం 450 రూపాయలకు పైగా వెచ్చించడం పెను భారంగా మారింది. ఈ నేపథ్యంలో అఫ్రిది చేసిన "సహకరించండి" అనే కామెంట్స్ ప్రజల గాయాలపై కారం చల్లినట్లు అయ్యాయి. షాహిద్ అఫ్రిది వైరల్ కావడంతో పాకిస్థాన్ నెటిజన్లు ఆయనపై విరుచుకుపడుతున్నారు. ముఖ్యంగా (సిగ్గులేని అఫ్రిది) అనే ట్యాగ్‌తో విమర్శలు గుప్పిస్తున్నారు. "లగ్జరీ కార్లలో తిరిగే కోటీశ్వరుడైన షాహిద్ అఫ్రిదికి, సైకిల్ మీద వెళ్లే సామాన్యుడి కష్టాలు ఎలా తెలుస్తాయి?" అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడటం వల్ల ఆయనకు వ్యక్తిగత ప్రయోజనాలు ఉండొచ్చని.. అందుకే ప్రజల పక్షాన నిలవకుండా ప్రభుత్వ ఏజెంట్‌లా ప్రవర్తిస్తున్నారని నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు. పెట్రోల్ ధరల పెంపును వ్యతిరేకించాల్సిన బాధ్యత ఉన్న సెలబ్రిటీలే ఇలా భరించమని చెప్పడం బాధ్యతారాహిత్యమని ప్రజలు మండిపడుతున్నారు. ఈ ధరల పెంపుపై పాక్ ప్రభుత్వం కూడా వివరణ ఇచ్చింది. ఇజ్రాయెల్, అమెరికా-ఇరాన్ దేశాల మధ్య నెలకొన్నఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ మార్కెట్లో చమురు సరఫరా దెబ్బతిందని.. దీని వల్ల దిగుమతి ఖర్చులు పెరిగాయని పాక్ మంత్రి అలీ పర్వేజ్ మాలిక్ స్పష్టం చేశారు. అయితే ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో ఉన్న పాకిస్థాన్‌కు ఈ ఇంధన ధరల పెంపు కోలుకోలేని దెబ్బ అని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సంక్షోభం నుంచి దేశాన్ని గట్టెక్కించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సామాన్యుడి ప్రాణాల మీదకు వస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి దేశభక్తి పేరుతో షాహిద్ అఫ్రిది చేసిన ఈ ప్రయత్నం వికటించింది. క్రికెటర్‌గా ఎంతటి పేరు ప్రఖ్యాతులు సంపాదించినా, సామాన్యుల కష్టాల విషయంలో ఆయన చూపిన ఉదాసీనత పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అఫ్రిది కేవలం తన స్వచ్ఛంద సంస్థ కోసం లేదా రాజకీయ ప్రయోజనాల కోసమే ఇలాంటి కామెంట్లు చేస్తున్నారని చాలా మంది భావిస్తున్నారు. ప్రస్తుతానికి ఈ వివాదం పాకిస్థాన్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా కొనసాగుతోంది.

## నా బౌలింగ్‌లో మార్పుల వెనుక ఓ 'మిస్టరీ మ్యాన్'

### నితీష్ కుమార్ రెడ్డి ఇంట్రెస్టింగ్ కామెంట్స్

కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన పోరులో నితీష్ కుమార్ రెడ్డి అద్భుతమైన ప్రతిభను కనబరిచాడు. తొలుత బ్యాటింగ్‌లో 39 పరుగులు చేసిన నితీష్, ఆ తర్వాత బౌలింగ్‌లోనూ రెండు కీలక వికెట్లు తీసి సన్‌రైజర్స్ గెలుపులో కీలక పాత్ర పోషించాడు. గత సీజన్‌లో గాయాల కారణంగా ఇబ్బంది పడిన ఈ యువ ఆటగాడు, ఈ ఏడాది తన బౌలింగ్ శైలిని పూర్తిగా మార్చుకుని ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. తన బౌలింగ్ మెరుగుపడటం వెనుక ఒక ప్రత్యేక వ్యక్తి ఉన్నారని నితీష్ వెల్లడించడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. విజయం అనంతరం నితీష్ మాట్లాడుతూ.. తన బౌలింగ్ మెరుగుదలపై పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. "నేను నా బౌలింగ్ విషయంలో నిరంతరం శ్రమిస్తుంటాను. గత ఏడాది గాయాల వల్ల సాధన చేయడానికి తగిన సమయం దొరకలేదు. కానీ ఈ సీజన్ ప్రారంభానికి ముందు ఒక వారం పాటు ఒక ప్రత్యేక వ్యక్తి పర్యవేక్షణలో శిక్షణ తీసుకున్నాను. ఆయన ఇచ్చిన సూచనలు ఇప్పుడు మైదానంలో అమలు చేస్తున్నాను. అయితే ఆ వ్యక్తి ఎవరనేది ఇప్పుడే బయట పెట్టను, త్వరలోనే వెల్లడిస్తాను" అని నితీష్ సస్పెన్స్ మెయింటైన్ చేశాడు. ఈడెన్ గార్డెన్స్ పిచ్ బ్యాటింగ్, బౌలింగ్ రెండింటికీ అనుకూలంగా ఉంటుందని నితీష్ పేర్కొన్నాడు. బ్యాటింగ్ చేస్తున్న సమయంలోనే పిచ్ నెమ్మదిగా ఉందని గమనించినట్లు చెప్పాడు. "కోల్‌కతా బౌలర్లు స్లో బౌన్సర్లు వేయడం చూశాక, మేము బౌలింగ్ చేసేటప్పుడు కూడా అదే వ్యూహాన్ని అనుసరించాలని నిర్ణయించుకున్నాను. రింకూ సింగ్ వంటి ప్రమాదకరమైన బ్యాటర్ వికెట్‌ను స్లో బంతి ద్వారానే పడగొట్టాను. పిచ్ పరిస్థితులను గౌరవించి బౌలింగ్ చేయడం వల్లే ఫలితం దక్కింది" అని వివరించాడు. హెన్రిచ్



క్లాసెన్‌తో కలిసి ఆడటం గొప్ప అనుభూతిని ఇచ్చిందని నితీష్ తెలిపాడు. సీనియర్ ఆటగాళ్లు ఇచ్చే సూచనలు యువ ఆటగాళ్లకు ఎంతో ఉపయోగపడతాయని అన్నాడు. అలాగే తమ బౌలింగ్ విభాగంపై వస్తున్న విమర్శలను ఆయన కొట్టిపారేశాడు. జయదేవ్ ఉనద్కత్ వంటి సీనియర్లతో పాటు హర్షల్ పటేల్, డేవిడ్ పైన్ వంటి నాణ్యమైన బౌలర్లు తమ జట్టులో ఉన్నారని, హైదరాబాద్‌లోని ఫ్లాట్ వికెట్లపై బౌలింగ్ చేయడం ఒక సవాల్ అని నితీష్ స్పష్టం చేశాడు.



## ఆర్‌సీబీతో మ్యాచ్‌కు ధోని రీఎంట్రీ..?

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరగబోయే మ్యాచ్ కోసం చిన్నస్వామి స్టేడియం సిద్ధమవుతోంది. ఈ మ్యాచ్‌ను చూడటానికి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ధోనీ కండరాల నొప్పితో బాధపడుతున్నాడు. అందుకే, అతనికి రెండు వారాల పాటు విశ్రాంతి తీసుకోమని సలహా ఇచ్చారు. అయితే, ఇప్పుడు రాయల్ ఛాలెంజర్స్ బెంగళురుతో జరిగే మ్యాచ్‌కు అతను అందుబాటులో ఉంటాడా లేదా అనే దానిపై ఆసక్తి నెలకొంది. రాజస్థాన్ రాయల్స్ చేతిలో చెన్నై ఘోర పరాజయం చవిచూసింది. నేడు (ఏప్రిల్ 3) చెన్నై, పంజాబ్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో తిరిగి ఫామ్‌లోకి రావాలని సీఎస్‌కే చూస్తోంది. ధోనీ కొంత మార్గదర్శకత్వం అందించి ఉంటాడని ప్రేక్షకులు భావిస్తున్నారు. అయితే, అతను నేటి మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడా లేదా అనేది సందేహాస్పదంగా ఉంది. ధోనీ ఇటీవల అక్కడ ఒక ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు. ఇది అభిమానులకు శుభవార్త. చెన్నై సూపర్ కింగ్స్ ప్రదర్శన పేలవంగా ఉంటే జట్టును కాపాడటానికి ధోనీ బరిలోకి దిగవచ్చని ఈ రోజుకీ అంటున్నారు. అలాంటప్పుడు, బెంగాల్‌లో జరగనున్న మ్యాచ్‌కు ధోనీ హాజరవుతాడు. ఆర్‌సీబీ, సీఎస్‌కేల మ్యాచ్ అయినా, అభిమానులు దానిని బద్ధ శత్రువుల మధ్య పోరుగా భావిస్తారు. గత సీజన్‌లో, ఆర్‌సీబీతో జరిగిన రెండు మ్యాచ్‌లలోనూ చెన్నై ఓడిపోయింది. ఈసారి కూడా అదే ఫామ్‌ను కొనసాగించాలని చెన్నై యోచిస్తోంది.

## కేకేఆర్‌పై గెలుపుతో నేను సంతోషంగా లేను..

### సన్‌రైజర్స్ కెప్టెన్ ఇషాన్ కిషన్ కీలక కామెంట్స్

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు గెలుపు బోణీ కొట్టింది. గురువారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 65 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించడం పట్ల ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ ఇషాన్ కిషన్ ఆనందాన్ని వ్యక్తం చేశాడు.ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 226 పరుగులు చేసింది. సన్‌రైజర్స్ ప్లేయర్లలో హెన్రిచ్ క్లాసెన్ (35 బంతుల్లో 52 రన్స్) హాఫ్ సెంచరీ సాధించాడు. అభిషేక్ శర్మ (21 బంతుల్లో 48 రన్స్), ట్రావిస్ హెడ్ (21 బంతుల్లో 46 రన్స్). నితీశ్ కుమార్ రెడ్డి (24 బంతుల్లో 39 రన్స్) వేగంగా ఆడారు. కేకేఆర్ బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబాని 4, వైభవ్ అరోరా 2, కార్తిక్ త్యాగి, అనుకుల్ రాయ్‌లు చెరో వికెట్ పడగొట్టాడు. 227 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో కోల్‌కతా నైట్‌రైడర్స్ 16 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌటైంది. కేకేఆర్ బ్యాటర్లలో అంక్రిష్ రఘువంశీ (29 బంతుల్లో 52) హాఫ్ సెంచరీ చేయగా.. రింకూ సింగ్ (25 బంతుల్లో 35 పరుగులు) రాణించాడు. సన్‌రైజర్స్ బౌలర్లలో జయదేవ్ ఉనాద్కత్ 3, మలింగ, నితీశ్‌కుమార్ రెడ్డిలు చెరో 2, హర్ష్ దూబె ఓ వికెట్ తీశారు. అయితే మ్యాచ్ అనంతరం ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ ఇషాన్ కిషన్ మాట్లాడుతూ.. ఐపీఎల్ 2026 సీజన్‌లో గెలుపు బోణీ కొట్టడం సంతోషాన్ని ఇచ్చిందన్నాడు. ఈ గెలుపు క్రెడిట్ ఓపెనర్లదేనని చెప్పుకొచ్చాడు. జట్టు ప్రదర్శనపై ఆనందాన్ని వ్యక్తం చేశాడు. కానీ వ్యక్తిగతంగా తన ఆటతీరు పట్ల సంతోషంగా లేనన్నాడు. గ్రౌండ్‌లో టీమ్ చూపిన నిబద్ధత పట్ల సంతోషంగా ఉన్నానని.. ప్రతి ఒక్కరు తమ శక్తి వంచన లేకుండా గెలుపు కోసం కృషి చేశారన్నాడు. టీమ్ నుంచి తాను కోరుకున్నది కూడా అదేనని.. ఇక ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మలు అద్భుతంగా ఆడారని మెచ్చుకున్నాడు. వారి దూకుడు కారణంగా పవర్ ప్లేలో 80 పరుగులు వచ్చాయన్నాడు. దీంతో మిగిలిన బ్యాటర్లు సింగిల్స్ తీసుకోవడానికి, పిచ్ ఎలా ఉందో అర్థం చేసుకోవడానికి అదనపు సమయం దొరికిందన్నాడు. వీరిద్దరితో పాటు ఆఖరిలో హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ రెడ్డిలు గొప్పగా ఆడారన్నాడు. మొత్తంగా ఇది జట్టు విజయం అని చెప్పుకొచ్చాడు. ఇక కేకేఆర్ ఆటగాడు ఫిన్ అలెన్ ఎంతటి ప్రమాదకర ఆటగాడో అందరికి తెలుసునన్నాడు. అతడు ఒక్కసారి చెలరేగితే ఆపడం చాలా కష్టమన్నాడు. అయితే.. హర్ష్ దూబె అద్భుతమైన బంతితో అతడిని బోల్తా కొట్టించాలని తెలిపాడు. ఇక తమ బౌలర్లు అందరూ ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేశారన్నాడు. ప్రతి మ్యాచ్ నుంచి తాము ఎన్నో అంశాలను నేర్చుకుంటామన్నాడు. ముఖ్యంగా ఫీల్డింగ్‌లో తాము ఇంకాస్త మెరుగుపడాల్సి ఉందన్నాడు. ఎక్స్‌ట్రాల రూపంలో 20కి పైగా పరుగులు ఇవ్వడం సరికాదన్నాడు. ఓ టీ20 మ్యాచ్‌లో 20 లేదా 10 పరుగులు కూడా పెద్ద ముప్పుగా మారుతుందన్నాడు. కాబట్టి ఫీల్డింగ్‌ను మెరుగుపరచుకునేందుకు ప్రయత్నిస్తామన్నాడు ఇషాన్ కిషన్.

## విశ్వజి



# దుర్వాసన దూరం..

గుట్కాలు తినేవారిలో, మద్య పానం-ధూమపానం చేసేవారిలో నోటి దుర్వాసన ఎక్కువగా కనిపిస్తుంది. దంతధావనం సరిగ్గా చేయపోయినా.. ఈ సమస్య వేధిస్తుంది. కానీ, కొందరిలో ఏ దురలవాట్లూ లేకపోయినా.. రోజుకు రెండుసార్లు బ్రష్ చేసినా.. నోటి నుంచి చెడువాసన వస్తుంటుంది. ఇది నలుగురిలో తీవ్రమైన ఇబ్బందికి గురిచేస్తుంది. కాబట్టి, నోటి దుర్వాసనను దూరం చేసే కొన్ని ఇంటి చిట్కాలను నిపుణులు వివరిస్తున్నారు. నోటిలో పేరుకుపోయే బ్యాక్టీరియా, ఇతర ఆరోగ్య సమస్యలు.. నోటి దుర్వాసనకు ప్రధాన కారణాలు. కాబట్టి, రోజుకు రెండుసార్లు బ్రష్ చేయడంతోపాటు ఫ్లాస్ చేయడం, నాలుకపై బ్యాక్టీరియాను తొలగించుకోవడం ముఖ్యం. నోటి దుర్వాసనను కలిగించే బ్యాక్టీరియాను ఉప్పు నీటితో పుక్కిలించడం ద్వారా నిర్మూలించవచ్చు. బేకింగ్ సోడాలో యాంటి బ్యాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. దీనిని మౌత్ వాష్‌గా వాడితే మంచి ఫలితాలు ఉంటాయి. నోరు పొడిబారినా.. దుర్వాసన వేస్తుంది. కాబట్టి, ఈ సమస్య నుంచి బయట పడటానికి నీళ్లు ఎక్కువగా తాగండి. దాంతో, శరీరం హైడ్రేటెడ్‌గా ఉండి, నోటి ఆరోగ్యం బాగుంటుంది. శ్వాసను తాజాగా ఉంచడంలో తులసి, పుదీనా ఆకులు అద్భుతంగా పనిచేస్తాయి. రాత్రిపూట విధులు నిర్వహించే సమయంలో.. తులసి, పుదీనా ఆకులను నమలండి. ఆపిల్, క్యారెట్లు, పుచ్చకాయలు, పైనాపిల్ వంటి పండ్లు.. నోటి దుర్వాసనను తగ్గిస్తాయి. నోటిలో బ్యాక్టీరియాను తొలగించడం, లాలాజల ఉత్పత్తిని పెంచడంలో ముందుంటాయి. అయినా.. సమస్య అలాగే ఉంటే దంతవైద్యులను సంప్రదించండి.

# నిద్ర రావట్లేదా?

వృద్ధుల్లో నిద్రలేమి సాధారణ సమస్యగా మారింది. నిద్ర మాత్రలు తాత్కాలిక ఉపశమనాన్ని అందించినా.. తరచుగా వాడితే దుష్ప్రభావాల ప్రమాదం ఉంటుంది. ఇందుకు నిపుణులు సిఫారసు చేస్తున్న ఒక సులభమైన చిట్కా.. క్రమం తప్పని శారీరక శ్రమ. వయసు పెరిగేకొద్దీ.. నిద్రను నియంత్రించే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గుతుంది. అదనంగా ఆర్థరైటిస్, గుండె సమస్యలు, మందుల వాడకం వంటివి నిద్రకు భంగం కలిగిస్తాయి. దాంతో పెద్దవాళ్లు నిద్రపోవడంలో ఇబ్బంది పడుతుంటారు. రాత్రిపూట తరచుగా మేల్కొంటూ ఉంటారు. ఫలితంగా జ్ఞాపకశక్తి సమస్యలు, రోగ నిరోధక శక్తి తగ్గడం, మానసిక స్థితిలో మార్పులు లాంటి సమస్యలు ఎదురవుతాయి. వీటినుంచి బయటపడాలంటే.. వృద్ధుల్లో నిద్ర సమస్యలను నివారించాలి. అందుకు 'వ్యాయామం' చక్కని పరిష్కారం చూపుతుంది. వ్యాయామంతో నిద్ర... చిన్నచిన్న వ్యాయామాలతోనూ కార్టిసాల్ (ఒత్తిడి హార్మోన్) స్థాయులు తగ్గుతాయి. దాంతో ఒత్తిడి, ఆందోళన దూరమవుతుంది. మనసు విశ్రాంతి తీసుకోవడానికి సహాయపడుతుంది. వ్యాయామం.. జీవ గడియారాన్ని రీసెట్ చేస్తుంది. ముఖ్యంగా ఉదయంపూట ఆరుబయట నడక వల్ల.. శరీరానికి సహజమైన సూర్యకాంతి అందుతుంది. ఇది రాత్రిపూట మెలటోనిన్ ఉత్పత్తిని పెంచుతుంది. మితమైన వ్యాయామంతో శరీరం ఆరోగ్యకరమైన రీతిలో అలసిపోతుంది. ఫలితంగా.. రాత్రిపూట మంచి నిద్రపట్టేస్తుంది. సాయంత్రాల్లో ఓ మోస్తరు యోగాసనాలు వేయడం వల్ల.. శరీరానికి తగినంత విశ్రాంతి లభిస్తుంది. రాత్రి గాఢనిద్రలోకి జారుకునేలా చేస్తుంది. నిరంతరం వ్యాయామం చేసే వృద్ధులు నాణ్యమైన నిద్రపోతారని ఇటీవలి అధ్యయనాలు వెల్లడించాయి. అయితే, పడుకునే రెండు గంటల ముందు వ్యాయామాలకు దూరంగా ఉండటమే మంచిది. వ్యాయామం.. కేవలం శారీరక ఆరోగ్యం కోసమే కాదు. ఇది పెద్దల్లో మనశ్శాంతిని పునరుద్ధరిస్తుంది.

# లైఫ్ ట్రాప్స్‌లో లవ్



ఈరోజుల్లో ప్రేమంటే? కాఫీ డేట్స్, రీల్స్, స్టోరీస్‌లో లవ్ వైబ్స్, షాపింగ్.. అంతేనా? నిజానికి బంధాలు అంత తేలికైనవి కావు. మీరు మనస్ఫూర్తిగా ఎవరినైనా ప్రేమిస్తే, ఆ బంధం మీకు సంతోషాన్ని ఇవ్వాలి. కానీ, కొన్నిసార్లు ప్రేమ పేరుతో విసిరే ఉచ్చులో మనం చిక్కుకుపోతుంటాం. పదేపదే మనకు సరిపోని వాళ్ల మాయలోనే పడిపోతుంటాం. అందుకు కారణం కూడా మన ఆలోచనలే కావడం విచిత్రం. మనలో కొన్ని 'లైఫ్ ట్రాప్‌లు' పనిచేస్తుంటాయి అని మీకు తెలుసా? బాల్యంలో మొదలయ్యే కొన్ని భావనలు పెద్దయ్యాక సంబంధాలను ప్రభావితం చేస్తాయి. డాక్టర్ జెఫ్రీ యంగ్ అనే సైకాలజిస్ట్ 'స్కీమా థియరీ'తో ఈ 'లైఫ్ ట్రాప్‌ల' గురించి ఏనాడో చెప్పారు. ఇవి మన ఆలోచనల్ని, నిర్ణయాల్ని ప్రభావితం చేస్తాయి. సరైన భాగస్వామిని ఎంచుకోవడంలో తప్పులు చేసేలా ప్రోత్సహిస్తాయి. చివరికి ఇంకేముంది హార్ట్‌బ్రేక్!! అమ్మాయిలు ముఖ్యంగా మూడు లైఫ్‌ట్రాప్‌ల వల్ల ఇబ్బందులు పడుతుంటారు. ఎమోషనల్ డిప్రివేషన్ (భావోద్వేగాల లేమి), అబాండన్‌మెంట్ (విడిచి వెళ్లిపోతారేమో అనే భయం), సెల్ఫ్ శాక్రిఫైస్ (స్వీయ త్యాగం). ఈ మూడు ధోరణుల వల్ల భాగస్వామి ఎంపికలో, ప్రేమను నిలబెట్టుకోవడంలో తప్పులు చేస్తుంటారు.

కావాల్సిన ప్రేమ దొరకదేమో?!

నాకు కావాల్సిన ప్రేమ దొరకడం లేదు!!

వాళ్లు నన్ను ప్రేమించినా.. సరిగ్గా వ్యక్తపరచడం లేదు.. ఇలాంటి ఆలోచనలు మీలో ఉన్నాయా? చిన్నప్పుడు మీకు సరైన ఆప్యాయత దొరకలేదా? అమ్మానాన్నలు దూరంగా ఉన్నారా? వాళ్లు మీకు అన్నీ ఇచ్చినా, మీ మనసులో ఏం ఉందో అర్థం చేసుకోలేదా? అలాంటప్పుడు, మీరు భావోద్వేగాలు అంతగా వ్యక్తపరచని వ్యక్తులకే త్వరగా ఆకర్షితురాలు అవుతారు. చిన్నప్పటి నుంచి భావోద్వేగాల లేమితో సతమతమైన మీ మనసు.. మీ తరహా వ్యక్తిత్వం ఉన్నవారికే అట్రాక్ట్ అవుతుంది. కానీ, లేనిది వెతుక్కోవడమే కదా జీవితం! బాల్యం నుంచి దొరకని ఆప్యాయత భాగస్వామి నుంచి ఆశించడం తప్పు కాదు. కన్సర్న్ చూపించే వారిని కాదని, మీలా బోర్‌గా ఫీలయ్యే వాళ్ల వెంటపడితే.. చివరికి జీవితంలో భావోద్వేగాలు మృగ్యమైపోతాయి.

నన్ను వదిలేస్తారేమో?! ప్రేమించినవాడు వదిలేస్తాడేమో అన్న అనుమానం..

### వాళ్లు కాస్త దూరం జరిగినా ఆత్మరక్షణలో పడిపోవడం..

మీలో ఈ తరహా ఫీలింగ్స్ వస్తుంటే కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి. చాలామంది తల్లిదండ్రులు ఎప్పుడూ ఒకేలా ఉండరు. పిల్లలంటే ప్రేమ ఉన్నప్పటికీ%ౌ% పరిస్థితులను బట్టి వాళ్ల అభిమానం వ్యక్తమవుతూ ఉంటుంది. కొన్నిసార్లు అతి గారాబం చేయడం, కొన్నిసార్లు మరీ ఎక్కువ నిర్లక్ష్యం చేయడం లాంటి పరిస్థితులు ఎదుర్కొన్న ఆడపిల్లల ఆలోచన కాస్త చిత్రంగా ఉంటుంది. ప్రేమలో అడుగుపెట్టినప్పటి నుంచి అనుమానాలు వాళ్లను పీడిస్తూ ఉంటాయి. భాగస్వామి ఏ కొంచెం స్పందించకపోయినా.. అతిగా స్పందిస్తుంటారు. ఎప్పుడూ అతణ్నే అంటిపెట్టుకొని ఉండటానికి ప్రయత్నిస్తుంటారు. మరింత గాఢమైన ప్రేమను ఆశిస్తూ ఉంటారు. ఈ భయం మీ నిబద్ధతను చూపించకపోగా, నిజమైన ప్రేమను కూడా అంగీకరించలేని పరిస్థితిలోకి నెట్టేస్తుంది.

ప్రాణం అయినా ఇస్తాను

నా భాగస్వామి సంతోషంగా ఉంటే చాలు.. వాళ్ల కోసంఏదైనా చేస్తాను..

పైకి చూస్తే ఇలా ఆలోచించడం గొప్ప విషయమే! ప్రేమంటే త్యాగమే!! కానీ, లవ్‌జర్నీలో ఇదో ప్రమాదకరమైన ట్రాప్. చిన్నప్పటి నుంచి ఇంట్లోవాళ్ల కోసం త్యాగాలకు అలవాటుపడిన ప్రాణమైతే మరీ ప్రమాదం. ఎదుటివ్యక్తిని సంతోషపర్చడానికి ఎలాంటి త్యాగాలకైనా సిద్ధపడుతుండటం అలవాటుగా చేసుకుంటారు. ఇక ప్రేమించిన వ్యక్తి కోసం విపరీత త్యాగాలకు పాల్పడుతుంటారు. సరైనోడు అయితే త్యాగం చేసినా కొంత ఫర్వాలేదు. కానీ, మీ బలహీనతను అలుసుగా తీసుకునే బాపతు ప్రేమికుడు ఎదురుపడితే.. మీ త్యాగాలకు విలువ ఉండదు సరికదా, కొన్నిసార్లు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి కూడా రావొచ్చు. ఈ త్యాగశీలురు తమ భాగస్వామి నుంచి కూడా అదే తరహా త్యాగాలను ఆశిస్తే%ౌ% మీ ప్రేమ మొగ్గలోనే వాడిపోవడం ఖాయం. జెన్-జీ అమ్మాయిలు సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్రపంచంలో పెరుగుతున్నారు. వారికి బంధాలపై స్పష్టమైన అవగాహన ఉండటంలేదు. అపరిచితులతో తేలికగా కనెక్ట్ అవుతున్నారు. ఈ క్రమంలో బాల్యంలో ఎదురైన అనుభవాలు, మనసుకు తగిలిన గాయాలు.. ఈ సంబంధాలపై పడితే.. మరింత డేంజర్ జోన్‌లోకి వెళ్లే ప్రమాదం ఉంది. కాబట్టి, రిలేషన్‌లోకి ప్రవేశించడానికి ముందు.. మానసికంగా దృఢంగా ఉండాలి. ఎదుటివ్యక్తిని సరిగ్గా అంచనా వేయగలగాలి. అప్పుడే ఆరోగ్యకరమైన ప్రేమను పొందే అవకాశాలు ఉంటాయి.

# జుట్టుకు మునగాకు!



మునగ ఆకుల్లో పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఇవి అనేక శారీరక సమస్యలను దూరం చేస్తాయి. జుట్టు ఆరోగ్యాన్ని కాపాడటంలోనూ ముందుంటాయి. మునగాకులో ప్రొటీన్, ఫైబర్, విటమిన్ బి6, సి, ఐరన్, జింక్, క్యాల్షియం సమృద్ధిగా లభిస్తాయి. అవన్నీ జుట్టు సమస్యలకు చక్కటిపరిష్కారం చూపుతాయి. మునగాకుతో హెయిర్ ప్యాక్స్ తయారుచేసుకొని వాడితే.. అద్భుత ఫలితాలు కనిపిస్తాయి. తయారీ విధానం.. ఒక గిన్నెలో టేబుల్ స్పూన్ మునగాకు పొడి, టేబుల్ స్పూన్ ఉసిరి పొడిని తీసుకోవాలి. రెండిటినీ బాగా మిక్స్ చేసి.. కొద్దికొద్దిగా పెరుగు కలుపుతూ మెత్తని పేస్ట్ తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్లకు పట్టేలా జుట్టుకు ప్యాక్ వేసుకోవాలి. అరగంట సేపు అలాగే ఉంచి.. గోరు వెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. అనేక ప్రయోజనాలు.. మునగాకులో యాంటి బ్యాక్టీరియల్, యాంటి ఫంగల్ గుణాలు పుష్కలం. ఇవి జుట్టు కుదుళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. వెంట్రుకలు ఒత్తుగా పెరిగేందుకు సాయపడతాయి. ఇందులో ఉండే జింక్.. జుట్టు కుదుళ్లలోని సీబమ్‌ను క్రమబద్ధీకరిస్తుంది. దాంతో కుదుళ్లు తేమగా మారుతాయి. చుండ్రు, దురద వంటి సమస్యలను తరిమేస్తాయి. తెల్ల జుట్టు సమస్యకూ మునగాకు చక్కని పరిష్కారం. ఇందులో ఉండే యాంటి ఆక్సిడెంట్లు, విటమిన్ సి.. వెంట్రుకలు నెరవడానికి కారణమయ్యే ఫ్రీరాడికల్స్‌తో పోరాడతాయి. మునగాకులో ఉండే బెహెనిక్, ఓలియిక్ ఆమ్లాలు.. జుట్టు ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. కుదుళ్లలో ఇన్‌ఫ్లమేషన్, ఇతర సమస్యల్ని తగ్గిస్తాయి.

## మార్కెట్


### ముంబైలో టెస్లా తొలి షోరూం.. నెల అద్దె ఎంతో తెలుసా..?

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా భారత విపణిలోకి అడుగుపెట్టింది. ఇవాళ ఉదయం ముంబై నడిబొడ్డున బాంద్రా కుర్లా కాంప్లెక్స్ మేకర్ మ్యాక్సిటీ మాల్‌లో టెస్లా తన తొలి షోరూంను గ్రాండ్‌గా లాంఛ్ చేసింది. ఈ షోరూం కోసం బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని టెస్లా సంస్థ అద్దెకు తీసుకుంది. పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగానూ కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ నెలకు రూ.35 లక్షల అద్దె (%వీశీత్‌ష్త్రశ్రీఎ =వత్%) చెల్లించనున్నారని తెలిసింది. అద్దె ఏడాదికి 5 శాతం పెంపు ప్రాతిపదికన ఐదేళ్ల కాలానికి యూనివ్‌కో ప్రాపర్టీస్ నుంచి లీజుకి తీసుకుంది. ఈ ప్రాపర్టీ గ్రౌండ్ ఫ్లోర్ దేశీయంగా ఏర్పాటైన తొలి యాపిల్ స్టోర్‌కు దగ్గరగా ఉంటుంది. రెంటల్ అగ్రిమెంట్ ఫిబ్రవరి 27న రిజిస్టరైంది. రూ.2.11 కోట్లు సెక్యూరిటీ డిపాజిట్‌గా కూడా టెస్లా జమ చేసినట్లు సమాచారం. మరోవైపు తొలిషోరూం కోసం టెస్లా సంస్థ వై మోడల్ కార్లను చైనాలోని షాంఘై నగరంలో గల తమ ఫ్యాక్టరీ నుంచి తీసుకొచ్చింది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన వై మోడల్ కారు ధర పన్నులు, బీమా కలిపితే రూ. 48 లక్షలపైనే ఉండనుంది. డిమాండ్‌ను బట్టి ఆ తర్వాత ఢిల్లీలోనూ రెండో షోరూంను ఏర్పాటు చేయాలనే ప్రణాళికతో టెస్లా ఉందని సమాచారం.




## నాలుగు రోజుల నష్టాలకు బ్రేక్..

# 317 పాయింట్లు సెన్సెక్స్ జంప్..!



దేశీయ స్టాక్ మార్కెట్‌లో నాలుగు రోజుల తర్వాత మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. జూన్ నెలలో భారత దేశ ద్రవ్యోల్బణం 77 నెలల కనిష్ట స్థాయి 2.1శాతానికి తగ్గింది. ఈ క్రమంలో మార్కెట్‌లో అన్నిరంగాల్లో కొనుగోళ్లు కనిపించాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 82,233.16 ఫ్లాట్‌గా మొదలైంది. ఈ తర్వాత కోలుకొని లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఇంట్రాడేలో 82,221.74 పాయింట్ల కనిష్టానికి పెరిగిన సెన్సెక్స్.. గరిష్టంగా 82,743.62 పాయింట్లకు చేరింది. చివరకు సెన్సెక్స్ 317.45 పాయింట్లు పెరిగి 82,570.91 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 113.50 పాయింట్లు పెరిగి 25,195.80 వద్ద ముగిసింది. అన్ని రంగాల సూచీలు ఫార్మా, ఆటో, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియాల్టీ 0.5-1 శాతం పెరిగాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు దాదాపు ఒకశాతం పెరిగాయి. హీరో మోటోకార్ప్, సన్ ఫార్మా, బజాజ్ ఆటో, అపోలో హాస్పిటల్స్, శ్రీరామ్ ఫైనాన్స్ నిఫ్టీలో ప్రధానంగా లాభాలను నమోదు చేశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఎటర్నల్, టాటా స్టీల్ నష్టపోయాయి. విస్తరణ ప్రణాళిక నేపథ్యంలో హీరో మోటోకార్ప్ షేర్లు 5 శాతం పెరిగాయి. ర్యాలీస్ ఇండియా షేర్లు 52 వారాల గరిష్టాన్ని తాకాయి. క్యూ 1లో లాభం దాదాపు రెట్టింపు అయిన విషయం తెలిసిందే. తేజస్ నెట్‌వర్క్స్ షేర్లు క్యూ 1లో నష్టాల నేపథ్యంలో షేర్లు 6 శాతం పడిపోయాయి. యూఎస్ పేటెంట్ సెటిల్‌మెంట్ లెక్సెల్వి ప్రారంభానికి మార్గం సుగమం కావడంతో సన్ ఫార్మా షేర్లు దాదాపు 3శాతం పెరిగాయి. ఈస్ట్ సెంట్రల్ రైల్వే నుంచి ఆర్డర్లతో రైల్‌టెల్ కార్పొరేషన్ షేర్లు 2 శాతం పెరిగాయి. టాటా టెక్నాలజీస్ షేర్లు జూన్ త్రైమాసికంలో నికర లాభం 5శాతం పెరగడంతో షేర్లు 2 శాతం పెరిగాయి. బీఎస్‌ఈలో 140 స్టాక్‌లు 52 వారాల గరిష్ట స్థాయికి చేరాయి. ఇందులో ఆథమ్ ఇన్వెస్ట్‌మెంట్, నిప్పాన్ లైఫ్, హెచ్‌డీఎఫ్ ఏఎంసీ, గాడ్‌ఫ్రే ఫిలిప్స్, జిల్లెట్ ఇండియా, యూటీఐ ఏఎంసీ, పిరమల్ ఎంటర్‌ప్రైజెస్, అనుపమ్ రసాయనన్, లారస్ ల్యాబ్స్, ఈఐడీ ప్యారీ, గ్లోబల్ హెల్త్, సియట్, జేఎం ఫైనాన్షియల్ ఉన్నాయి.

# ఆంధ్రప్రదేశ్

## అమరావతిపై పరస్పర విరుద్ధ ప్రకటనలు

### జగన్ మానసిక పరిస్థితిపై ఆందోళన

### ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శలు

విశాఖపట్నం : అమరావతిపై జగన్ మాట్లాడిన మాటలు చూస్తే ఆయన మానసిక పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. అమరావతిపై జగన్‌లా ఇన్ని ప్రకటనలు చేసిన వ్యక్తి ప్రపంచంలో మరెవరూ ఉండరంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారు. మతిస్థిమితలం లేని వ్యక్తిలా ఆయన మాటలు ఉన్నాయని అన్నారు. పరస్పర విరుద్ధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పార్లమెంట్‌లో అమరావతి రాజధాని బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు . ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి వివిధ సందర్భాల్లో రాజధాని గురించి మాట్లాడిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే విడుదల చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా అమరావతిని అంగీకరించారని.. గెలిచిన తర్వాత మూడు రాజధానులు అన్నారని గంటా శ్రీనివాస్ తెలిపారు. అమరావతి తీర్మానంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశానికి కూడా హాజరు కాలేదన్నారు. పార్లమెంట్‌లో అమరావతికి వ్యతిరేకంగా ఉన్న ఏకైక పార్టీ వైసీపీ అని తెలిపారు. మొన్నటి వరకు ఉత్తరాంధ్ర అన్న జగన్.. ఇప్పుడు మావిగన్ అని అంటున్నారని అన్నారు. మాజీ సీఎంకు ఏ అంశంపైనా ఒక స్థిరమైన అభిప్రాయం లేదని ఎమ్మెల్యే విమర్శించారు. వైసీపీకి 151 సీట్ల నుంచి 11 సీట్లకు ప్రజలు తీర్పు ఇచ్చినా జగన్ మారడం లేదన్నారు ఎమ్మెల్యే. ఏప్రిల్ 15వ తేదీ లోపు గూగుల్ శంకుస్థాపన చేయొచ్చని వెల్లడించారు. అమరావతి కలల రాజధానిని సాధించుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వం అమరావతి ప్రజలను ఎన్ని ఇబ్బందులు పెట్టిందో అంతా చూశారన్నారు. రాష్ట్రపతి ఆమోదంతో జగన్ రాజధాని అమరావతిని ఇంచు కూడా కదపలేరని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

## పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు

### మాజీమంత్రి పేర్ని నానిపై పోలీస్ కేసు

మచిలీపట్నం,ఏప్రిల్3 : మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నానిపై చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. గురువారం మచిలీపట్నం కొబ్బరి తోటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత ఘటన నేపథ్యంలో పోలీసులపై మాజీ మంత్రి అనుచిత వ్యాఖ్యలు చేశారు. చిలకలపూడి సీఐ పరమేశ్వరరావును బాడీ షేమింగ్ చేస్తూ అవమానించారు. అంతేకాకుండా పోలీసులను బెదిరించారు. పోలీసుల పట్ల మాజీ మంత్రి వ్యవహరించిన తీరుపై కృష్ణా జిల్లా పోలీస్ అధికారుల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలీస్ అధికారుల సంఘం ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో పేర్ని నానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిన్న మచిలీపట్నం కొబ్బరితోటలో అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై స్పందించిన పేర్ని నాని పోలీసులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎవ్వరినీ వదలమని, తమ ప్రభుత్వం వచ్చాక అంతు చూస్తామంటూ పోలీసులను ఉద్దేశించి పేర్ని నాని వ్యాఖ్యలు చేశారు.

## తవణంపల్లి మండలంలో దారుణ ఘటన

### యువకుడిని హత్యచేసి చెరువుల పడేసిన దుండగులు

చిత్తూరు,ఏప్రిల్ 3 : చిత్తూరు జిల్లాలోని తవణంపల్లి మండలంలో దారుణ ఘటన వెలుగుచూసింది. మొదలపల్లి గ్రామానికి చెందిన లవ కుమార్ (28) అనే యువకుడిని గుర్తు తెలియని దుండగులు అత్యంత కిరాతకంగా హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని సమీప చెరువులో పడేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానికుల సమాచారం ప్రకారం.. లవకుమార్ గత కొంత కాలంగా అమర్ రాజా కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు అతడిని హతమార్చి, మృతదేహాన్ని సమీపంలోని చెరువులో పడేశారు. చెరువులో మృతదేహం తేలడాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పాత కక్షల వల్ల ఈ హత్య జరిగిందా? లేక మరేదైనా కారణం ఉందా అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించిన పోలీసులు, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## మంత్రి జూపల్లిని కలిసిన పర్యాటక ఎండి గౌతమి

హైదరాబాద్,ఏప్రిల్3 : పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ గా ఇటీవల నియమితులైన వాణి ప్రసాద్, అలాగే పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి. గౌతమి శుక్రవారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు.. వారికి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, నూతన ప్రాజెక్టులపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## పుదుచ్చేరిలో మోడీ భారీ రోడ్‌షో

### ఎన్‌డిఎ అభ్యర్థుల తరపున ప్రచారం

పుదుచ్చేరి,ఏప్రిల్3 : జాతీయ ప్రజాస్వామ్య కూటమి ఎన్‌డిఎకు మద్దతు కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుదుచ్చేరిలో శుక్రవారంనాడు భారీ రోడ్‌షో నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి, పాండిచ్చేరి హోం మంత్రి ఎ.నమశ్శివాయం సైతం ఈ రోడ్‌షోలో పాల్గొన్నారు. అజంతా సిగ్నల్ పాయింట్, కామరాజ్ విగ్రహం-రాజా థియేటర్ సిగ్నల్ మధ్య సుమారు రెండు కిలోమీటర్ల మేర గంటసేపు రోడ్‌షో జరిగింది. సాంస్కృతిక ప్రదర్శనలు, సాంప్రదాయ నృత్యాలు ముందుకు సాగగా, బీజేపీ కార్యకర్తలు, అల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ (ఏఐఎన్ఆర్‌స్) కార్యకర్తలు పార్టీ జెండాలతో పెద్దఎత్తున పాల్గొన్నారు. దీనికి ముందు, పుదుచ్చేరి చేరుకున్న ప్రధానమంత్రికి బీజేపీ మద్దతుదారులు ఘనస్వాగతం పలికారు. 'జైశ్రీరామ్' 'భారత్ మాతా కీ జై' నినాదులు హోరెత్తించారు. ప్రధాన కాన్వాయ్‌పై పూలజల్లులు కురిపించారు. పుదుచ్చేరిలో ఏఐఎన్ఆర్‌సీ-బీజేపీ కూటమి మరోసారి అధికారంలోకి వచ్చేందుకు విస్తృత ప్రచారం సాగిస్తున్న తరుణంలో మోదీ రోడ్‌షోతో ప్రచారం మరింత ఊపందుకుంది. ఇటీవల పుదుచ్చేరి బీజేపీ కార్యకర్తలతో వర్చువల్ షోలోనూ మోదీ పాల్గొని వారిని మరింత ఉత్సాహపరిచారు. ఈ ఎన్నికల్లో సీట్ల పంపకాల్లో భాగంగా ఏఐఎన్ఆర్‌సీ 16 స్థానాల్లోనూ, బీజేపీ 10 స్థానాల్లోనూ పోటీ చేస్తున్నాయి. కూటమిలో ఇతర భాగస్వాములుగా ఉన్న ఆన్నాడీఎంకే, లాట్చియ జననాయగ కట్చి (ఎల్‌జేకే) చెరో రెండు స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. పుదుచ్చేరి అసెంబ్లీకి ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## మచిలీపట్నం ఘటనలో పోలీసులు తీరు దారుణం

### అక్రమ కూల్చివేతలు అడ్డుకుంటే కేసులా

### మాజీమంత్రి పేర్నినాని ఘాటు విమర్శలు



మచిలీపట్న్,ఏప్రిల్3 : మచిలీపట్నం కొబ్బరితోటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత ఘటనలో పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే కారణంగా రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని నానిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. అయితే.. దీనిపై పేర్ని నాని స్పందించారు. గురువారం జరిగిన ఈ ఘటనపై జిల్లా పోలీస్ అధికార సంఘం అధినేత జయపాల్.. ప్రెస్‌మీట్లో మాట్లాడిన విధానాన్ని తప్పుబట్టారు. నిన్న జరిగిన సంఘటనకు సంబంధించిన వీడియోను చూసి జయపాల్ మాట్లాడిఉంటే బాగుండేది. అక్కడ జరిగిన సంఘటన ఏమిటి? ఆయన ప్రెస్ మీట్లో మాట్లాడిందేమిటి.? వైసీపీ తరపున శాసనసభ ఎన్నికల్లో పోటీచేసిన వ్యక్తి పేర్ని కిట్టు. ఆయనతో పాటు కార్పొరేటర్లు వచ్చి అండగా నిలబడ్డారు. గత ప్రభుత్వంలో ఏ పేదవాని ఇంటినీ మేం కూల్చలేదు. కానీ మున్సిపల్ అధికారులు ఇప్పుడు కొబ్బరితోటలను కూల్చడం ప్రారంభించారు. గౌరవం ఇచ్చిపుచ్చుకోవాలని తెలిపారు.. బాగుంది. కానీ అక్కడ ఏం జరిగిందో జయపాల్ తెలుసుకోకుండా.. బాడీ షేమింగ్ చేశారని ఎలా మాట్లాడారు? అసలు ఆ సీఐని మేమెక్కడా ఉదహరించలేదు. ఆయన పేరుతో ఏమీ అనలేదు. అయినా ఏకవచనంతో మీరు మాట్లాడవచ్చా?' అని పేర్ని నాని ప్రశ్నించారు. నా మీద, నా కొడుకు మీద అక్రమ కేసులు కట్టారు. కేవలం పబ్లిసిటీ కోసం ఎవరు ఎదిగారు? ఎవరు ఆరాటపడుతున్నారు? జయపాల్.. నాకు రాజకీయ పబ్లిసిటీ దేనికి? నేను ప్రజలకోసం పోరాటంచేసే వ్యక్తిని? కొందరు పోలీసులు భయంలేకుండా తప్పులు చేస్తున్నారు. మీలా అందరూ మంచి వ్యక్తులు లేరు. పోలీస్ వ్యవస్థ మారింది. పోలీసులు మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకుని పనిచేస్తే అప్పుడు ప్రజలకు పోలీసులతో అవసరమేమీ ఉండదుగా.!' అని వ్యాఖ్యానించారు మాజీ మంత్రి. రెడ్‌బుక్ రాజ్యాంగం రాగానే పామర్రులో ఓ అధికారికి ఎందుకు పోస్టింగ్ ఇచ్చారని ప్రశ్నించిన ఆయన.. ఆ తర్వాత మళ్లీ నాలుగు జిల్లాల అవతలికి ఎందుకు పంపారన్నారు. పోలీస్ వ్యవస్థలో తప్పుచేసిన కొందరు అధికారులను ప్రశ్నించడం తప్పా అని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు పేర్ని నాని. మంత్రి కొల్లు రవీంద్ర ఎన్నోసార్లు పోలీస్ అధికారులను తిట్టారుగా.? అప్పుడీ పోలీస్ జిల్లాధ్యక్షుడికి(జయపాల్‌ను ఉద్దేశించి) కనపించలేదా.? మరప్పుడెందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. 'పోలీసులు సుదీర్ఘ కాలం పనిచేస్తారు. కానీ ఎక్కడా ఎక్కువ కాలం ఉండరు. పవిత్రమైన యూనిఫామ్ వెనుక తప్పుచేసే అధికారిని మాత్రమే మేం ప్రశ్నించాం. అంతేతప్ప నేనెప్పుడూ ఏ పోలీస్ అధికారినీ ఉద్దేశపూర్వకంగా అనలేదు. తప్పుచేసే వ్యక్తులను నిలదీయడం మీ దృష్టిలో తప్పా?' అని చెప్పుకొచ్చారు.

## తమిళనాట 27మందితో బిజెపి జాబితా

### అన్నామలైకి దక్కని స్థానం

### పార్టీతో దూరం పెరిగిందన్న ప్రచారం

చెన్నై,ఏప్రిల్3 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే 27 మంది పార్టీ అభ్యర్థులను బీజేపీ శుక్రవారంనాడు ప్రకటించింది. కీలక నేతలైన పార్టీ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు నాగేంద్రన్, కేంద్ర మంత్రి ఎల్ మురుగన్, తమిళిసై సౌందరరాజన్‌కు పార్టీ టిక్కెట్ దక్కినప్పటికీ, పార్టీ మాజీ అధ్యక్షుడు, కీలక నేత కె.అన్నామలైకి ఈ జాబితాలో చోటుదక్కలేదు. అన్నామలై 2021 జూలై నుంచి ఏప్రిల్ 2025 వరకూ బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడుగా ఉన్నారు. అయితే ఈసారి ఎన్నికల్లో పోటీకి ఆయనను పార్టీ అధిష్ఠానం దూరంగా ఉంచింది. దీనిపై నాగేంద్రన్‌ను అడిగినప్పుడు, పార్టీ కేంద్ర నాయకత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. పార్టీ ప్రకటించిన 27 మంది కచ్చితంగా నెగ్గితీరుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అన్నామలైకు టిక్కెట్ ఇవ్వకపోవడం వెనుక కారణాలపై తాజాగా చర్చజరుగుతోంది. బీజేపీ-అన్నాడీఎంకే మధ్య సీట్ల పంపకాలపై మొదట్నించీ అన్నామలై అసంతృప్తితో ఉన్నారు. దీనితోపాటు, బీజేపీ సునాయాసంగా నెగ్గే సీట్లను అన్నాడీఎంకే కేటాయించ లేదంటూ బీజేపీ అధిష్ఠానానికి ఆయన లేఖ రాశారు. ఈసారి పోటీకి తనను దూరంగా ఉంచాలని కూడా అధిష్ఠానాన్ని ఆయన కోరినట్టు చెబుతున్నారు. అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తును అన్నామలై ఏనాడూ సమర్ధించలేదు. ఎన్డీయేలోకి అన్నాడీఎంకే తిరిగి రావాలంటే అన్నామలైను బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించాలని పొత్తులకు ముందు బీజేపీ అధిష్ఠానం ముందు ఎడప్పాడి కె పళనిస్వామి షరతు పెట్టినట్టు కూడా అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ తదనంతర క్రమంలో తన తండ్రికి అనారోగ్యంగా ఉందంటూ పార్టీ అధ్యక్ష పదవికి అన్నామలై రాజీనామా చేయడం, నాగేంద్రన్ ఆ పదవిని చేపట్టడం జరిగింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో అరవకురిచ్చి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అన్నామలై పోటీ చేశారు. డీఎంకే అభ్యర్థి ఆర్.ఇలాంగో చేతిలో 24,000 ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు.

## పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం

### పార్టీ నాకు అప్పగించిన బాధ్యత ఇదే


### తమిళనాడు బిజెపి నేత అన్నామలై

చెన్నై,ఏప్రిల్3 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాలో తన పేరు లేకపోవడంపై బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అన్నామలై స్పందించారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల తరఫున ప్రచారం చేయడమే తన పాత్ర అని, అది తన బాధ్యత అని చెప్పారు. కన్నూరులో శుక్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో అన్నామలై పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుతానికి తమిళనాడులో పోటీ చేసే పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం కొనసాగించడమే తనకు అప్పగించిన బాధ్యత అని చెప్పారు. ప్రస్తుతం పుదుచ్చేరి, కేరళలో ఈనెల 7వ తేదీ వరకూ ప్రచారం ఉంటుంది. 7వ తేదీ నుంచి 23 వరకూ తమిళనాడులో బీజేపీ, ఎన్డీయే అభ్యర్థులందరి తరఫున ప్రచారంలో పాల్గొంటాను. పార్టీ అప్పగించిన బాధ్యత ఇది. దానికి పూర్తి న్యాయం చేస్తాను' అని అన్నామలై చెప్పారు. కన్నూరులో బీజేపీ అభ్యర్థి సి.రఘునాథ్ తరఫున ఆయన ప్రస్తుతం ప్రచారం సాగిస్తున్నారు. ఎన్డీయే కూటమితో సంప్రదింపుల అనంతరం తమిళనాడులో పోటీ చేసే 27 మంది అభ్యర్థుల జాబితాను బీజేపీ శుక్రవారం విడుదల చేసింది. తమిళనాడు బీజేపీలో 'సింహం'గా పేరున్న కె.అన్నామలైకి ఈ జాబితాలో చోటులేకపోవడం చర్చనీయాంశమైంది. అయితే అన్నామలై మాత్రం అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ప్రకటించిన అభ్యర్థులకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో అభినందనలు తెలిపారు. డీఎంకేపై విమర్శలు గుప్పించారు. బీజేపీ కార్యకర్తగా బీజేపీ, ఎన్డీయే అభ్యర్థుల విజయానికి పాటుపడతానని చెప్పారు. పార్టీ అభ్యర్థుల జాబితాను కూడా ఆయన తన ట్వీట్‌కు జతచేశారు. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ఏప్రిల్ 23న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## ఉమ్మడి పౌరస్మృతితో చొరబాటు దారులకు చెక్

### వారు ఇక్కడ నాలుగేసి పెళ్లిళ్లు చేసుకోకుండా అడ్డుకట్ట

### అసోం ఎన్నికల ప్రచారంలో అమిత్ షా



గువాహటి,ఏప్రిల్3 : చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతి తో అడ్డుకునే వీలుంటుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. అస్సాంలోని గోల్‌పాడాలో శుక్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో అమిత్‌షా మాట్లాడుతూ, తిరిగి తాము అధికారంలోకి వస్తే అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. గిరిజనాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సమగ్ర మ్యాప్ సిద్ధం చేశారని అమిత్‌షా తెలిపారు. దీనిని ముందుకు తీసుకువెళ్లి, సమర్థవంతంగా అమలు చేయాలంటే బీజేపీకే ప్రజలు ఓటు వేయాలని కోరారు. మోదీ నాయకత్వంలో తొలిసారి గిరిజన మహిళ దేశ అధ్యక్షురాలు అయిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నడూ ఆదివాసీ మహిళలను రాష్ట్రపతి చేయలేదని, మోదీ వచ్చాక పరిస్థితి మారిందని, ద్రౌపది ముర్ము దేశానికి తొలి పౌరురాలు అయ్యారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతున్నారంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. యూసీసీ నుంచి ఆదివాసీ ప్రాంతాలను మినహాయిస్తామని చెప్పారు. పొరుగున్న ఉన్న మేఘాలయాలో చొరబాటుదారులు ఇటీవల గరో హిల్స్ అటానమస్ జిల్లా కౌన్సిల్‌లో గిరిజన మహిళలను పెళ్లాడి రాజకీయ పలుకుబడిని సంపాదించే ప్రయత్నం చేశారని, ఇది ఉద్రిక్తతలకు దారితీసిందని అమిత్‌షా చెప్పారు. అస్సాంలో తమకు మరో ఐదేళ్లు అధికారం ఇస్తే యూసీసీని అమలు చేయడంతో పాటు చొరబాటుదారుల నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అస్సాంలో శాంతిని బీజేపీ పునరుద్ధరించిందని, కాంగ్రెస్ తిరిగి వచ్చినా, కొన్ని సీట్లలో నెగ్గినా కూడా తిరిగి రాష్ట్రంలో అస్థిరత నెలకొంటుందని హెచ్చరించారు. అస్సాం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## కవిత పార్టీ టిఆర్ఎస్ అవుతుందా?

### పాతపార్టీతో కొత్తగా వస్తామనడంలో ఆంతర్యం

### రాజకీయ వర్గాల్లో ఇప్పుడు ఈ విషయమై చర్చ

హైదరాబాద్,ఏప్రిల్3 : తెలంగాణ రాజకీయాల్లో కవిత తెలవిగా అడుగులు వేస్తున్నట్లుగా ఉంది. టిఆర్ఎస్ పార్టీని పునరుద్దరించుకోవడం ద్వారా రాజకీయంగా సులువుగా ప్రజల్లోకి వెళ్లడానికి మార్గం సుగమం చేసుకుంటున్నారని ఆమె వ్యాఖ్యలను బట్టి అర్థం అవుతోంది. కెసిఆర్ వదులుకున్న టిఆర్ఎస్‌నే సొంతం చేసుకుని తెలంగాణ శక్తిగా ఎదగాలని చూస్తున్నట్లు అర్థం అవుతోంది. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఖాళీగా ఉందని.. దానిని ఎవరైనా వాడుకోవచ్చునని చెప్పారు. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేకంగా ఒక టీమ్ పని చేస్తోందన్నారు. పార్టీ ఆవిర్భావం రోజు.. అమరవీరుల స్తూపం వద్దకు వెళ్తామని పేర్కొన్నారు. తాను స్థాపించ బోయే పార్టీకి పాత పేరు.. కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం ప్రకటించారు. అలాగే టిఆర్ఎస్ పేరు ఖాళీగా ఉందని కూడా అన్నారు. దీనిని బట్టి కవతి పార్టీ తెలంగాణ రాష్ట్ర సమితి అవుతుందన్న ఊహాగానాలు వస్తున్నాయి. ఇకపోతే తమకు ప్రధాన శత్రువు అధికార కాంగ్రెస్ పార్టీనే అని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్లతో కల్వకుంట్ల కవిత ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తమ పార్టీ ప్రొ. జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే నడుస్తుందన్నారు. తమ పార్టీకి బిహార్ సిద్ధాంతకర్త ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని పేర్కొన్నారు. గుంపు మేస్త్రీ గుంట నక్కలు దోస్తులంటూ సీఎం రేవంత్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుపై కవిత పరోక్ష విమర్శలు చేశారు. సిద్ధిపేట అసెంబ్లీ నియోజకవర్గం మహిళా రిజర్వేషన్‌గా చేస్తే.. ఆ స్థానం నుంచి ఎన్నికల బరిలో దిగుతానన్నారు. గజ్వేల్ మహిళా రిజర్వేషన్ వచ్చినా పోటీ చేసే అంశాన్ని ఆలోచిస్తానని తెలిపారు. సీఎం రేవంత్.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేసి ఆ పార్టీని ఓడించారని.. అలాగే ప్రస్తుతం కేరళలో ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీని ఓడిస్తారని వ్యంగ్యంగా అన్నారు. రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ అంటున్నారని.. కానీ అసలు సిటీని చంపకుంటే చాలని కవిత చరకలంటించారు. మొత్తంగా కవిత రాజకీయ పార్టీ బహుశా టిఆర్ఎస్ అవుతుందని భావించాలి. అయితే ఈ పార్టీని పొందడం అంత సులువేనా అన్నది మున్ముందు చూడాలి. ఈ నెల 26న పార్టీ పేరును, ఎజెండాను ప్రకటిస్తామని కవిత ఇప్పటికే తెలిపారు. ఒకవేళ టిఆర్ఎస్ పేరు దక్కితే బిఆర్ఎస్ ఉనికికి ప్రమాదం ఏర్పడినట్లే.

## కవలలను బావిలోకి తోసి చంపేసిన కర్కశుడు

కరీంనగర్,ఏప్రిల్3 : కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్‌లో దారుణం చోటు చేసుకుంది. కన్న కూతుళ్లను అల్లారుముద్దుగా చూసుకోవాల్సిన తండ్రి.. కర్కశుడిగా మారాడు. తన ఇద్దరు కవల పిల్లల్ని బావిలో తోసేసి హతమార్చాడు. తొలుత వారిని బావిలోకి నెట్టేసిన శ్రీశైలం.. తానూ దూకేశాడు. అయితే, ఈత రావడంతో సురక్షితంగా బయటకు వచ్చేశాడు. సమాచారం అందుకున్న స్థానికులు బావిలో వెతకగా.. ఒక బాలిక మృతదేహం లభ్యమైంది. మరో మృతదేహం కోసం గాలిస్తున్నారు. ఆగ్రహించిన గ్రామస్థులు తండ్రికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణమని ప్రాథమికంగా నిర్ధరించారు.

## అమరావతిపై వైసీపీకి స్పష్టత లేదు

### మాజీ ఎంపి విజయసాయి విమర్శలు

అమరావతి,ఏప్రిల్3 : రాజధాని అమరావతిపై వైసీపీకి స్పష్టత కానీ.. స్థిరమైన విధానం కానీ లేదని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి విమర్శించారు. గురువారం రాజ్యసభలో రాజధాని అమరావతి బిల్లు ఆమోదం పొందే సమయంలో వైసీపీ ఎంపీలు వ్యవహరించిన తీరుపై విజయసాయిరెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.



# పాకెట్ నవల్ మూవీతో ఎంతో నేర్చుకున్నా

## నటి మాళవికా మోహనన్

ఒంటరితనం వల్ల తాను ఎంతో బాధ పడ్డానని నటి మాళవిక మోహనన్ తెలిపారు. సోషల్‌మీడియా వేదికగా మార్చి నెల అనుభవాలను అభిమానులతో పంచుకున్న ఆమె ఈమేరకు పోస్ట్ పెట్టారు. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే.. త్యాగరాజన్ కుమారరాజ దర్శకత్వంలో 'పాకెట్ నవల్' కోసం వర్క్ చేయడం. అత్యుత్తమ దర్శకుల్లో ఆయన ఒకరని నిస్సందేహంగా చెప్పగలను. ఆయన మూవీ మేకింగ్ స్టైల్‌ను గమనించడం.. ఆయన మార్గదర్శకత్వంలో నటిగా నన్ను నేను మలుచుకోవడం.. కెరీర్‌పరంగా అదొక అద్భుతమైన సృజనాత్మక అనుభవం. షూటింగ్‌లో భాగంగా నెలలో చాలా రోజులు చెన్నైలోనే గడిపా. వర్క్ మంచిగానే ఉన్నప్పటికీ ఇంటికి అంతకాలం దూరంగా ఉండటం ఊహించిన దానికంటే ఎక్కువగా కుంగదీసింది. రోజంతా కష్టపడి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఒక్కదాన్నే ఉన్నాననే ఫీలింగ్ అంత సులభంగా తీసుకోలేకపోయా. నా కుటుంబసభ్యులు నన్ను చూడటానికి చెన్నై వచ్చినప్పుడు నాకెంతో ఉపశమనంగా అనిపించింది. చెన్నై, మహాబలిపురంలోని దేవాలయాలను సందర్శించా. ఇష్టమైన భోజనం చేశా. హాయిగా సమయాన్ని ఆస్వాదించా. కొన్ని రోజుల క్రితమే ముంబయికి తిరిగివచ్చా. ఇంటికి దూరంగా ఉన్నాననే భావన నుంచి బయటకు వచ్చేందుకు సాయంత్రం వేళల్లో పడవ ప్రయాణానికి వెళ్లేదానిని అని మాళవిక రాసుకొచ్చారు.




# ఒత్తిడిని తట్టుకునే చిట్కాలతో ముందుకు సాగుతా: శ్రీలీల

పాత్రలో లీనమవడం ఎంత ముఖ్యమో, దానినుంచి బయటకు రావడం కూడా అంతే ముఖ్యం. షూటింగ్ ఒత్తిడి నుంచి బయటపడటానికి నేను కొన్ని చిన్నచిన్న అలవాట్లను చేసుకున్నాను. సంగీతం వినడం, కాసేపు ఒంటరిగా గడపడం, కుటుంబసభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడటం వంటివి నాకు ఉపశమనాన్ని ఇస్తాయని నటి శ్రీలీల తన అనుభవాలను పంచుకున్నారు. ఫ్రెండ్స్‌తో చిట్‌చాట్ చేయడం నాకు రిలీఫ్‌గా ఉంటుంది. నేను పని ఒత్తిడిని ఇంటికి తీసుకెళ్లకూడదని ప్రయత్నిస్తాను. ఒకవేళ పొరపాటున అలా జరిగినా, పైన చెప్పిన చిన్న చిన్న పద్ధతులు నన్ను మళ్లీ మామూలు స్థితికి తీసుకువస్తాయి. కొన్నిసార్లు పరిస్థితులకు అనుగుణంగా మనల్ని మనం సర్దుబాటు చేసుకుంటూ ముందుకుసాగడమే ఏకైక మార్గం అని శ్రీలీల తెలిపారు. ప్రస్తుతం శ్రీలీల కోలీవుడ్‌లో బిజీగా మారింది. 'పరాశక్తి'తో తమిళనాట అడుగుపెట్టిన ఆమె ధనుష్‌తో కలిసి 'డీ55' (వర్కింగ్ టైటిల్)లో నటిస్తోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఇది రానుంది. దీనితో పాటు అనురాగ్ బసు దర్శకత్వంలో బాలీవుడ్ ఎంట్రీకి కూడా శ్రీలీల సిద్ధమవుతున్నారు.




# ఓటిటిలోకి ఎస్ సరస్వతి మూవీ

వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన సైకలాజికల్ థ్రిల్లర్ 'ఎస్. సరస్వతి'. గత నెల మార్చి 6న థియేటర్లలో విడుదలై ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి అడుగుపెట్టింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాలో వరలక్ష్మితో పాటు ప్రకాశ్ రాజ్, ప్రియమణి, జీవా, మురళీ శర్మ, రావు రమేశ్, రాధికా శరత్‌కుమార్ వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషించారు. కథ విషయానికి వస్తే, లక్ష్మి అనే ఓ అనాథ మహిళ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ తన కూతురు 'ఎస్. సరస్వతి'ని ఎంతో ప్రేమగా పెంచుకుంటుంది. అయితే ఆగస్టు 15న తన కూతురిని స్కూల్లో దించి ఉద్యోగానికి వెళ్లిన లక్ష్మి.. ఆ తర్వాత తన కూతురు కనిపించడం లేదని, స్కూల్లోనే ఆమెపై అఘాయిత్యం జరిగిందని పోలీసులను ఆశ్రయిస్తుంది. పోలీసులు విచారించగా అసలు అలాంటి పాపే ఆ స్కూల్లో లేదని తేలడంతో కథ ఊహించని మలుపు తిరుగుతుంది. ఇంతకీ ఆ పాప ఏమైంది, లక్ష్మి చెబుతున్నది నిజమా లేక ఇదంతా ఆమె భ్రమా అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సస్పెన్స్ థ్రిల్లర్ సాగుతుంది. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన వారు ఇప్పుడు నేరుగా ప్రైమ్ వీడియోలో ఈ చిత్రాన్ని వీక్షించవచ్చు.




# కొత్త మూవీని ప్రకటించిన సాయిదుర్గా తేజ్

వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు సాయి దుర్గా తేజ్. తాజాగా ఆయన ఒక కొత్త మూవీని ప్రకటించారు. 'క' సినిమాతో విజయాన్ని అందుకున్న సుజీత్, సందీప్ ల దర్శకత్వంలో సాయిదుర్గా తేజ్ హీరోగా ఈ చిత్రం రానుంది. 'ఎస్‌డీటీ 19' వర్కింగ్ టైటిల్‌తో దీన్ని అధికారికంగా ప్రకటించారు. 'యుగాలుగా బయటకు రాని రహస్యాలు, ఊహకు అందని శక్తులు.. అత్యంత శక్తిమంత ప్రయాణమిది' అని క్యాప్షన్‌తో దీనిపై పోస్ట్ పెట్టారు. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుంది. ప్రస్తుతం సాయిదుర్గా తేజ్ 'ఎస్.వై.జి' (సంబరాల ఏటిగట్టు)తో బిజీగా ఉన్నారు. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. రోహిత్.కె.పి. దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఇది విడుదల కానుంది. దీనిపై ఇటీవల ఈ హీరో మాట్లాడుతూ.. 'బ్రో' తర్వాత ఖరారైన నా రెండు సినిమాలు ఆగిపోయాయి. ఆ తర్వాత ఇందులో నటించే అవకాశం వచ్చింది. ఈ సినిమా కోసం నా సర్వస్వం ధారపోస్తూ... శాయశక్తులా కష్టపడుతున్నా. మంచి బృందంతో కలిసి చేస్తున్న ఈ సినిమా నా కెరీర్‌లో ఒక అద్భుతంలా నిలిచిపోతుందని అన్నారు.




# వేసవిలో నవ్వుల వినోదం రాకాస చిత్రం

కమిటీ కుర్రోళ్లు'తో నిర్మాతగా తన అభిరుచిని చాటారు నిహారిక కొణిదెల. ఇప్పుడు సంగీత్ శోభన్ కథానాయకుడిగా బలమైన ప్రచారంతో 'రాకాస' సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. వీరబాబు అలియాస్ వీరు (సంగీత్ శోభన్) తాను ప్రేమించిన అమ్మాయి కోసం అమెరికా నుంచి ఎంతో హుషారుగా ఊరికి తిరిగొస్తాడు. అయితే అప్పటివరకూ తనని ఫోన్ కాల్స్‌లో కవ్విస్తూ, ముద్దు ముద్దుగా మాట్లాడిన ఆ అమ్మాయి మరొకరితో పెళ్లి పీటలెక్కేందుకు సిద్ధమైందని తెలుసుకుంటాడు. ఎలాగైనా ఆ పెళ్లిని ఆపాలని తన స్నేహితుడు బాలు (గెటప్ శ్రీను)తో కలిసి రకరకాల ప్రయత్నాలు చేస్తుంటాడు. అందులో భాగంగా తనతోపాటు చిన్నప్పుడు కలిసి చదువుకున్న సుబ్బలక్ష్మి (నయన్ సారిక)నీ కలుస్తారు. చివరికి వీరు, సుబ్బలక్ష్మి మధ్య ప్రేమ చిగురిస్తుంది. ఊరి సమీపంలోని రాక్షస కోట నరబలి కోరడం అక్కడ ఆనవాయితీ. మూడు సంకేతాల తర్వాత ఊరంతా కలిసి ఒకరి పేరుని ఖరారు చేస్తుంటారు. ఆ వ్యక్తిని కోటలోకి పంపుతారు. అలా చేస్తేనే ఊరికి మంచి జరుగుతుందని, లేదంటే బ్రహ్మ రాక్షసుడి కారణంగా ఊరంతా నాశనమవుతుందనేది స్థానికుల నమ్మకం. అయితే ఊహించని రీతిలో వీరు కోటలోకి వెళ్లాల్సి వస్తుంది. మరి కోటలోకి వెళ్లిన వీరు తిరిగొచ్చాడా? అతన్ని కాపాడేందుకు సుబ్బలక్ష్మి, బాలు ఏం చేశారు? ఇంతకీ ఆ కోటలో ఉన్న రాక్షసుడి చరిత్ర ఏమిటనే విషయాల్ని తెరపై ప్రదర్శించారు. ఒక కోట...అందులో భీకరమైన బ్రహ్మ రాక్షసి అనగానే ఎవరికైనా హారర్ నేపథ్యమే గుర్తొస్తుంది. ప్రచార చిత్రాలు కూడా అదే అభిప్రాయాన్నే కలిగిస్తాయి. కానీ, ఈ సినిమా భయపెట్టడం కంటే కూడా, ఫాంటసీ ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ కథలో లీనం చేయడంపైనే ఎక్కువగా దృష్టి పెట్టింది. హారర్ కామెడీతో కాకుండా, ఓ ఫాంటసీ కామెడీ కథగా దీనిని తీర్చిదిద్దారు. థియేట్రికల్ అనుభూతిని పంచేలా సాగే కోట నేపథ్యంలోని సన్నివేశాలు, ద్వితీయార్థంలో కామెడీ సినిమాకి బలం.

చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో చెప్పినట్టుగా సన్నివేశాలన్నీ చందమామ కథలా చిన్నారులకు నచ్చేలా ఉంటాయి. ఊరి కథ, మూడు హెచ్చరికలు అంటూ సినిమా ఆసక్తికరంగానే మొదలవుతుంది. ద్వితీయార్థంలో హీరో కోటలోకి వెళ్లినప్పట్నుంచే సినిమా అసలు సిసలు ఆసక్తిని రేకెత్తిస్తుంది. కోటని చూపించిన విధానం, తర్వాత ఏం జరుగుతుందనే ఆసక్తిని రేకెత్తించిన తీరు, రాక్షసుడి చరిత్ర, ప్రధాన పాత్రలు భయపడుతూనే నవ్వించడం సినిమాకి కలిసొచ్చింది. ప్రేక్షకుల ఊహలకు అందని విధంగా పతాక సన్నివేశాలు మలిచారు. కొన్ని మలుపులు మెప్పిస్తాయి. ద్వితీయార్ధం స్థాయిలో ప్రథమార్ధం కూడా ప్రభావం చూపించి ఉంటే ఈ సినిమా ఫలితం వేరుగా ఉండేది. మొత్తంగా అక్కడక్కడా నవ్విస్తూ, భయపెడుతూ, సెలవుల్లో పిల్లలు ఆస్వాదించేందుకు తగ్గ సరికొత్త కాల్పనిక ప్రపంచాన్ని ఆవిష్కరించిన చిత్రమిది. వీరు పాత్రలో సంతోష్ శోభన్ ఒదిగిపోయాడు. గెటప్ శ్రీను, వెన్నెల కిశోర్, నయన్ సారికతో కలిసి ఆయన చేసిన అల్లరి అక్కడక్కడా నవ్వించింది. కామెడీలో బలం లేకపోయినా సరే, తన నటనతో ఆ సన్నివేశాలపై ప్రభావం చూపించే ప్రయత్నం చేశారు. వెన్నెల కిశోర్ పాత్ర పరిచయం తర్వాత సినిమాలో కామెడీ మోతాదు పెరిగింది. బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి పాత్రలు సినిమాలో ప్రధానంగా కనిపిస్తాయి. ఆశిష్ విద్యార్థి, రోహన్ రాయ్ తదితరులు పాత్రల పరిధి మేరకు నటించారు.





# ఆది కొత్త సినిమా సైరాబాను

టాలీవుడ్ యంగ్ హీరో ఆది సాయికుమార్ సరికొత్త లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యారు. అన్ని హద్దులను చెరిపేసే ఒక అందమైన ప్రేమకథగా రూపొందుతున్న ఈ చిత్రానికి 'సైరాబాను' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. ఈ ప్రాజెక్ట్ శుక్రవారం అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. సినీ రంగానికి చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ముహూర్తపు సన్నివేశానికి యంగ్ హీరో కిరణ్ అబ్బవరం క్లాప్ కొట్టగా, ప్రముఖ దర్శకుడు రామ్ అబ్బరాజు మరియు సీనియర్ నటుడు సాయికుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రముఖ రచయిత కోన వెంకట్ మరియు జైన్స్ నాని చిత్ర స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేశారు. ఇక ఈ మొదటి షాట్‌కు దర్శకుడు యోగి దర్శకత్వం వహించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కృష్ణకాంత్ పరుచూరి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com